జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

కృష్ణ మంగళవారం 5 మే 2026 సంపుటి : 01 సంచిక :101 పేజీలు : 12 వెల : 3/- PRGI No. APTEL/26/A0119,

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

కింగ్ మేకర్ కాదు 'కింగే'

పోటీ చేసిన రెండు చోట్ల 'విజయ్'మే!

దేశంలో కమ్యూనిస్టుల పాలన కనుమరుగు!

వివరాలు 2లో..

# తొలి ఇన్నింగ్స్‌లోనే

# విజయం



తమిళనాడులో 'విజిల్' వేసిన విజయ్

బెంగాల్‌లో ఎగురవేసిన బీజేపీ జెండా

కేరళలో బోల్తా పడ్డ కమ్యూనిస్టు పార్టీ..

కాంగ్రెస్ కూటమి ఘన విజయం

సర్వే ఫలితాలకు భిన్నంగా ఎన్నికల ఫలితాలు

ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాల సంచలనం

2



## ఈ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి

- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు మద్దతిచ్చిన ప్రజలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు
- నటుడు విజయ్, ఆయన పార్టీ తమిళగ వెట్రి కళగంకు తెలిపిన అభినందనలు
- తొలి ఎన్నికల్లోనే టీవీకే అద్భుత ప్రదర్శన కనబరిచిందని ప్రశంస
- తమిళనాడు అభివృద్ధి, సంక్షేమానికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని హామీ

2

## ఎన్నికల విజయాన్ని కరూర్ మృతులకు అంకితం చేసిన టీవీకే పార్టీ

- కరూర్ తొక్కిసలాట మృతులకు టీవీకే తమ చారిత్రక విజయం అంకితం
- తమిళనాడు ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన నటుడు విజయ్ పార్టీ
- మహిళల మద్దతుతోనే గెలిచామని, ఇది ఒక విప్లవమని పార్టీ నేతల వ్యాఖ్య
- ఎమ్మెల్యేల ఫిరాయింపుల భయంతో రిసార్టుకు తరలించే యోచనలో టీవీకే

2

## డబుల్ ఇంజన్ సర్కార్‌తో పశ్చిమ బెంగాల్ సురక్షితం



- 'పాలన నచ్చితే ప్రజలు మళ్లీ మళ్లీ గెలిపిస్తారు
- లేదంటే నిర్దాక్షిణ్యంగా ఓడిస్తారు'
- - ఎన్నికల ఫలితాలపై పవన్
- ఎన్నికల్లో గెలిచిన పార్టీలకు డిప్యూటీ సీఎం పవన్ అభినందనలు
- అసోం, పుదుచ్చేరిలో బీజేపీ తన ప్రాభవాన్ని నిలుపుకుంది
- పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిన బీజేపీకి అభినందనలు తెలిపిన పవన్

**అమరావతి**

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం ఎన్నికల ఫలితాలలో మరోసారి ఓటర్ల చైతన్యం స్పష్టంగా కనిపిస్తోందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పాలన నచ్చితే ప్రజలు మళ్లీ మళ్లీ గెలిపిస్తారని, నచ్చకపోతే నిర్దాక్షిణ్యంగా ఓడిస్తారనడానికి ఈ ఫలితాలే చక్కటి ఉదాహరణ అని పవన్ పేర్కొన్నారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ ప్రజలు ఈసారి మార్పును బలంగా కోరుకున్నారని పవన్ అన్నారు. అసోం, పుదుచ్చేరిలో తమ ప్రాభవాన్ని నిలబెట్టుకుని, పశ్చిమ బెంగాల్ ప్రజల మనసును గెలుచుకున్న - మిగతా3లో



## ఏపీలో విభిన్న వాతావరణం!

### కొన్ని ప్రాంతాల్లో తీవ్ర ఎండ.. మరికొన్ని చోట్ల పిడుగుల వాన

**అమరావతి**

రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు మూడు రోజులు కొనసాగే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఎండతీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు ప్రభావం చూపుతాయని వెల్లడించారు. విదర్భ నుండి తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమోరియన్ ప్రాంతం వరకు ద్రోణి కొనసాగుతుందని ఎపిఎస్డీఎంఎ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో మంగళవారం మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో - మిగతా3లో

## పారిశ్రామిక క్లస్టర్లలో అన్ని సౌకర్యాలు కల్పించండి

- ఏపీలో ప్రొడక్ట్ పర్ఫెక్షన్ క్లస్టర్లపై సీఎం సమీక్ష
- ప్రొడెక్ట్ పర్ఫెక్షన్ క్లస్టర్లపై సీఎం సమీక్ష
- విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనమిక్ రీజియన్ ప్రాంతాల్లోని పారిశ్రామిక క్లస్టర్లపైనా చర్చ
- భవ్య పథకం కింద పారిశ్రామిక పార్కుల అభివృద్ధిపైనా చర్చించిన చంద్రబాబు



**అమరావతి**

విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనమిక్ రీజియన్ ప్రాంతాల్లోని పారిశ్రామిక క్లస్టర్లలో అన్ని సౌకర్యాలు కల్పించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రొడక్ట్ పర్ఫెక్షన్ క్లస్టర్లపై చంద్రబాబు నేడు సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన - భవ్య పథకం కింద పారిశ్రామిక పార్కుల అభివృద్ధిపై చర్చించారు. 2026-27లో ఏర్పాటు చేసే రేర్ ఎర్త్ మినరల్ పార్క్, ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ సహా 175 మీవీజు పార్కులను క్లస్టర్ల వారీ అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని చంద్రబాబు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సమావేశానికి మంత్రి టీజీ భరత్, సీఎస్ సాయి ప్రసాద్, పెట్టుబడులు మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో "భవ్య పథకం" కింద పారిశ్రామిక పార్కులు ఏర్పాటు కానున్నాయి. కేంద్రం గ్రాంటుగా ఇచ్చే నిధులతో ఒక్కో పార్కున - మిగతా3లో

# తొలి ఇన్నింగ్స్‌లోనే విజయం

అవి 2021 తమిళనాడు శాసన సభ ఎన్నికలు... పోలింగ్ రోజున హీరో విజయ్ చెన్నైలోని తన ఇంటి నుంచి సైకిల్ తొక్కుకుంటూ బయటకు వచ్చారు... సైకిల్ తొక్కుతూ పోలింగ్ బూత్ కు వెళ్లి ఓటు వేసి వచ్చారు... తద్వారా తాను రాజకీయాల్లోకి వస్తానని తొలిసారి గా సంకేతం ఇచ్చారు. అప్పుడు సైకిల్ తొక్కుతూ బయటకు వచ్చిన విజయ్ ఐదేళ్ల తర్వాత రాజకీయ తొలి ఇన్నింగ్స్ లోనే అధికార డీఎంకే ప్రభుత్వాన్ని తొక్కేస్తారని ఎవరూ ఊహించనే లేదు...50 ఏళ్లుగా తమిళనాడులో రెండు మర్రి చెట్లలా బలంగా పాతుకు పోయిన డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీల కూకటి వెళ్ళ ను ఓ కుదుపు కుదుపుతాడని అంచనా వేయనే లేదు. ఎందుకంటే... తమిళుల తిరుగులేని తలైవా రజినీకాంత్ 20 ఏళ్లు రాజకీయాల్లోకి అదిగో వస్తాను... ఇదిగో వస్తాను అని ఊరించి... ఊరించి... ఎట్టకేలకు పార్టీ పెడుతున్నా అని 2020లో ప్రకటించి... అంత లోనే తోకముడిచేసిన తీరు చూశారు. రాజకీయ పార్టీకి క్లాప్ కొట్టక ముందే ప్యాకప్ చెప్పి... మళ్ళీ సినిమా షూటింగ్ లకు.. షాట్ రెడీ... యాక్షన్...అని అన్నారు.. అభిమానులకు షాక్ ఇచ్చారు. రజినీకాంత్ అసాధ్యం అనుకున్నది విజయ్ సుసాధ్యం చేసి చూపించారు. అలాగనీ విజయ్ పార్టీ తమిళగ వెట్రి కజగం (టీఎంకే) గెలుపేమీ నల్లేరు మీద నడక ఏమీ కాలేదు. విజయ్ పార్టీ ప్రకటించినప్పటి నుంచీ... అటు రాష్ట్రం లో అధికారం లో ఉన్న డీఎంకే ఇటు కేంద్రం లో అధికారం లో ఉన్న బీజేపీ ఎన్ని ఇబ్బందులు పెట్టాలో అన్నీ పెట్టాయి... విజయ్ మొదటి ఎన్నికల సభ లో తొక్కిసలాట తో కొందరు చనిపోయారు..అదే అవకాశంగా చేసుకుని ఆయన పై కేసులు పెట్టారు.. తర్వాత పార్టీ సభలకు అనుమతులు ఇవ్వ లేదు.. ఏఐఏడీఎంకే, బీజేపీ కూటమి లో చేరాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి చేశారు.. అందుకు విజయ్ ఒప్పుకోలేదు.. తమ పార్టీ టీవీకే ఒంటరిగానే పోటీ చేస్తుంది అని తెగేసి చెప్పారు.. ఆ తరువాతే విజయ్ భార్య ( అప్పటికే ఎన్నో ఏళు ్లగా విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు) ఆయన పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఆ ఆరోపణలు దేశం లో సంచలనం సృష్టించాయి. కానీ తమిళనాడు లో మాత్రం ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు అన్నది వాస్తవం.. ఎందుకంటే విజయ్ తన భార్య తో ఎన్నో ఏళ్ల క్రితమే విడిపోయారన్నది ఆ రాష్ట్రం లో



అందరికీ తెలిసిన విషయమే.. ఎన్నికల ముందు ఆయన భార్య ఆరోపణలు చేయడం వెనుక ఏ పార్టీ పాత్ర ఉందన్నది కూడా ఇట్టే ఊహించారు.. అందుకే ఆ ఆరోపణలు టీవీకే పార్టీ పై ఇటువంటి ప్రతికూల ప్రభావం చూపించ లేదు. ఎన్నికల్లో ఆయన సోషల్ మీడియా, డిజిటల్ మీడియా లను టీవీకే పార్టీ చాలా ప్రభావవంతంగా సద్వినియోగం చేసుకుంది. పక్కా ప్లానింగ్ తో ప్రజల్లోకి ప్రధానంగా జెన్ జీ తరం లోకి దూసుకుపోయింది. డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీలపై మితిమీరిన విమర్శలు చేయ లేదు.. వివాదాస్పదంగా వ్యవహరించ లేదు.. విజయ్ తాను చెప్పాల్సింది సూటిగా చెప్పారు. తమిళ రాజకీయాలకు మూలమైన ద్రవిడ వాదానికి కట్టుబడి ఉంటాం.. లౌకికవాద పార్టీగా నిలుస్తాం.. డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీ లతో విసుగెత్తి పోయిన తమిళనాడు కు కొత్త తరహా రాజకీయాలు చేస్తాం .. మెరుగైన పరిపాలన అందిస్తాం.. అనే స్పష్టం చేస్తూ ప్రచారం చేశారు. తమిళనాడులో మ్యాజిక్ ఫిగర్ 100 స్థానాలకుపైగా విజయం సాధించారు. మరో వైపు ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఓటమి చెందారు.

**పశ్చిమ బెంగాల్‌లో దీదీకి దిమ్మదిరిగే ఫలితం!**

అందరూ ఊహించినట్టే బెంగాల్‌లో బీజేపీ ఎక్కువ స్థానాలు కైవసం చేసుకొని ప్రస్తుత ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పీడుకు బ్రేకులు వేసింది. మమతా పార్టీ కేవలం 88 చోట్ల మాత్రమే ముందంజలో ఉంది. ఇక్కడి అసెంబ్లీలో మెజారిటీకి 148 కావాలి. బీజేపీ ఆ లక్ష్యాన్ని అధిగమించే దిశగా దూసుకుపోతోంది. కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉన్న కేరళలో ప్రస్తుత ముఖ్యమంత్రి పినరాయి విజయన్ పోటీ చేసిన స్థానంలో కూడా గెలిచే పరిస్థితిలేదు. ఇక్కడ కాంగ్రెస్ కూటమి అధికారం చేపట్టేందుకు స్పష్టమైన మెజార్టీ సాధించింది. అస్సాంలో హిమంత హ్యాట్రిక్‌కు రెడీ! హిమంత బిశ్వ శర్మ నేతత్వంలోని బీజేపీ మెజారిటీ మార్కు దాటి 99 నుంచి 101 స్థానాల వరకు ముందంజలో నిలిచింది. పుదుచ్చేరిలో ఎన్నార్ కాంగ్రెస్ కూటమి తిరిగి అధికారం దక్కించుకుంది. ప్రస్తుత ముఖ్యమంత్రి రంగస్వామి విజయం సాధించారు. తిరిగి ఆయనే ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# ఎన్నికల విజయాన్ని కరూర్ మృతులకు అంకితం చేసిన టీవీకే పార్టీ

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రక విజయం సాధించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ, తమ గెలుపును కరూర్ తొక్కిసలాట మృతులకు అంకితమిచ్చింది. ఎన్నికల ప్రచారంలో జరిగిన ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. "ఈ చారిత్రక విజయాన్ని కరూర్‌లో మనం కోల్పోయిన 41 మంది కుటుంబాలకు అంకితమిస్తున్నాం" అని టీవీకే నేత ఆధవ అర్జున ప్రకటించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించాయి. నటుడు విజయ్ నాయకత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించి, ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగిన డీఎంకే, ఏఐఏడీఎంకేల ఆధిపత్యానికి గండికొట్టింది. మహిళలు విజయ్‌ను తమ కొడుకుగా, సోదరుడిగా భావించి మద్దతు ఇవ్వడం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆధవ అర్జున తెలిపారు. ఈ తీర్పును ఒక విప్లవంగా అభివర్ణించిన ఆయన, కరూర్ ఘటనకు డీఎంకేదే బాధ్యత అని ఆరోపించారు. ఫలితాల అనంతరం పార్టీ ఫిరాయింపులను నిరోధించేందుకు టీవీకే అధిష్ఠానం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. గెలిచిన ఎమ్మెల్యేలను చెన్నై సమీపంలోని ఒక ప్రైవేట్ రిసార్ట్‌కు తరలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీవీకేతో పొత్తు పెట్టుకునే అవకాశాలపై కాంగ్రెస్ పార్టీ తమ




అధిష్టానానికి నివేదిక పంపినట్లు సమాచారం. విజయ్ విజయంపై కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం అభినందనలు తెలిపారు. గతంలో రజనీకాంత్, కమల్ హాసన్ వంటి నటుల రాజకీయ ప్రవేశానికి భిన్నంగా, క్షేత్రస్థాయిలో యువతను, మార్పు కోరుకునే వర్గాలను ఏకం చేసి విజయ్ ఈ విజయాన్ని అందుకున్నారు. ఈ ఫలితాలతో తమిళనాడు రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయం మొదలైందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# బంగాల్‌లో రికార్డు స్థాయి పోలింగే టీఎంసీ కొంప ముంచిందా?

బంగాల్‌లో బీజేపీ ఘన విజయం సాధించగా, 15 ఏళ్లపాటు ఏకఛత్రాధిపత్యంగా పాలించిన మమతా బెనర్జీ టీఎంసీ సర్కార్ ఓటమి పాలైంది. ఈసారి రికార్డు స్థాయిలో పోలింగ్ జరగడమే టీఎంసీ కొంప ముంచిందా ఆ పార్టీ ఓటమికి గల ప్రధాన కారణాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం. మమతా బెనర్జీ 15 ఏళ్లపాటు బంగాల్‌ను పాలించారు. సుదీర్ఘ పాలన చేసే ఏ రాజకీయ పార్టీకైనా సహజంగా కొంత మేర ప్రజావ్యతిరేకత రావడం సహజం. కానీ ఈసారి తీవ్ర అసంతృప్తి నెలకొంది. 15 ఏళ్ల క్రితం మమత 'మా, మాటి, మనుష్' (తల్లి, నేల, ప్రజలు) అనే నినాదంతో టీఎంసీని గెలిపించారు. వరుసగా మూడు సార్లు ఆమె బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడానికి ఈ నినాదమే మూలస్తంభంగా నిలిచింది. కానీ ఈసారి పరిస్థితి మొత్తం తారుమారు అయ్యింది. నిరుద్యోగం, స్థానిక నేతలపై ఆరోపణలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమయ్యా యి. పైగా కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐలు నిరంతరం టీఎంసీ నేతలపై దాడులు చేశాయి. దీనిని అవినీతిపై పోరాటంగా వర్ణిస్తూ బీజేపీ ఓటర్లను ఆకర్షించింది. చాలా కాలంగా టీఎంసీ ఎన్నికల విజయానికి మహిళలే వెన్నెముకగా నిలిచారు. గత దశాబ్దకాలంగా మమత ఈ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు అనేక మహిళా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. వీటిలో లక్ష్మీ భండార్? (నగదు బదిలీ పథకం), బాలికల కోసం కన్యాశ్రీ పథకం లాంటివి ఉన్నాయి. అయితే ఈసారి బీజేపీ ఈ మహిళా ఓటర్లను తనవైపు తిప్పుకుంది. టీఎంసీకి పోటీగా మహిళల కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చింది. అంతేకాదు ఆర్?జీ కర్ మెడికల్ కాలేజ్ హత్యాచారం కేసును ప్రధాన అస్త్రంగా మలుచుకుంది. అంతేకాదు బాధితురాలి తల్లికి పానిహటి స్థానంలో తమ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలిపింది. ఇది కాషాయ పార్టీకి కలిసొచ్చింది. ఆమె విజయం సాధించింది.

**ముస్లిం ఓట్లు**

బంగాల్‌లో ముస్లిం జనాభా దాదాపు 27 శాతం మేర ఉంది. బంగాల్‌లో ఎవరు అధికారంలోకి రావాలో నిర్ణయించడంలో వీరిదే కీలక పాత్రగా ఉంది. ఇంతకు ముందు టీఎంసీ ఈ ముస్లిం సమాజం అధికంగా ఉన్న ప్రాంతాల్లో 75 స్థానాలను గెలుచుకుంది. కానీ ఈసారి సీన్ పూర్తిగా మారిపోయింది. రాజకీయంగా కీలకమైన మాల్దా, ముర్షిదాబాద్?, ఉత్తర దినాజ్?పుర్? జిల్లాల్లో స్పష్టంగా మార్పు కనిపించింది. ఈ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడడం, ఓటర్ల జాబితాలో సమస్యలు, పాలనపై ఆందోళనలు పెరిగాయి. దీనిని అవకాశంగా తీసుకున్న కాంగ్రెస్ అక్కడ బలపడింది. పైగా ఆల్ ఇండియా మజ్లిస్–ఎ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) కూడా ఓట్లను చీల్చే శక్తివంతమైన పార్టీగా ఎదిగింది. ఇవన్నీ ఈ ఎన్నికల్లో టీఎంసీని తీవ్రంగా దెబ్బతీశాయి. బంగాల్?లో రెండు దశలో పోలింగ్ జరిగింది. 2026 ఏప్రిల్? 23న జరిగిన మొదటి దశ పోలింగ్?లో 93.19 శాతం ఓటింగ్, ఫిబ్రవరి 29న జరిగిన రెండో దశ పోలింగ్?లో 91.66 శాతం ఓటింగ్? నమోదు అయ్యింది. మొత్తం కలిపి బంగాల్?లో 92.47 శాతం ఓటింగ్ జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆ రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున ఓటింగ్ జరగడం ఇదే మొదటిసారి. అయితే పెరిగిన ఓటింగ్ బీజేపీకి కలిసొచ్చినట్లు తెలుస్తోంది. ఎస్?ఐఆర్? తర్వాత ఓటర్ల జాబితా నుంచి తమ పేర్లను తొలగిస్తారనే భయంతో, చాలామంది ఇతర ప్రాంతాల్లో ఉన్న బంగాల్ పౌరులు, వలస కార్మికులు స్వరాష్ట్రానికి వచ్చి ఎన్నికల్లో పాల్గొన్నారు. ఇలా వచ్చిన వలస కార్మికుల్లో మెజార్టీ ఓటర్లు బీజేపీకే ఓటేసినట్లు ట్రెండ్స్ ను చూస్తే అర్థమవుతోంది. బంగాల్‌లో జనాభాలో 17 శాతంగా ఉన్న షెడ్యూల్ కుల సమూహం మతువా. వీరిని ఆకట్టుకునేందుకు బీజేపీ ప్రత్యేక ప్రణాళిక వేసి, అనేక తాయిలాలు ప్రకటించింది. వీరి మద్దతు బీజేపీ విజయానికి ప్రధాన కారణమైంది.



**బీజేపీ యంత్రాంగం**

వాస్తవానికి బంగాల్?లో టీఎంసీకి క్షేత్రస్థాయిలో బలమైన యంత్రాంగం, వీరవిధేయులైన కార్యకర్తలు ఉన్నారు. దీనిని ఓవర్ టేక్ చేస్తూ, ఈసారి బీజేపీ తన శాయశక్తులా బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తన కార్యకర్తలను ఇంటిఇంటికీ వెళ్లి ప్రచారం చేసేలా చేసింది. పైగా బీజేపీకి డిజిటల్ ప్రచారం కూడా బాగా కలిసొచ్చింది. ఇవన్నీ మమతా బెనర్జీకి నష్టం కలిగించాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**అవినీతి కుంభకోణాలు**

ఇక మమత హయాంలో అనే అవినీతి ఆరోపణలు టీఎంసీ పార్టీ ప్రతిష్టను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఉపాధ్యాయుల నియామకంలో జరిగిన అక్రమాలు ఆ పార్టీని ఇరకాటంలో పడేశాయి. మాజీ మంత్రి పార్థ ఛటర్జీ అనుచరుల ఇళ్లలో కోట్లాది రూపాయలు దొరకడం, ఆ విజువల్స్ నెట్టింట వైరల్ కావడంతో పార్టీకి నష్టం జరిగింది. శారద, నారద లాంటి పాత కుంభకోణాల గురించి కూడా విపక్షాలు ప్రస్తావిస్తూ టీఎంసీ అవినీతిలో కూరుకుపోయిందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాయి. ఇవన్నీ మమత సర్కార్?ను తీవ్రంగా దెబ్బతీశాయని చెప్పకతప్పదు. ఈ ఎన్నికల ప్రచార సమయంలో అక్రమ వలసదారులను దేశం నుంచి తరిమేస్తామని బీజేపీ స్పష్టంగా పేర్కొంది. అంతేకాదు మమత సర్కార్? అక్రమ వలసదారులకు అండగా నిలుస్తోందని ఆరోపించింది. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ వలసదారులు స్థానిక ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నారని పేర్కొంది. దీనికి బలం చేకూరుస్తూ ఎన్నికల సంఘం ఎస్?ఐఆర్? చేపట్టి సుమారు 89 లక్షల మంది పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించింది. ఇందులో ఎక్కువ మంది టీఎంసీ మద్దతుదారులేనని ఓ అంచనా. ఇది కూడా టీఎంసీకి గట్టి ఎదురుదెబ్బేనని చెప్పకతప్పదు. ఈ విధంగా పలు కారణాలు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీని తీవ్రంగా దెబ్బతీశాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## కింగ్ మేకర్ కాదు 'కింగే'

## పోటీ చేసిన రెండు చోట్లా 'విజయ్'మే!

నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) చీఫ్ విజయ్ సంచలనం సృష్టించారు. తమిళ రాజకీయాల్లో అసాధ్యమనుకున్నది సుసాధ్యం చేసి చూపించారు. పార్టీని స్థాపించిన కేవలం రెండేళ్లకే చరిత్ర లిఖించారు. టీవీకే ఏర్పాటు తర్వాత తొలిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలతో 'విజిల్' వేయించి మెజార్టీ స్థానాలు గెలవడం ద్వారా అటు సినిమాల్లోనే కాదు.. ఇటు పాలిటిక్స్‌లోనూ 'సూపర్ హిట్' కొట్టారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగిన విజయ్.. రెండు చోట్లా తన సమీప ప్రత్యర్థులను ఓడించి సత్తా చాటారు.

**కింగ్ మేకరే అన్నారు.. కానీ..!**

కొన్ని ఎగ్జిట్‌పోల్స్, కొందరు రాజకీయ విశ్లేషకులు ఈ ఎన్నికల్లో విజయ్ ప్రభావం అంతగా ఏమీ ఉండకపోవచ్చని.. ఆయన ఓట్లు చీలుస్తారని, ఒకవేళ హంగ్ వస్తే ఆయన కింగ్‌మేకర్ అవుతారంటూ రకరకాల అంచనాలను వెలువరించారు. కానీ, వాటన్నింటినీ తారుమారు చేస్తూ టీవీకే అనూహ్యంగా అత్యధిక స్థానాలు గెలుచుకొని ఆయన కింగ్‌గా అవతరించడం ఇప్పుడు దేశమంతా హాట్‌టాపిక్ అయింది. ఇప్పటివరకు వచ్చిన ఫలితాలను చూస్తే.. మొత్తం 234 సీట్లకు గాను టీవీకే 100కి పైగా స్థానాల్లో గెలుపు/ఆధిక్యంలో ఉండగా.. అధికార డీఎంకే కూటమి 70కి పైగా, అన్నాడీఎంకే కూటమి 50కి పైగా స్థానాల్లో గెలుపు/ఆధిక్యంలో కొనసాగుతున్నాయి. ఈ అపూర్వ విజయంతో మంచి జోష్‌లో ఉన్న టీవీకే శ్రేణులు, నేతలు ప్రభుత్వ ఏర్పాటు దిశగా ముమ్మర కసరత్తు చేస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే విజయ్ మే 7న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు వార్తలొస్తున్నాయి.

**తన కారు డ్రైవర్ కొడుకుకు సీటిచ్చి..**

విజయ్ అత్యంత సామాన్యులకే సీట్లు కేటాయించడం ద్వారా తనదైన మార్కు చూపించారు. అలా ఎంచుకున్న వ్యక్తి చేతుల్లోనే సీఎం స్టాలిన్ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. రాజకీయ వారసత్వానికి భిన్నంగా విజయ్ క్షేత్రస్థాయి కార్యకర్తలకే సీట్లు ఇవ్వడంతో ప్రజలూ భిన్నంగా ఆలోచించారు. తన వద్ద దాదాపు 30 ఏళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేసి, ప్రస్తుతం సహాయకుడిగా కొనసాగుతున్న రాజేంద్రన్ కుమారుడు శబరినాథన్‌ను చెన్నైలోని విరుగంబాక్కం నియోజకవర్గం నుంచి విజయ్ బరిలో దించగా.. డీఎంకే అభ్యర్థిపై ఆయన ఆధిక్యంతో స్పష్టమైన విజయం దిశగా దూసుకెళు ్తండటం విశేషం.

**ఆటోడ్రైవర్ అపూర్వ విజయం..**

అలాగే, రోయపురం నియోజకవర్గంలో ఓ ఆటో డ్రైవర్‌కు విజయ్ సీటు ఇచ్చారు. ఈ స్థానం నుంచి బరిలో నిలిచిన ఆటో డ్రైవర్ కె.విజయ్ ధాము శక్తిమంతమైన రాజకీయ వారసత్వం కలిగిన వ్యక్తులనే ఓడించి అద్భుత విజయం సాధించారు. ఐదు సార్లు ఎమ్మెల్యే డా.జయకుమార్ (అన్నాడీఎంకే), మాజీ మంత్రి రెహ్మాన్ ఖాన్ తనయుడు సుబైర్ ఖాన్‌లను ఓడించి సరికొత్త రికార్డు నెలకొల్పారు. విజయ్ ధాముకు మొత్తంగా 59,091 ఓట్లు రాగా.. తన సమీప ప్రత్యర్థి, డీఎంకే అభ్యర్థిపై 14,249 ఓట్ల మెజార్టీతో గెలుపొందడం విశేషం.

## దేశంలో కమ్యూనిస్టుల పాలన కనుమరుగు..!

**హైదరాబాద్ :** ఇటీవల ఐదు రాష్ట్రాలకు నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో దేశ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నో పార్టీలు పురుడు పోసుకొని రాజకీయాల్లో తమ అస్థిత్వాన్ని చాటుకుంటున్నాయి. ఈ క్రమంలో కేరళలో ఎల్డీఎఫ్ కూటమి ఓడిపోవడంతో దేశంలో కమ్యూనిస్టుల పాలనకు తెరపడినట్లయింది. 1957లోఈఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో కేరళలో ప్రపంచంలోనే మొదటిసారిగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి కేరళ, పశ్చిమ బెంగల్, త్రిపుర ఇలా 49 ఏండ్ల ఏండ్లలో ఏదో ఒక చోట గెలుస్తూ అధికారాన్ని కాపాడుకుంటూ వస్తున్నది. అయితే, 2026 ఏప్రిల్‌లో కేరళతో పాటు మరో నాలుగు రాష్ట్రాలకు ఎన్నికలు జరిగాయి. కేరళలో మొన్నటి వరకు సీపీఎం పార్టీ నాయకుడు పినరయి విజయన్ నాయకత్వంలో ఆ పార్టీ వరుసగా రెండు సార్లు గెలిచి పాలన సాగిస్తున్నది. ఈ రోజు వెలువడిన ఫలితాల్లో కేరళలో ఎల్డీఎఫ్ కూటమి ఘన విజయం సాధించింది. దీంతో కేరళలో అధికారంలోకి వచ్చిన వామపక్షాలు కేరళలలో ఓటమితోనే తన ప్రస్థానాన్ని ముగించినట్లయింది.

## ఈ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి

పశ్చిమ బెంగాల్‌లో కమలం వికసించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా విజయంపై ఆయన ఈమేరకు స్పందించారు. 2026 ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. మరోవైపు.. అస్సాం ప్రజలు మరోసారి ఎన్డీయేను ఆశీర్వదించారని పేర్కొన్నారు. తమిళనాడులో టీవీకే అద్భుతమైన ఫలితాలు సాధించిందన్నారు. తమిళనాడు పురోగతికి, అక్కడి ప్రజల సంక్షేమానికి కేంద్రం పాటుపడుతూనే ఉంటుందని చెప్పారు. "బెంగాల్ ఎన్నికల్లో ప్రజాశక్తిదే పైచేయి అయ్యింది. భాజపా సుపరిపాలన రాజకీయాలు ఘన విజయం సాధించాయి. ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు. వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. వారి కలలను, ఆశయాలను నెరవేర్చడానికి సాధ్యమైనంత మేర కృషి చేస్తాం. సమాజంలోని అన్ని వర్గాలకూ అవకాశాలు, గౌరవాన్ని కల్పించే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అస్సాంలో సాధించిన గెలుపు.. అభివృద్ధికి, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి మేం చేస్తున్న ప్రయత్నాలకు లభిస్తున్న మద్దతును చాటిచెబుతోంది" అని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

**భారత్ అంతా 'మోదీమయం'.. భాజపా ప్రత్యేక మ్యాప్**

కార్యకర్తల కృషి లేకపోతే బెంగాల్‌లో ఈ చరిత్రాత్మక విజయం సాధ్యమయ్యేది కాదని ప్రధాని మోదీ అన్నారు. ఏళ్ల తరబడి వారు క్షేత్రస్థాయిలో శ్రమించారని, ఎన్నో ప్రతికూలతలను అధిగమించారని.. వారే తమ పార్టీకి అసలైన బలమని చెప్పారు. కేరళలో విజయంపై యూడీఎఫ్‌కు అభినందనలు తెలిపారు. వికసిత్ కేరళ కోసం కేంద్రం తరఫున సహకారం కొనసాగిస్తామన్నారు. పుదుచ్చేరిలో ఎన్.రంగసామి సర్కారు పనితీరు ఆధారంగా ఓటర్లు ఎన్డీయేకు మరోసారి అధికారాన్ని కట్టబెట్టారని పేర్కొంటూ.. కృతజ్ఞతలు తెలిపారు.

## కాళ్లతో మెట్రిక్యులేషన్ పరీక్షలు రాసిన బాలిక

సంకల్పం ఉంటే ఎలాంటి అడ్డంకులైనా అధిగమించవచ్చని మరోసారి నిరూపించింది ఒడిశాకు చెందిన ఓ బాలిక. పుట్టుకతోనే చేతులు లేకపోయినా, కాళ్లు సరిగా లేకున్నా పట్టు వదలని విక్రమార్కుడిలా చదువు కోసం పోరాడింది. చేతులు లేకపోతేనేం కాళ్లతో రాయడం నేర్చుకుంది. ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యాలు కల్పించినప్పటికీ వాటిని పక్కనపెట్టి, ఇతర విద్యార్థుల్లానే పరీక్ష హాల్లో కూర్చొని తన ప్రతిభను చాటేది. ఆ పట్టుదలతోనే 10వ తరగతి పరీక్షలో అద్భుతమైన ఫలితాలు సాధించింది. అలా తల్లిదండ్రులను గర్వపడేలా చేస్తూ, ఇతరులకు ఆదర్శంగా నిలిచింది. ఆమెనే ఒడిశాకు చెందిన లక్ష్మీ ఖేముడు. ఆమె ప్రయాణం ఎలా సాగిందో ఈటీవీ భారత్? కథనంలో తెలుసుకుందాం.

**చిన్ననాటి నుంచే చేతులు లేవు**

మల్కన్‌గిరి జిల్లాలోని ధేపగుఢా గ్రామానికి చెందిన నారాయణ ఖేముడు రోజూవారి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అతడి పెద్ద కుమార్తె లక్ష్మీ ఖేముడు. పుట్టుకతోనే శారీరక దివ్యాంగురాలు. లక్ష్మీకి చేతులు, కాళ్లు సరిగా పనిచేయవు. సొంతంగా నిలబడే శక్తి కూడా ఆమెకు లేదు. అందుకే ఆమె వీల్‌చైరే ఆధారంగా జీవిస్తోంది. అయితే ఆమెకు బాగా చదువుకోవాలనే కోరిక మాత్రం ఉంది. లక్ష్మీ కోరికను ఆమె కుటుంబం అర్థం చేసుకుంది. తమకు ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా లక్ష్మీని చదివించడానికి ఏ మాత్రం తల్లిదండ్రులు వెనుకాడలేదు. లక్ష్మీ తండ్రి ఐదో తరగతి వరకు చదివారు. ఆమె తల్లి సుభద్ర నిరక్షరాస్యురాలు. అయినప్పటికీ ఆ దంపతులు తమ కుమార్తెకు ఉన్న చదువుకోవాలనే కోరిక నేరవేర్చేందుకు సిద్ధమయ్యారు. అలా లక్ష్మీ సింధిమాల ఉన్నత పాఠశాలలో తన విద్యను అభ్యసిస్తోంది. లక్ష్మీ చేతులు లేకపోయినా కాళ్లతో రాయడం సాధన చేసింది. అలా పదో తరగతి వరకు అందరి విద్యార్థులాగానే పరీక్షలు రాస్తూ, మంచి మార్కులు సాధించేది. ఇటీవల జరిగిన పది పరీక్షలకు కూడా హాజరైంది. అయితే జిల్లా పరిపాలన దివ్యాంగుల కోసం ఇచ్చే ప్రత్యేక సదుపాయాలు కల్పించింది.

# తెలుగు వారికి టిపిక్స్ క్లబ్

**విజయవాడ :** విదేశాంధ్రుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎపిఎనఆర్‌టిఎస్ సంస్థకు మరోసారి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రవి వేమూరు విదేశాంధ్రుల కోసం మరింతగా సేవలందించే విధంగా కొన్ని కార్యక్రమాలను చేపట్టారు. అందులో ౹తిజూవలీ.ఇశ్రీబీఎ కూడా ఒకటి. ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశాల్లో ఉన్నప్పుడు ఎన్నారైలను ఉద్దేశించి ప్రతి ఒక్కరూ ఎంట్రప్రెనూరర్‌లుగా తయారై ఇతరులకు ఉపాధిని కల్పించేలా తయారు కావాలని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దానిని దృష్టిలో పెట్టుకునే రవి వేమూరు ఈ టింపెక్స్ క్లబ్‌ను రూపొందించారు. ఈ టింపెక్స్‌తో ఉద్యోగులతోపాటు, ఇంట్లో ఉన్న గృహిణులు కూడా ట్రేడింగ్ నిర్వహించవచ్చని చెప్పారు. ఈ టింపెక్స్‌కు సంబంధించి ఆయన చెప్పిన వివరాలను ఇక్కడ ఇస్తున్నాము.మన దేశంలో గానీ, విదేశాల్లో గానీ వ్యాపారం చేయడంలో ముందుండేవాళ్ళు గుజరాతీలు, తమిళులు. అంతర్జాతీయ వాణిజ్యంలో బలమైన నెట్ వర్క్ లను వారు కలిగి ఉన్నారు. విభిన్న పద్ధతుల్లో మంచి ఆదాయ మార్గాలను అన్వేషించుకొని, వ్యాపారవేత్తలు గా వారు రాణిస్తున్నారు. ఇదే విధంగా రాష్ట్రంలోని తెలుగువాళ్ళతోపాటు, విదేశాల్లో ఉన్న తెలుగువాళ్ళకు కూడా ట్రేడింగ్ చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తే వారు మరింతగా రాణించి గ్లోబల్ ఎంట్రప్రెన్యూరర్ గా తయారవుతారన్న ఉద్దేశ్యంతో ఏపీఎన్ఆర్టీఎస్ ఈ టింపెక్స్ క్లబ్‌ను రూపొందించింది.ప్రస్తుతం ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్, లిబరలైజేషన్ (ఎల్‌పిజి) అయిన తర్వాత ఎవరైనా, ఎక్కడైనా వ్యాపారాలు చేసుకోవచ్చు. దానికి అనేక మార్గాలున్నాయి. మన రాష్ట్రంలో, మన దేశంలో ఇంకా చెప్పాలంటే మన ఇంట్లోనే వుంటూ మనం తయారు చేసే వస్తువులను ఇతర దేశాలకు ఎగుమతులు చేయవచ్చు. చిన్న చిన్న వస్తువులే కాదు.. పెద్ద పెద్ద వస్తువులను కూడా ఎగుమతి చేసి, డబ్బు సంపాదించవచ్చు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో రొయ్యలు, గుంటూరు మిర్చి పండించే రైతులు ఈ విధంగా చేస్తున్నారు. ఇతర దేశాలకు తమ ఉత్పత్తులను పంపుతున్నారు. లాభాలను ఆర్జిస్తు న్నారు. అయితే.. కేవలం కొన్ని వస్తువులే కాకుండా.. మరిన్ని వస్తువులను కూడా ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మంచి అవకాశం దొరికింది. ఈ అవకాశాన్ని ఏపీఎన్ఆర్టీఎస్(ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ) కల్పిస్తోంది. ౹ఎఖఇచీ.ఇశ్రీబీఎ ద్వారా మన రాష్ట్రంలోనే వుంటూ గుజరాతీల లాగా, తమిళుల లాగా మనం కూడా బలమైన అంతర్జాతీయ వ్యాపారవేత్తలుగా ఎదిగే అవకాశం పుష్కలంగా వుంది. ఆసక్తి వున్న వారికి, వ్యాపారవేత్తలుగా ఎదగాలని బలమైన వాంఛ వున్న వారికి అంతర్జాతీయ వాణిజ్యంపై శిక్షణ, అవకాశాలను ఎలా పొందాలి.. గైడెడ్ ట్రేడింగ్ గురించి సంపూర్ణమైన శిక్షణ ఇచ్చేందుకు ఈ సంస్థ రెడీగా వుంది.ఏపీలో వుండే వారికి ఎంతటి ప్రాధాన్యత వుందో విదేశాంధ్రులకు కూడా అంతే ప్రాధాన్యతను ఇస్తూ.. వారి సంక్షేమం, అభివృద్ధి, వ్యాపార సాధికారత పట్ల కూడా కట్టుబడి వుంది. కేవలం పెద్ద పెద్ద వ్యాపారవేత్తలే కాకుండా సరైన అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ సహాయ సహకారాలతో చిన్న చిన్న వ్యాపారులు, రైతులు, యువకులు, మహిళలు కూడా అంతర్జాతీయ విపణిలో నిలదొక్కుకునే అవకాశాలను కల్పిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వున్న తెలుగు వారిని నంబర్ వన్ గ్లోబల్ కమ్యూనిటీ లీడర్లుగా తీర్చి దిద్దాలని ఏపీ ప్రభుత్వం కూడా సంకల్పించింది. ఉద్యోగిత నుంచి వ్యాపారం వైపు ప్రజలను మార్చాలని నిర్ణయించు కుంది. అయితే తయారీ రంగాలు, పెద్ద వ్యాపారాలతో పోలిస్తే 'ట్రేడింగ'కి భారీ పెట్టుబడి లేదా ప్రత్యేక మౌలిక వసతులు అవసరమే లేదు. పార్ట్ టైమ్‌గా కూడా నిర్వహించ వచ్చు అని సంస్థ వారు చెబుతున్నారు. అయితే.. ఇందులో ఒప్పందాలు చేసుకునే విధానాలు, అందులో ప్రామాణికత, స్థిరమైన విధానాల ద్వారా సరైన దిశలో సాగేలా మనకు అవకాశాలు, అవగాహన కల్పిస్తారు. ట్రేడింగ్ ప్రారంభంలో వున్న వారు ఇబ్బందులు పడకుండా, వుండేందుకే సహాయ పడుతుంది. గృహిణులు, వారి కుటుంబీకులు కూడా కలిసి సంయుక్తంగా ఏదైనా వ్యాపారాన్ని చేసుకోవచ్చు. తెలుగు ట్రేడర్లు అంతర్జాతీయంగా ఇప్పటికే పాతుకుపోయిన ట్రేడ్ నెట్‌వర్క్‌లతో పోటీ పడాలంటే ఖర్చు కావాలి, అనుభవం కావాలి. ఈ రెంటితో పాటు మరిన్ని మెళకువలను కూడా ౹ఎఖఇచీ.ఇశ్రీబీఎ అందిస్తుంది. అయితే తక్షణంగా వచ్చే లాభాల కంటే పెట్టుబడుల పైనే ఇది ఎక్కువ దృష్టి సారిస్తుంది. పెట్టుబడి భద్రతకు కూడా ప్రాధాన్యతను ఇస్తుంది. తయారీ రంగం లేదా పెద్ద వ్యాపారాలతో పోలిస్తే, ట్రేడింగుకు భారీ పెట్టుబడి లేదా ప్రత్యేక మౌలిక వసతులు అవసరం లేదు. పార్ట్ టైమ్ ద్వారా కూడా నిర్వహించొచ్చు. ఉత్పత్తుల అభివృద్ధి కంటే వేగంగా లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే ప్రామాణిక ఒప్పందాలు, స్థిరమైన విధానాల ద్వారా ప్రమాదాలను కూడా తగ్గించొచ్చు. ప్రారంభ దశలో అత్యంత నిపుణత అవసరం లేకపోవడం వల్ల కొత్తగా వ్యాపారంలోకి వచ్చే వారికి ఇది అనుకూల మార్గమని అంటోంది. స్థిర ఆదాయం, అంతర్జాతీయ అనుభవం, విదేశీ మార్కెట్లకు ప్రత్యక్ష పరిచయం ఉన్న ప్రవాసాంధ్రులకు ఇది సహజమైన తదుపరి అడుగు. ఏపీఎన్ఆర్టీఎస్ కార్యక్రమాల ద్వారా తెలియజేసినట్లుగా, నెలలో కొన్ని రోజుల సమయంతో కూడా ఈ వ్యాపారాన్ని నిర్వహించొచ్చు. గృహిణులు, కుటుంబ సభ్యులు కలిసి ఒక సంయ్యుక్త వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభించడానికి కూడా ఇది అనువైన అవకాశం అని తెలియజేస్తోంది.

# వైసీపీ గ్రాఫ్ పెరిగిందా...

**విజయవాడ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. అందులో మూడు ప్రధాన పార్టీలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అతి పెద్ద పార్టీగా క్షేత్ర స్థాయి వరకు విస్తరించి ఉన్న పార్టీ. ఆ పార్టీ చరిత్ర నాలుగు దశాబ్దాలు. ఇకపోతే జనసేన పార్టీకి సినీ గ్లామర్ ఇమేజ్ ఉన్న పవన్ కళ్యాణ్ అధినేత. ఒక బలమైన సామాజిక వర్గం మద్దతు కూడా ఉన్నది. ఇక కేంద్రంలో నరేంద్ర మోడీ వంటి ఆకర్షణీయమైన నాయకత్వం బిజెపికి శ్రీరామరక్షగా ఉంది. అలాగే కూటమి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉండడం కూడా మరో సానుకూల పరిణామం. ఇక ప్రతిపక్షం వైపు చూస్తే వైసిపి ఉంది. ఆ పార్టీ మూడు సార్లు ఎన్నికల్లో పోటీ చేస్తే ఒకసారి మాత్రమే గెలిచింది. వైసీపీకి సర్వసత్తాక నాయకుడు వైఎస్ జగన్. 2019కి ముందు జగన్ కి ఉన్న ఇమేజ్ ఆకాశాన్ని అంటింది. దానికి కారణం తీసుకుంటే వైయస్సార్ వంటి ప్రజాకర్షణ కలిగిన నాయకుని కుమారుడిగా జగన్ ఆకర్షించారు. అదే విధంగా జగన్ కూడా దూకుడు తో కూడిన రాజకీయం అప్పట్లో చేస్తూ వచ్చారు. ఇవన్నీ కలసి వైసీపీ అధికారంలోకి వస్తే ఖచ్చితంగా మంచి జరుగుతుందని భావించి అన్ని వర్గాలు 2019 ఎన్నికల్లో ఆ పార్టీకి పట్టం కట్టాయి. అయితే 2024లో వైసీపీ ఓటమి చెందాక గత రెండేళ్ళలో వైసీపీలో పెద్దగా ఉత్సాహం అయితే ప్రోత్సాహం కనిపించట్లేదు అని అంటున్నారు. ఆ పార్టీ అధినాయకుడు కూడా తరచూ జనాల్లోకి రావట్లేదు, ఈ నేపథ్యంలో చూస్తుండగానే కాలం గడిచిపోతోంది.ఇక అధికార కూటమి కీలక ఘట్టంలోకి ప్రవేశించింది. అంటే ప్రభుత్వం పట్ల ప్రజలకి అమ్మ నెమ్మదిగా అసంతృప్తి బాహటం అయ్యేందుకు అవకాశం ఉన్న వాతావరణ అన్న మాట. వివిధ వర్గాలలో అది బయటపడే సమయానికి అందుబాటులో ఉన్న ప్రతిపక్షం దాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా బలోపేతం అవుతుంది. ఇది ఎక్కడైనా జరిగే సహజ రాజకీయ ప్రక్రియ. ఆంధ్రప్రదేశ్ లో చూస్తే అటువంటి పరిస్థితి ఉందా అన్నది ప్రశ్న ఎదురవుతోంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ ప్రధాన ప్రత్యక్షంగా ఉంది, 40 శాతం ఓటు బ్యాంకు కూడా పార్టీకి ఉంది. కేవలం 11 సీట్లు అని ఆ పార్టీని కొట్టి పారేయడానికి లేదు. పైగా మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఒక ఇమేజ్ ఉన్న అధినేతగా జగన్ వైసీపీకి నాయకత్వం వహిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే ఒక బలమైన సామాజిక వర్గం అండ కూడా ఆ పార్టీకి ఆంగ బలం అర్ధ బలం కూడా



ఉన్నాయి .ఇక ఇన్ని రకాలుగా అనుకూలతలు ఉన్నా కూడా వైసీపీ జనంలోకి ఊహించినంతగా వెళ్ళలేకపోతోంది. పార్టీ నాయకులు కూడా మీడియాకే పరిమితం అవుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు వందలూ వేలుగా కనిపించిన నాయకులు ఇప్పుడు ఐదు పదిగా మాతమే కనిపిస్తున్నారు. అది కూడా మీడియాలోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇక అధినేత కూడా జనంలోకి వెళ్ళడం పాదయాత్రతోనే అన్నట్టుగా ఆలోచిస్తున్నారని ప్రచారంగా ఉంది. ఇవన్నీ పక్కన పెడితే రెండేళ్ల కూటమి పాలన పూర్తి చేసుకున్న సమయంలో సహజంగా ఏర్పడే ప్రజా వ్యతిరేకత అలాగే ఎంతో కొంత అసంతృప్తి ప్రతిపక్షానికి కలసి రావాలి. అదే విధంగా వైసీపీ గ్రాఫ్ ఈసరికే ఎంతో కొంత పెరిగి ఉండాలి. అంటే ఆ పార్టీకి 2024 లో వచ్చిన 40 శాతం ఓటు బ్యాంకుకి కనీసం రెండు మూడు శాతం అదనంగా పెరిగి ఉండాల్సింది. కానీ పరిస్థితి చూస్తే ఆ విధంగా కనిపించట్లేదు అని ఫ్యాన్ పార్టీలోనే చర్చ సాగుతోంది. కూటమి పట్ల వ్యతిరేకత ఉందని వైసీపీ నేతలు అంటున్నా అది తమ పార్టీ వైపుగా సానుకూలంగా మారకపోవడమేంటి అని వైసీపీలో తర్జనభర్జన పడుతున్నారని టాక్. వైసీపీ ఈ విషయంలో ఏం చేసింది ఏం చేయాలి అన్నదానిమీద కూడా పార్టీ సీనియర్లు కొంతమంది మదనపడుతున్నారని అంటున్నారు. అధినేత చూస్తే ఇప్పట్లో జనంలోకి వచ్చే అవకాశం అన్నది లేదు. దాంతో కూటమి పట్ల ఏమాత్రం అయినా ఏర్పడిన వ్యతిరేకత సానుకూలంగా మార్చుకోవాలని వైసీపీ చేస్తున్న ప్రయత్నాలు పెద్దగా సక్సెస్ కావట్లేదు అని అంటున్నారు. రెండేళ్ల పరిపాలన తర్వాత కూడా కూటమి ఇంకా అదే దూకుడు ప్రదర్శిస్తూ ముందుకు సాగుతోంది. ఎన్నికల ముందు వైసీపీని ఏ విధంగా చీల్చి చెండాడుతూ విమర్శలు చేసిందో అదే విధంగా ఇప్పుడు కూడా చేస్తోని. దానికి ధీటైన కౌంటర్లు వైసీపీ నుంచి రావడం లేదని అంటున్నారు. అవి జనంలోకి : దాంతో గొడ్డలి పార్టీ అని జగన్ మానసిక వ్యాధితో బాధపడుతున్నారని కూటమి పెద్దలు చేస్తున్న విమర్శలు జనంలోకి మెల్లగా వెళుతున్నాయా అన్న ఆందోళన కూడా వైసీపీ వర్గాల్లో ఉంది. కూటమి ప్రభుత్వం మీద పోరాటం చేసే విధంగా వైసీపీ తగినంత సరంజామాతో ముందుకు రాలేకపోతోంది. ఇవన్నీ చూస్తూ ఉంటే పుణ్య కాలం గడుస్తోందా అన్నది ఒక ప్రశ్న. అధినాయకత్వం విషయం చూస్తే పాదయాత్రతోనే అన్ని మారిపోతాయన్నట్లుగానే ఉంది. దీంతో వైసీపీ గ్రాఫ్ పెరగకపోతే కనుక రానున్న కాలంలో ఇబ్బందులు వస్తాయని కూడా సీనియర్ల అంతర్మధనం చెందుతున్నట్లుగా తెలుస్తోంది.

# కల్తీ నెయ్యి వ్యవహారంలో ధర్మారెడ్డికి బిగిస్తున్న ఉచ్చు



**తిరుపతి :** ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవం, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన కల్తీ నెయ్యి వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ భారీ కుంభకోణానికి టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి ప్రధాన కారకుడని ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ తేల్చి చెప్పింది. తాజాగా మీడియాకు అందుతున్న సమాచారం ప్రకారం, శ్రీవారి నెయ్యి టెండరు నిబంధనలను నిబంధనలకు విరుద్ధంగా సడలించడంలో ధర్మారెడ్డి కీలక పాత్ర పోషించారని కమిషన్ నిర్ధారించింది.సాధారణంగా టీటీడీకి సరఫరా చేసే నెయ్యి విషయంలో అత్యంత కఠినమైన నిబంధనలు ఉంటాయి. అయితే, ధర్మారెడ్డి హయాంలో ఈ నిబంధనలను సడలించడం ద్వారా నాణ్యత లేని, కల్తీ నెయ్యిని సరఫరా చేసే సంస్థలకు టీటీడీలోకి మార్గం సులభమైందని నివేదిక పేర్కొంది. అప్పట్లోనే నాణ్యతపై ఫిర్యాదులు వచ్చినా, సదరు సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి చర్యలు తీసుకోకుండా.. వాటినే కొనసాగించేలా నిర్ణయాలు తీసుకోవడం వెనుక ధర్మారెడ్డి ప్రమేయం ఉందని కమిషన్ వెల్లడించింది. దీనివల్ల భక్తుల సెంటిమెంట్‌తో ఆడుకోవడమే కాకుండా, ప్రసాదం నాణ్యతను దారుణంగా దిగజార్చారని కమిషన్ ఆక్షేపించింది. ఈ కల్తీ నెయ్యి కుంభకోణంలో ధర్మారెడ్డిపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఏకసభ్య కమిషన్ ప్రభుత్వానికి నివేదించింది. అంతేకాకుండా, ఈ వ్యవహారంలో అప్పటి ఈవో సింఘాల్ మరియు ఆర్థిక సలహాదారు బాలాజీల ప్రమేయంపై కూడా ప్రస్తావించడం గమనార్హం. నిబంధనల సడలింపు, ఆర్థిక లావాదేవీలు మరియు టెండర్ల ఖరారులో వీరి పాత్రపై కూడా విచారణ జరగాల్సిన అవసరం ఉందని నివేదికలో పేర్కొన్నారు. భక్తుల నమ్మకాన్ని వమ్ము చేసిన అధికారులపై ఇప్పుడు ప్రభుత్వం ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటుందో అన్నది వేచి చూడాలి.

## ఏపీలో విభిన్న వాతావరణం!

-మొదటిపేజీ తరువాయి

అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, పశ్చిమగోదావరి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు, పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు. మరోవైపు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఎండ తీవ్రత, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సోమవారం కృష్ణా జిల్లా పెద్దపారుపూడిలో 43.9 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తూర్పులో 43.1 డిగ్రీలు, నంద్యాల జిల్లా దొర్నిపాడులో 42.9 డిగ్రీలు, మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల, నెల్లూరు జిల్లా గూడూరు, శ్రీకాకుళం జిల్లా తామాడలో 42.7, వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగులో 42.6, ఏలూరు జిల్లా ధర్మాజీగూడెంలో 42.2, కర్నూలు జిల్లా మంత్రాలయంలో 42, అనంతపురం జిల్లా తెరన్నపల్లిలో 41.9, పల్నాడు జిల్లా అమరావతిలో 41.8, చిత్తూరు జిల్లా తవణంపల్లెలో 41.6, గుంటూరులో 41.3, ప్రకాశం జిల్లా మర్రిపూడిలో 41.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. 28 జిల్లాలకు గాను 16 జిల్లాల పరిధిలోని 74 మండలాల్లో ఎండ తీవ్ర ప్రభావం చూపి 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తో పశ్చిమ బెంగాల్ సురక్షితం

-మొదటిపేజీ తరువాయి

బీజేపీ విజయం వెనక ఆ పార్టీ అగ్రనాయకత్వం అకుంఠిత దీక్ష ఉందని కొనియాడారు. పశ్చిమ బెంగాల్ వాసుల నమ్మకాన్ని గెలుచుకోవడంలో ప్రధాన నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా గత కొన్ని సంవత్సరాలుగా చేసిన కృషి ఇప్పుడు ఫలితాన్ని ఇచ్చిందన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ నిర్దేశకత్వంలో రాష్ట్రంలో బీజేపీ పాలన ఉంటే డబుల్ ఇంజన్ సర్కార్?తోనే పశ్చిమ బెంగాల్ సురక్షితంగా, సుభిక్షంగా ఉంటుందన్న గట్టి విశ్వాసంతో ఆ రాష్ట్ర ప్రజలు బీజేపీకి పట్టం కట్టారన్నారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ, అమిత్? షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, బీజేపీ పశ్చిమ బెంగాల్ నేత సువేందు అధికారికి ఈ విజయంలో భాగస్వాములైన బీజేపీ నాయకత్వానికి పవన్ కల్యాణ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అసోం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లి: అసోం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లి మరోమారు విజయాన్ని దక్కించుకున్న బీజేపీ నేత, అసోం రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వశర్మకి, పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమికి విజయాన్ని మళ్లీ అందించిన ఎన్.ఆర్. కాంగ్రెస్ నేత, ముఖ్యమంత్రి రంగస్వామికి అభినందనలు తెలిపారు.

**విజయ్‌ని మనసారా అభినందిస్తున్నా**

తమిళనాడు, కేరళ రాష్ట్ర ప్రజలు మార్పును స్పష్టంగా కోరుకున్నారన్నారు. ఇక తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మెజారిటీ స్థానాలను అందించి సింహభాగం ప్రజలు ఆయన వైపు మొగ్గు చూపారని పవన్ అన్నారు. పార్టీని స్థాపించిన అనతి కాలంలోనే గొప్ప విజయాన్ని సాధించిన విజయ్‌ని మనసారా అభినందించారు. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే, బీజేపీ కూటమి పోరాటం బలమైనదేనన్నారు. కేరళలో కూడా మార్పునే మెజారిటీ ఓటర్లు కోరుకున్నారన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఎన్నికల బరిలో నిలిచి గెలిచిన యూడీఎఫ్ నాయకత్వానికి, నాయకులకు అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల పోరాటంలో నిలిచి గెలిచిన విజేతలందరికీ పవన్ కల్యాణ్ పేరు పేరున శుభాభినందనలు తెలిపారు.

## ఏపీలో స్వచ్ఛ రథాలు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ ఇప్పుడు ఒక సామాజిక ఉద్యమంగా మారింది. "మన పారిశుధ్యం.. మన ఆరోగ్యం.. మన బాధ్యత" అని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు క్షేత్రస్థాయిలో ఫలితాలను ఇస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో పురుడుపోసుకున్న 'స్వచ్ఛ రథాలు' పల్లెల్లో చెత్తను సంపదగా మారుస్తూ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి.గత ఏప్రిల్ నెలలో ఈ స్వచ్ఛ రథాలు సాధించిన ప్రగతి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పల్లెల నుంచి రికార్డు స్థాయిలో సుమారు 19 లక్షల కేజీల పొడి చెత్తను ఈ రథాలు సేకరించాయి. కేవలం సేకరించడమే కాకుండా, 'చెత్త నుంచి సంపద' సృష్టి అనే యజ్ఞంలో భాగంగా ఆ వ్యర్థాలకు బదులుగా రూ. 3.32 కోట్ల విలువైన నిత్యవసర వస్తువులను ప్రజలకు పంపిణీ చేశారు. అంటే?. ఒకప్పుడు పనికిరాదని పారేసిన వస్తువులే నేడు గ్రామీణ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయిప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు టాలీవుడ్ ప్రముఖ నటుడు నాని తన వంతు సహకారాన్ని అందించారు. పారిశుధ్యంపై అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమాల్లో ఆయన భాగస్వాములయ్యారు.తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయమని చెప్పడమే కాకుండా, అలా చేసిన వారికి బహుమతులు ఇచ్చి ప్రోత్సహించడం గొప్ప ఆలోచన అని నాని అభిప్రాయపడ్డారు. "పర్యావరణం కోసం పవన్ కళ్యాణ్ చేస్తున్న ఈ కృషికి అభినందనలు. మీకు మద్దతుగా నిలిచే కోట్లాది మందిలో నేను కూడా ఒకడిని" అంటూ నాని తన అభిమానాన్ని చాటుకున్నారు."గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను సులభతరం చేసేందుకు కూటమి ప్రభుత్వం స్వచ్ఛరథాలను తీసుకువచ్చింది. వీటి గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు అడిగిన వెంటనే తన వంతు సహాయ సహకారాలు అందించిన నానికి పవన్ కళ్యాణ్ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం" అంటూ ఉపముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటన కూడా విడుదల చేసిందిభవిష్యత్తు తరాలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ పథకంలో ఒక వినూత్న కోణాన్ని చేర్చారు. ప్రతి గురువారం ఈ స్వచ్ఛ రథాలు నేరుగా పాఠశాలల వద్దకు వెళ్తాయి. విద్యార్థులు తమ ఇళ్ల నుంచి సేకరించిన పొడి చెత్తను అక్కడ అందజేస్తే, దానికి బదులుగా వారికి అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు, పుస్తకాలు వంటి స్టేషనరీ సామాగ్రిని అందిస్తున్నారు. ఈ విధానం వల్ల పిల్లల్లో వ్యర్థాల నిర్వహణపై చిన్నతనం నుంచే బాధ్యత పెరుగుతోంది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'స్వచ్ఛ భారత్' స్ఫూర్తితో, ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించిన 'స్వచ్ఛ ఆంధ్రా' లక్ష్యాలను చేరుకోవడమే ఈ స్వచ్ఛ రథాల ప్రధాన ఉద్దేశం. కేవలం రోడ్లను శుభ్రం చేయడమే కాకుండా, ఆ చెత్తను రీసైక్లింగ్ చేసి ఆర్థిక ప్రయోజనాలు కల్పించడం ద్వారా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్తున్నారు. ఈ విప్లవాత్మక మార్పు పల్లె ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా? ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి బాటలు వేస్తోంది.

## విశాఖకు భారీగా గ్యాస్....

**విశాఖపట్టణం :** కొన్ని వారాలుగా ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న గ్యాస్ కొరత సమస్యకు తెరపడనుంది. పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల కారణంగా నిలిచిపోయిన గ్యాస్ సరఫరా మళ్ళీ పుంజుకుంది. వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధినిదాటుకుని సుమారు 46 వేల మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీ ని లోడ్ చేసుకున్న భారీ భారతీయ నౌక విశాఖపట్నం వైపు దూసుకువస్తోంది. ఈ భారీ ఎల్‌పీజీ నౌక మే 13వ తేదీన విశాఖపట్నం నౌకాశ్రయానికి చేరుకోనుంది.ఇందులో ఉన్న 46 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్ సుమారు 32 లక్షల గృహ సిలిండర్లను నింపడానికి సరిపోతుందని అంచనా. ఈ నౌక రాకతో రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్ర మరియు కోస్తా జిల్లాల్లో ఉన్న గ్యాస్ సిలిండర్ల వెయిటింగ్ పీరియడ్ గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. నౌక విశాఖ చేరుకున్న వెంటనే, గ్యాస్‌ను పైప్‌లైన్ల ద్వారా విశాఖలోని ప్రతిష్టాత్మక 'భూగర్భ గ్యాస్ నిల్వ కేంద్రానికి' తరలిస్తారు. సముద్ర మట్టానికి సుమారు 190 మీటర్ల లోతులో ఉన్న ఈ కేంద్రం నుండి గ్యాస్‌ను హిందుస్తాన్ పెట్రోలియం , ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ వంటి బాట్లింగ్ ప్లాంట్లకు పంపిస్తారు.అక్కడ సిలిండర్లలో నింపి వినియోగదారులకు పంపిణీ చేస్తారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా గ్యాస్ ధరలు పెరగడంతో ఏపీలో కూడా సిలిండర్ల లభ్యత కష్టమైంది. ఇప్పుడు సరఫరా మెరుగుపడటంతో మార్కెట్‌లో గ్యాస్ కొరత తీరడమే కాకుండా, సాధారణ ప్రజలకు ఊరట లభించనుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ పంపిణీ వ్యవస్థను పర్యవేక్షిస్తూ, అక్రమ నిల్వలు ఉండకుండా చర్యలు చేపట్టింది. విశాఖ బాట్లింగ్ ప్లాంట్ నుండి ఆంధ్రప్రదేశ్‌లోని సుమారు 5 జిల్లాలకు మరియు ఇతర ప్రాంతాలకు గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తారు. విశాఖపట్నంలో ప్రపంచంలోనే అత్యంత లోతైన మరియు భారతదేశంలోనే మొదటిదైన భూగర్భ ఎల్‌పీజీ స్టోరేజ్ క్యావెర్న్ ఉన్న సంగతి తెలిసిందే.

# రట్టిణి గ్రామంలో నీటి సమస్యకు పరిష్కారం





**బోరువెల్ మరమ్మత్తులతో ఉపశమనం పొందిన ఎస్సీ వీధి ప్రజలులి**

**లిమెలియాపుట్టి (ప్రతినిది) ప్రజా జ్యోతి మే 04** శ్రీకాకుళం జిల్లా మెలియాపుట్టి మండలం రట్టిణి గ్రామంలోని ఎస్సీ వీధిలో నీటి పంపు (బోరువెల్) పనిచేయకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొన్నారు. వేసవి కాలంలో సమస్య మరింత తీవ్రమవడంతో తక్షణ పరిష్కారం కోసం గ్రామస్తులు పాతపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ చింతల ప్రశాంత్‌ను ఆశ్రయించారు. సమస్యపై వెంటనే స్పందించిన చింతల ప్రశాంత్, విషయాన్ని ప్రత్యేక అధికారి కింజరాపు గణేష్ (ఏఈ హౌసింగ్) దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రత్యేక అధికారి సూచనల మేరకు రట్టిణి పంచాయతీ అభివృద్ధి అధికారి సుహాసిని మహాపాత్రో సమస్యను పరిశీలించారు. బోరువెల్ చెడిపోవడంతోనే ఎస్సీ వీధి ప్రజలు నీటి కొరతను ఎదుర్కొంటున్నారని నిర్ధారించారు. ఈ మేరకు బోరువెల్‌ను అత్యవసరంగా మరమ్మత్తు చేయాలని ప్రత్యేక అధికారికి నివేదించగా, ఆయన ఆదేశాల మేరకు సోమవారం పనులు చేపట్టారు. పంచాయతీ అభివృద్ధి అధికారి సుహాసిని మహాపాత్రో సూచనలతో, చింతల ప్రశాంత్ సమక్షంలో బోరువెల్ మరమ్మత్తు పనులు పూర్తి చేశారు. దీంతో ఎస్సీ వీధి ప్రజలకు నీటి సమస్య నుంచి ఉపశమనం లభించింది. సమస్యను త్వరితగతిన పరిష్కరించినందుకు ప్రత్యేక అధికారి కింజరాపు గణేష్, పంచాయతీ అభివృద్ధి అధికారి సుహాసిని మహాపాత్రో, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చింతల ప్రశాంత్‌లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వీధికి చెందిన మీల సంజయ్, సింహాచలం, మున్నా, గోపాల్, విక్రమ్, అజయ్, కళ్యాణ్, శ్రీను, మనోజ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. క్వింటా మొక్కజొన్నను మద్దతు ధరల ప్రకారం రూ॥ 2400లకు కొనుగోలు చేయాలి

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎఐకేయస్ డిమాండ్**

**జి . సోమన్నజిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ షరీఫ్ భాష**

**నంద్యాల: మే= 04 ప్రజాజ్యోతి (రిపోర్టర్ యస్.భాస్కర్ )** మాజీ రైతు సంఘం అధ్యక్షులు. మొక్కజొన్న పంటకు క్వింటా 2400 రూపాయలు ఇవ్వాలని నంద్యాల ఎమ్మార్వో సత్య శ్రీనివాసులు గారికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది. జిల్లాలో రబీ సీజన్లో సుమారు15వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. మార్చి చివరి నుండే మొక్కజొన్న పంట మార్కెట్ కు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం క్వింటా మొక్కజొన్నకు రూ॥2,400లు మద్దతు ధర ప్రకటించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కజొన్న పంటను కొనుగోలు చేసే విషయంలో ముందుకు రాకపోవడంతో వ్యాపారస్తులు సిండికేట్గా మారి క్వింటా మొక్కజొన్నను రూ॥1,700లోపు కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల క్వింటాకు రూ॥700 చొప్పున ఎకరానికి రూ॥21 వేల నష్టం వస్తున్నది. మొక్కజొన్న పండించిన రైతాంగంలో చిన్న, సన్నకారు, కౌలురైతులే గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, దుక్కి కోత, నూర్పిడి, ట్రాక్టర్ల అద్దెలు విపరీతంగా పెరిగాయి. కొన్ని ప్రాంతాల్లో కౌలురెట్లు కూడా పెరిగాయి. మార్కెట్లో లభిస్తున్న ధర చూస్తే కనీసం సాగు ఖర్చులు వస్తాయని గ్యారెంటీ కూడా కనిపించటం లేదు. ఇటీవల కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తూ మొక్కకొన్న రైతులు మార్కెట్లో అమ్ముకున్న ధరకు, మద్దతు ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చెల్లించటానికి కేంద్ర ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలని పేర్కొన్నారు. కానీ ఇంతవరకు అటు కేంద్ర ప్రభుత్వం గానీ ఇటు రాష్ట్ర ప్రభుత్వం గానీ మొక్కజొన్న కొనుగోలు చేయటానికి ఎటువంటి నిర్ణయం జరగలేదు. వ్యత్యాసం ధర చెల్లించడానికి కూడా ఎటువంటి చర్యలు చేపట్లేదు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కజొన్నను మద్దతు ధరల ప్రకారం కొనుగోలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా తక్షణమే ఈ క్రింద చర్యలు చేపట్టి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కోరుచున్నాము.




1) రాష్ట్ర వ్యాప్తంగా తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

2) ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి క్వింటా మొక్కజొన్నను రూ॥ 2,400లకు మార్క్ ఫెడ్, నా ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి.

3) ఇప్పటికే మార్కెట్లో అమ్ముకొని నష్టపోయిన రైతాంగానికి ధరల వ్యత్యాస పథకాన్ని అమలు చేయాలి.

4) కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల ప్రకారం మొక్కజొన్నను వ్యాపారస్తులు కొనుగోలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

1) జి సోమన్న.

జిల్లా ప్రధాన కార్యదర్శి. అభినందనలతో. అంధ్ర రైతు సంఘం ఎఐకేయస్

నంద్యాల జిల్లా నాయకులు కోరుతున్నారు

# సినిమాలతో సమాజాన్ని చైతన్యపరిచిన దాసరి నారాయణరావు చిరస్మరణీయుడు





**దర్శకరత్న దాసరి 79వ జయంతి వేడుకలలో మంత్రి నిమ్మల.**

**పాలకొల్లు. ప్రజా జ్యోతి ప్రతినిధి. కొట్టి రామం మే 4.** పాలకొల్లు ముద్దుబిడ్డ దాసరి నారాయణరావు దర్శకునిగా, రచయితగా,నటుడిగా, నిర్మాతగా ఎన్నో సినిమాలు తీసి సమాజాన్ని చైతన్యపరిచారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు పేర్కొన్నారు. పాలకొల్లు గాంధీబొమ్మలు సెంటర్ వద్ద దాసరి నారాయణరావు విగ్రహం వద్ద దాసరి కాంస్య విగ్రహం ఏర్పాటు, పరిరక్షణ కమిటీ అధ్యక్షులు యర్రంశెట్టి వెంకటరత్నం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన దాసరి నారాయణరావు 79వ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు దాసరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ ఈ సమాజానికి దశ దిశ చూపించిన దాసరి నారాయణరావు ఎన్నో సినిమాలను నిర్మించారని వ్యాపార ధోరణితో కాకుండా సమాజం కి ఉపయోగపడే విధంగా ఆయన నటునిగా దర్శకునిగా రచయితగా పనిచేశారన్నారు పాలకొల్లుకు ప్రపంచ స్థాయిలో ఖ్యాతి తెచ్చిన దాసరి పాలకొల్లులో పుట్టడం పాలకొల్లు ప్రాంత వాసుల అదృష్టమన్నారు. జన్మభూమి అభివృద్ధికి తన వంతు సహకరించాలన్న సంకల్పంతో దాసరి నారాయణరావు మహిళా కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. దాసరి నారాయణరావు వంతెనను స్మశాన వాటికలో స్థాన ఘట్టాన్ని నిర్మింపజేసి ప్రజల ప్రశంసలను అందుకున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం లో యర్రంశెట్టి వెంకట రత్నం వంగా నరసింహా రావు మెడికొండ శ్రీనివాస్ చౌదరి పెనుమాక రామ్మోహన్ ఇనుకొండ శేషాద్రి మండెల పణి నాథ్ గుండుమోగుల వీరాస్వామి జక్కంపూడి కుమార్ అడబాల వెంకట రమణ కత్తుల రామ్మోహన్ జి వి పెచ్చెట్టీ బాబు వీరా పోతన దాసరి మహేష్ దాసరి బాలాజీ చుండూరీ రంగయ్యనాయుడు . ఉన్నమట్ల కపర్ధి కొల్లి కొండా ప్రసాద్ కొట్టి భాస్కరరావు కలిదిండి వేంకటపతి వర్మ జి ఎస్ ఎన్ మూర్తి తాళాబత్తుల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు వరం...సీఎం రిలీఫ్ ఫండ్

**ఆలూరులో ఘనంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ**

**27 మంది లబ్ధిదారులకు రూ. 8.60 లక్షల ఆర్థిక సాయం** ఆలూరు,/హోళగుంద,మే 4, ప్రజా జ్యోతి న్యూస్ – నిరుపేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి అన్నారు. సోమవారం ఆలూరులోని టీడీపీ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సి ఎం ఆర్ ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను ఆమె లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో మొత్తం 27 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.?8,60,184/- లబ్ధిదారులకు అందించారు.ఈ సందర్భంగా టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. బాధితుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, వారికి నేరుగా ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని ఆమె హామీ ఇచ్చారు.తమ కష్టకాలంలో అండగా నిలిచి, చెక్కులు అందజేసినందుకు లబ్ధిదారులు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి మరియు కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల టీడీపీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు



మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి..

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం**



**బనగానపల్లె :మే 04 ప్రజాజ్యోతి( రిపోర్టర్ యస్.భాస్కర్ )** సోమవారం బనగానపల్లె మండలం తాసిల్దార్ కార్యాలయంలో మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని రైతు సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్ గారికి వినతి పత్రం. ఇవ్వడం జరిగింది మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. క్వింటా మొక్కజొన్నను మద్దతు ధరల ప్రకారం రూ॥ 400లకు కొనుగోలు చేయాలని, జిల్లాలో రబీ సీజన్లో సుమారు15వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. మార్చి చివరి నుండే మొక్కజొన్న పంట మార్కెట్ కు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం క్వింటా మొక్కజొన్నకు రూ॥2,400లు మద్దతు ధర ప్రకటించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కజొన్న పంటను కొనుగోలు చేసే విషయంలో ముందుకు రాకపోవడంతో వ్యాపారస్తులు సిండికేట్గా మారి క్వింటా మొక్కజొన్నను రూ॥1,700లోపు కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల క్వింటాకు రూ॥700 చొప్పున ఎకరానికి రూ॥21 వేల నష్టం వస్తున్నది. మొక్కజొన్న పండించిన రైతాంగంలో చిన్న, సన్నకారు, కౌలురైతులే గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, దుక్కి కోత, నూర్పిడి, ట్రాక్టర్ల అద్దెలు విపరీతంగా పెరిగాయి. కొన్ని ప్రాంతాల్లో కౌలురెట్లు కూడా పెరిగాయి. మార్కెట్లో లభిస్తున్న ధర చూస్తే కనీసం సాగు ఖర్చులు వస్తాయని గ్యారెంటీ కూడా కనిపించటం లేదు. ఇటీవల కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తూ మొక్కకొన్న రైతులు మార్కెట్లో అమ్ముకున్న ధరకు, మద్దతు ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చెల్లించటానికి కేంద్ర ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలని పేర్కొన్నారు. కానీ ఇంతవరకు అటు కేంద్ర ప్రభుత్వం గానీ ఇటు రాష్ట్ర ప్రభుత్వం గానీ మొక్కజొన్న కొనుగోలు చేయటానికి ఎటువంటి నిర్ణయం జరగలేదు. వ్యత్యాసం ధర చెల్లించడానికి కూడా ఎటువంటి చర్యలు చేపట్లేదు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కజొన్నను మద్దతు ధరల ప్రకారం కొనుగోలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా తక్షణమే ఈ క్రింద చర్యలు చేపట్టి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి సీపిఐ సీనియర్ నాయకులు సంజీవులు సిపిఐ మండల కార్యదర్శి శివయ్య చేతి వృత్తుల సంఘం నాయకులు శివ నాగయ్య రైతు సంఘం నాయకులు రవి స్వామి ఏఐఎస్ఎఫ్ నాయకులు మతేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత త్రాగునీరు అందిస్తున్న గూడాల మురళీధర్ రెడ్డి గూడాల ప్రతాపరెడ్డి



**బనగానపల్లె (అవుకు)మే= 04 ప్రజాజ్యోతి (రిపోర్టర్ యస.భాస్కర్)** బనగానపల్లె నియోజకవర్గం. అవుకు మండలం కునుకుంట్ల గ్రామానికి చెందిన ఇశ్ర నాయక్ తాండ మంచినీళ్లు వసతి చాలా కష్టంగా ఉన్న పరిస్థితుల్లో కునుకుంట్ల కు చెందిన సీనియర్ టిడిపి నాయకులు శ్రీ గూడాల మురళీధర్ రెడ్డి శ్రీ గుడాల ప్రతాపరెడ్డి ఉచిత నీరు సౌకర్యం కల్పించారు ఇశ్రా నాయక్ తాండ గ్రామ ప్రజలు మంచినీళ్ల వసతి మాకు కల్పించినందుకు శ్రీ గుడాల ప్రతాపరెడ్డి కి అలాగే శ్రీ గుడాల మురళీధర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.

## విద్యతో విజ్ఞానవంతులై ఉన్నత స్థానాలకు ఎదుగుతారు.



**పాలకొల్లు ప్రజా జ్యోతి ప్రతినిధి కొట్టి రామం.మే 4.** విద్యార్థులందరూ ఉన్నత విద్యను అభ్యసిస్తే విజ్ఞానవంతులై ఉన్నత స్థానాలకు ఎదుగుతారని మండల రిసోర్స్ పర్సన్ కే భారతి అన్నారు. పోడూరు మండలం జిన్నూరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో మండల రిసోర్స్ పర్సన్ కే భారతి విద్యార్థులకు విద్య యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు.. ముందుగా తాళాబత్తుల వీరభద్ర కుమారి గారు విద్యార్థులకు కాళీ వాటర్ బాటిల్స్ తో ఫ్లవర్ వాజ్, పూల బుట్టలు ఫ్లవర్స్ నేర్పించడం జరిగినది బాల సంస్కార్ సెంటర్ టీచర్ బండారు వెంకటరమణ విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు నేర్పించారు. ఈ కార్యక్రమాలను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు బూడి కృష్ణ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు బత్తుల జోగారత్నం విద్యార్థులు పాల్గొన్నారు.

## తమిలనాడు రాష్ట్రానికి కాబోయో ముఖ్యమంత్రి టివికే పార్టీ అధ్యక్షులు సిని నటుడు విజయ్ గారికి నంద్యాల జిల్లా యస్ సీ యస్ టి పరిరక్షణ కమిటి నాయకుడు

**మీ బొంత్తమహేష్ ముదంస్తు విజయోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు**



**నంద్యాల: మే = 04 ప్రజాజ్యోతి (రిపోర్టర్ యస్.భాస్కర్ )** భారతదేశ చరిత్రలో ఒక దళిత వర్గానికి చెందిన వ్యక్తి పార్టీ స్థాపించి పార్టీ స్థాపించిన మొదటి ఎన్నికల్లోనే ఘన విజయం సాధించి చరిత్ర సృష్టించిన విజయ్ కు శుభాకాంక్షలు వెనుకబడిన వర్గాలలోని యువత విజయ్ ను స్ఫూర్తిగా తీసుకొని యువత మరింత రాజకీయాల్లో రావాలని కోరుకుంటూ బొంత్త మహేష్

# క్రైస్తవంలోకి మారితే ఎస్సీ హోదా ఉండదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధం


**దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం జాతీయస్థాయిలో మా పోరాటం కెవిపిఎస్**

**మే 04 ( ప్రజా జ్యోతి ఎమ్మిగనూరు అర్బన్ ప్రతినిధి )** క్రైస్తవ మతం మారిన దళితులకు రిజర్వేషన్లు వర్తించవని, ఎస్సీ హోదా కోల్పోతారని సుప్రీంకోర్టు తీర్పునివ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఈ తీర్పును పునర్విచారణకు రాజ్యాంగ బెంచ్ కు పంపాలని, క్రైస్తవులుగా ఉన్న దళితులను ఎస్సీలు గానే కొనసాగించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి పేర్కొన్నారు. సోమవారం కర్నూలు జిల్లా,ఎమ్మిగనూరు పట్టణంలో శ్రీ రాజేశ్వరి హోటల్ ఫంక్షన్ హాల్ నందు కెవిపిఎస్ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవుల సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు యస్. దేవసహాయం అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఆనంద్ బాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జి. ఆనంద్ చైతన్య మాదిగ, ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు కర్నూలు జిల్లా అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ కోరిశెట్టి మాల మధు బాబు, డా.బి.ఆర్. అంబేద్కర్ భవన సాధన కమిటీ చైర్మన్ కదిరికోట ఆదెన్న, సిఐటియు ఎమ్మిగనూరు ప్రాంతీయ కమిటీ అధ్యక్షులు సి. గోవిందు,ఎరుకల హక్కుల పోరాట సమితి, ఉపాధ్యాయులు ఎరుకుల కృష్ణ, దళిత రచయితల సంఘం (దరసం) వ్యవస్థాపక అధ్యక్షులు, ఉపాధ్యాయులు ఆరెకంటి భాస్కర్, ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం (ఏపి డీకేఎస్) కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. కరుణాకర్ తదితరులు ప్రజలను ఉద్దేశించి సదస్సులో ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్ కులాలకు చెందిన వారు మతం మారినంత మాత్రాన వారి సామాజిక పరిస్థితులు, హోదా ఎక్కడ మారలేదని, హోదా గౌరవం కూడా ఎక్కడ పెరగలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎస్సీలకు మతం మారే మత స్వేచ్ఛ లేనప్పుడు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14,15,25 లు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు.




దళితులకు, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగడానికి, కల్పించడానికి జాతీయ స్థాయిలో కెవిపిఎస్ కలిసి వచ్చే వ్యక్తులతోనూ, శక్తులతోనూ పోరాటం కొనసాగిస్తుందని భరోసా ను ఇచ్చారు. మతం మారిన అగ్రకులాలకు పేదరికం పేరుతో ఈ.డబ్ల్యూ.ఎస్. ద్వారా 10 శాతం రిజర్వేషన్లు పొందుతున్నప్పుడు, క్రైస్తవ మతం మారిన దళితులు రిజర్వేషన్లు ఎందుకు పొందరాదని ఆవేదన వ్యక్తం చేశారు. 1956లో సిక్కు మతంలోని దళితులకు, 1990 లో బౌద్ధమతంలోని దళితులకు ఎస్సీ హోదా కల్పించినప్పుడు క్రైస్తవ మతంలోని దళితులు మాత్రం ఏ పాపం చేశారని మండిపడ్డారు. ఎస్టీ కులాలు క్రైస్తవ మతం మార్చుకుంటే ఎస్టీలు గానే కొనసాగుతున్నప్పుడు, అగ్రకులాలు క్రైస్తవ మతం మార్చుకుంటే అగ్రకులాలు గానే చలామణి అవు తున్నప్పుడు, క్రైస్తవ మతం మారిన దళితులు మాత్రం ఎందుకు దళితులుగా ఉండరాదని ప్రశ్నించారు. దళితుల మత స్వాతంత్ర్య హక్కును హరించి వేస్తున్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మతం మారిన దళితులకు రక్షణ కల్పించాలని, దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్సీ హోదా కోసం నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాక్షిగా నినదిస్తూ వేదికపై నేతలంతా చేతులెత్తి సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ల అసోసియేషన్ నాయకులు రెవ. పేమర యోహాను, రెవ. వీరేశ్, రెవ.ఎలీషా, రెవ.జాన్ సామేలు, రెవ.ఆశేర్ భూషణం, రెవ.జీవన్ బాబు, రెవ.యోహోషువ,జిల్లా ఉపాధ్యక్షులు గంజ హళ్ళి మహాదేవ్ మాదిగ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగప్ప, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి యస్. రాజు, మహిళా నాయకురాలు ఇ లాది జయమ్మ, కెవిపియస్ నాయకులు సపోగు తిమ్మన్న, సుమాల అంతోని, సుమాల రాజు, మాల రాజా రమేష్, కోటేకల్ చిన్నప్ప, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ హాలహర్వి దావీదు, ఆర్ అండ్ బి సూపర్ వైజర్ ప్రభు కుమార్, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (యన్.సి.సి) జిల్లా కార్యదర్శి కదిరికోట వెస్లీ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరులో ప్రేమ జంట ఆత్మహత్య

**ప్రజా జ్యోతి చెన్నూరు మే 4,,** ఒకే ఊరు కులాలు వేరు అయినా గాఢంగా ప్రేమించుకున్నారు అంతలో ఏమైంది ఏమో ఇరువురు ఆత్మహత్య చేసుకున్నారు  చెన్నూరు సరస్వతి నగర్ కు చెందిన గిరి రాజు కుమారుడు యోగేశ్వర రాజు(20) కడపలో తన బాబాయి ఇంట్లో ఉంటూ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుకుంటున్నాడు, ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకున్న యోగేశ్వర రాజును అక్కడ పోయి చూసి వచ్చిన అదే కాలేజీ లో చదువుతున్న చెన్నూర్ గో దిన వీధికి చెందిన తన స్నేహితురాలు హేమ శ్రీ(19) తను ఇంటిలో ఉరేసుకొని మృతి చెందింది.. ఇరువురి ప్రేమను పెద్దల అంగీకరించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు, త్వరలో వివాహం చేసుకునేందుకు మీరు కుటుంబాలు అంగీకరించినట్లు స్థానికులు చర్చించుకున్న ఉన్నారు, అయితే ఏమైందో ఏమో ఇరువురు ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా చెన్నూరు మండలంలో విషాదం మేలుకొని ఉంది . హేమశ్రీ తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు వారి ఇంటి వద్దకు చేరుకొని ప్రతిదేహాన్ని పరిశీలించి కడప రిమ్స్ తరలించారు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కొంతేరు నాటిక పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా అమ్మ చెప్పిన బొమ్మ.



**పాలకొల్లు ప్రజా జ్యోతి ప్రతినిధి కొట్టి రామం మే 4.** యలమంచిలి మండలం కొంతేరులో యూత్ క్లబ్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు జరిగిన అఖిల భారత స్థాయి నాటిక పోటీలు ఆదివారం రాత్రి తో ముగిసాయి. ఎంతో ఉత్సాహభరితంగా ఆసక్తికరంగా జరిగి ప్రేక్షకులను రంజింపచేసిన ఈ నాటిక పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా గోపి క్రియేషన్స్ హైదరాబాద్ వారి అమ్మ చెప్పిన బొమ్మ ఎంపికయింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్ గుంటూరు వారి ఇది అతని సంతకం నాటిక,, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళా స్రవంతి విశాఖపట్నం వారి అగ్నిసాక్షి నాటిక జ్యూరీ ప్రదర్శనగా బీవీకే క్రియేషన్స్ వారి తితిక్ష నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ నటుడిగా ఇది అతని సంతకం లో కృష్ణమూర్తి పాత్ర దారి ఎన్ రవీంద్రారెడ్డి ఉత్తమ నటిగా అమ్మ చెక్కిన బొమ్మ లో అనసూయ పాత్రధారిణి జ్యోతి రాజ్ బీశెట్టి ఉత్తమ ప్రతినాయకుడిగా అగ్నిసాక్షిలో పార్ధ పాత్రధారి వై అనిల్ కుమార్ ఉత్తమ దర్శకునిగా అమ్మ చెక్కిన బొమ్మ నాటికకు వెంకట గోవాడ ఉత్తమ రచనగా అమ్మ చెక్కిన బొమ్మ నాటికకు జ్యోతి రాజ్ అందుకున్నారు. ద్వితీయ ఉత్తమ రచనగా ఇది అతని సంతకం స్నిగ్ధ ద్వితీయ ఉత్తమ నటుడిగా అమ్మ చెక్కిన బొమ్మ శశి పాత్రదారి భాను ప్రకాష్ అనూష ద్వితీయ ఉత్తమ నటి ఇది అతని సంతకం అరుణ పాత్రధారి జి ఎన్ డి కుసుమ సాయి ఉత్తమ బాల నటుడు అమ్మ చెక్కిన బొమ్మ శశి - 1పాత్రజారి దినేష్ అందుకున్నారు.ఇవి గాక ఉత్తమ సంగీతం ఉత్తమ ఆచార్యం ఉత్తమ రంగాలంకరణ కు బహుమతులను ఎంపికైన వారికి అందజేశారు. పోటీలకు గుణ నిర్ణేతలుగా కత్తుల రామ్మోహన్ రావు గంటా రామ్మోహన్రావు గంటా వెంకటేశ్వరరావు వ్యవహరించారు.ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధాన సభకు అధ్యక్షులు అంబటి మురళీకృష్ణ అధ్యక్షత వహించగా చేగొండి సత్యనారాయణమూర్తి అన్నమట్ల కపర్ధి మానాపురం సత్యనారాయణ ముఖ్య అతిధులుగా పాల్గొని ఉత్తమ ప్రదర్శన లకు ఇతర విబాగాలలో ఎంపికైన వారికి దాతల సహాయంతో నగదు బహుమతులను, షీల్డ్ లను అందజేసి సత్కరించారు స్థానిక కళాకారులు యూత్ క్లబ్ నాటక పరిషత్తుకార్యదర్శి గంటా ముత్యాల రావు కోశాధికారి అంబటి నవీన్ చంద్ పులపర్తి రాజగోపాలరావు తదితర కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

## తమిళనాడు రాష్టానికి కాబోయో ముఖ్యమంత్రి టివికే పార్టీ అధ్యక్షులు సిని నటుడు విజయ్ గారికి మాలలా రాష్ట్ర కార్యధర్మి దస్తగిరి ముందస్తు విజయోత్సవ శుభాకాంక్షుతెలిపారు




**నంద్యాల:మే = 04 ప్రజాజ్యోతి (రిపోర్టర్ యస్.భాస్కర్)** మెగాస్టార్ చిరంజీవి సాధించని విజయం పవర్ స్టార్ పవన్ కళ్యణ్ సాధించని విజయం సూపర్ స్టార్ రజినికాంత్ సాధించని విజయం ఉలగనాయకన్ కమాల్ హసాన్ సాధించని విజయం ఇప్పుడు --- విజయ్ మాల సాధించారు తమిళనాడులో టివికే పార్టీ స్థాపించి ఏపార్టీతో కూడా పొత్తు పెట్టుకోకుండా ఎవరికి ఊడిగం చేయకుండా సింగల్ గా పోటి చేసి ఇదీ నాసత్తాఅని సగర్వంగ చాటుకుంట్టు ప్రతి పక్ష పార్టీలకు చుక్కలు చూపిస్తూ విజిల్ సౌండ్ గట్టిగా వినిపిస్తు విజయందుందుభి మోగిస్తున్న టివికే పార్టీ అధ్యక్షులు సినీనటుడు విజయ్ గారికి ముందస్తు విజయోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్న మాలమహానాడు రాష్ట్ర కార్యధర్మ దస్తగి

# పోలవరం నిర్వాసితులకు ఉపాధి--ప్యాకేజీలు ఇవ్వాలి




**సీపీఎం జిల్లా కమిటీ సభ్యుల డిమాండ్**

**కూనవరం, మే 04 (ప్రజాజ్యోతి):** పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులు పునరావాసం కోసం ఆర్ అండ్ ఆర్ కాలనీలకు వెళ్లిన వెంటనే ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, పాయం సీతారామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూనవరం మండలం ముల్లూరు గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడిన వారు పలు సమస్యలను ప్రస్తావించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో సంబంధం లేకుండా ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించి నిర్వాసితులకు నిరంతరం పనులు కల్పించాలని కోరారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రకటించే సమయంలో వయసుతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబ సభ్యుడికి ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే నిర్వాసితులుగా మారుతున్న ప్రతి కుటుంబంలో చదువుకున్న వారికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని కోరారు. గతంలో కొన్ని గ్రామాలకు ఇచ్చిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి తొమ్మిది సంవత్సరాలు గడిచాయని, ఆ సమయంలో ఇచ్చిన డబ్బులు ఆరోగ్య సమస్యలు తదితర కారణాలతో ఇప్పటికే ఖర్చైపోయాయని తెలిపారు. ఇప్పటికీ పునరావాస కాలనీలకు వెళ్లిన అనేక కుటుంబాలు ఉపాధి లేక బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి కుటుంబాలను గుర్తించి తక్షణమే ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రానికి జీవనాడిగా చెప్పుకునే పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులైన ప్రజలకు అన్యాయం జరుగుతుందని విమర్శించారు. అమరావతి రాజధాని రైతులకు కల్పిస్తున్న సదుపాయాల మాదిరిగానే పోలవరం ముంపు బాధితులకు కూడా వయసుతో సంబంధం లేకుండా పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి నిర్వాసిత కుటుంబంలో కనీసం ఒకరికి పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లు నెరవేర్చకపోతే నిర్వాసితులతో కలిసి పోరాటం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శీలం పిచ్చయ్య, సోడే నాగేశ్వరరావు, శీలం ప్రసాద్, కట్టం ప్రభాకర్ రావు, బొడ్డు పుల్లారావు, శీలం రాములమ్మ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలోవేగంపుంజుకున్న జలధార

**--జలహారతి పనులు**

**- ఎంపీడీవో వేణుగోపాల్**

**తాళ్లపూడి ,మే 4, ప్రజాజ్యోతి న్యూస్** భూగర్భ జలాలను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న “జలధార, జలహారతి” పథకం కింద తాళ్లపూడి మండలంలో పనులకు ఊపందింది. మండలంలోని 9 గ్రామాలలో మొత్తం 49 పనులను గుర్తించగా, అన్నీ ఉపాధి హామీ పథకం కింద చేపట్టినట్లు ఎంపీడీఓ ఎస్. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.ఈ పనుల్లో 14 పనులకు పరిపాలనా ఆమోదం లభించగా, ఫీడర్ చానళ్లు, ఫీల్డ్ చానళ్లు, చెరువుల పూడికతీత పనులు ఉన్నాయి. వాటిలో 1 చెరువు, 13 ఫీడర్ మరియు ఫీల్డ్ చానల్ పనులు ఉన్నాయి. ప్రస్తుతం 7 కాలువల పనులు కొనసాగుతుండగా, మరో చెరువు పనిని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు.జలధార--జలహారతి కార్యక్రమంలో భాగంగా గజ్జరం గ్రామంలో 1 ఫీడర్ కాలువ, పొచవరం గ్రామంలో 2 ఫీడర్ కాలువలు, అన్నదేవరపేటలో 2 ఫీడర్ చానళ్లు,



పెద్దేవంలో 2 ఫీడర్ చానల్ పనులు కొనసాగనున్నయన్నారు.మండలంలోని 9 గ్రామ పంచాయతీలలో సుమారు 202 మంది ఉపాధి శ్రామికులు ఈ పనుల్లో పాల్గొంటూ భూగర్భ జలాల పెంపుకు కృషి చేసుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ చైతన్య, ఏపీఓ సీహెచ్ రమాదేవి, ఉపాధి హామీ ఫీల్డ్ సిబ్బంది, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వాటర్ యూజర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు

## అనుమతి లేని పుంత రోడ్డు పనులను అడ్డుకున్న అధికారులు

**తాళ్లపూడి, మే 4, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామ పంచాయతీ




పరిధిలో ఉన్నత అధికారుల అనుమతి లేకుండా పుంత రోడ్డు పనులు ప్రారంభించిన గుర్తుతెలియని వ్యక్తులు. ప్రక్కిలంక హెచ్ పి పెట్రోల్ బంక్ పక్కన గల పుంతదారి గుర్తుతెలియని వ్యక్తులు జెసిబి సహాయంతో పనులు ప్రారంభించిన నేపథ్యంలో పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. పంచాయతీ నుండి ఎటువంటి అనుమతులు లేకుండా పొలాలకు వెళ్లే దారిని శుభ్రం చేస్తున్న జెసిబి ని అడ్డుకోవడం జరిగిందని ప్రక్కిలంక పంచాయతీ అధికారులు తెలిపారు. అంతేకాకుండా ఎనర్జీఎస్ నుండి గాని మండల పరిషత్ నుండి గాని ఎటువంటి నిధులు మంజూరు కాలేదు కానీ రోడ్డు పనులు ప్రారంభించడంతో అధికారులకు సైతం తలనొప్పిగా మారింది. అనుమతులు లేకుండా రోడ్డు పనులు ప్రారంభించిన నేపథ్యంలో వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు . అసలు రోడ్డు పనులు ప్రారంభించమని చెప్పిన ఆ వ్యక్తి ఎవరో వెతికే పనిలో అధికారులు ఉన్నారట

# పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచులకు ఘన సన్మానం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు**

**(పోలవరం ప్రతినిధి ప్రజా జ్యోతి ).. మే 04..** పోలవరం మండలంలోని గ్రామ పంచాయతీ సర్పంచులు తమ ఐదేళ్ల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, జిల్లేళ్లగూడెం గ్రామ పంచాయతీ కమిటీ ఆధ్వర్యంలో వారిని గౌరవిస్తూ ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ముఖ్య అతిథిగా హాజరై సర్పంచులను దుశ్శాలువలతో సత్కరించారు.

గ్రామాభివృద్ధికి సర్పంచులే

**పునాది:**

తెల్లం బాలరాజు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు.

అంకితభావం: గత ఐదేళ్లుగా ప్రజలతో మమేకమై, గ్రామాల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేసిన సర్పంచుల అంకితభావం ప్రశంసనీయం.

**సంక్షేమ పథకాలు:**

ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరవేసి, గ్రామాలను ప్రగతి పథంలో నడిపించడంలో సర్పంచులు కీలక భూమిక పోషించారు.

**స్ఫూర్తిదాయకం:**

ఇలాంటి సన్మాన కార్యక్రమాలు నాయకుల్లో సేవా తపనను మరింత పెంపొందిస్తాయని, భవిష్యత్తులో కూడా ప్రజల కోసం నిరంతరం పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పోలవరం మండలంలోని 12 పంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సన్మానం పొందిన వారిలో సర్పంచులతో పాటు గ్రామ కమిటీ సభ్యులు ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. హాజరైన ఇతర నాయకులుఈ వేడుకలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, మండల అధ్యక్షులు బుగ్గ మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ మీడియం సింగరాజు, ఉప సర్పంచ్ కోరసిక శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే మైగాపుల దుర్గాప్రసాద్, పొడుం శ్యామ్ కుమార్, అక్కబత్తుల రాజు, సోబ్బన మోహన్, సుంకర రామ్ కుమార్, మాధవ సాయి, అప్పు మరియు భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఎవరు ఎన్ని కుట్రలు చేసిన నందవరం లో బిజెపి జెండా రెపరెపలాడుతుంది





**బిజెపి జెండాను ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ, దేశాయ్ గురు రాజారావు**

**నందవరం మే 04 (ప్రజా జ్యోతి ):** మండల కేంద్రంలో సొసైటీ ఆవరణంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ దేశాయ్ గురు రాజారావు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ బిజెపి జెండాను ఆవిష్కరించారు. మన ఊరు మన జెండా కార్యక్రమంలో భాగంగా రామకృష్ణ మాట్లాడుతు మూడు రాష్ట్రాల్లో బిజెపి విజయం పై సంబరాలు జరుపుకుని స్వీట్లు పంచుకున్నారు. బిజెపి నాయకులు, దేశంలో ప్రతి రాష్ట్రము బిజెపి నాయకత్వాన్ని కోరుకుంటుందిని అక్కమ్మ తోట రామకృష్ణ అన్నారు.అలాగే 21 రాష్ట్రాల్లో బిజెపి అధికారం చేపట్టి దేశాన్ని ముందుకు నడిపిస్తుంది. కాంగ్రెస్ అరాచకాలు కుంభకోణాలపై దేశ ప్రజలు విసుగు చెందారని, దేశంలోని ప్రతి పౌరుడు మోడీ నాయకత్వాన్ని బీజేపీ అధికారాన్ని కోరుక ుంటున్నారని తెలిపారు. దేశాయ్ నెట్వర్క్ అధినేత ఎమ్మిగనూరు నియోజకవర్గ కన్వీనర్ దేశాయ్ గురు రాజారావు మాట్లాడుతూ ఈరోజు నందవరం లో ఒక పండుగ వాతావరణంలో జరుపుకుంటున్నామని అలాగే బిజెపి జెండాను ఎగరవే యకుండగా కొంతమంది నాయకులు అడ్డుకున్నారని ఎన్ని కుట్రలు పడిన నందవరం మండల కేంద్రంలో బిజెపి జెండా రెపరె పలాడుతుందని అలాగే రాబోయే స్థానిక ఎలక్షన్లో బిజెపి సత్తా చూపుతామని తెలిపారు. జిల్లా అధ్యక్షులు ఆధ్వర్యంలో నాగులదిన్నె గ్రామం నుండి దేశాయ్ గురు రాజా రావు ఆధ్వర్యంలో 50 మంది ఇతర పార్టీ నుండి బిజెపిలో కి చేరారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర బిల్డింగ్ కమిటి చైర్మన్ విట్టా రమేశ్,బిజెపి రాష్ట్ర నాయకురాలు గీతా మాధురి గురురాజ్ దేశాయ్ జిల్లా అదికార ప్రతినిధి జిల్లా మహిళా మోర్చ అద్యక్షులు సుజాత కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ఎన్ ఈరన్న, జిల్ల కార్యదర్శి మాలతి, ఎమ్మిగనూరు పట్టణ అధ్యక్షులు ఎ+ూ దయసాగర్, ఎమ్మిగనూరు పట్టణ ఉపాధ్యక్షులు గాజుల సురేంద్ర,జిల్లా మహిళ మోర్చ ఉపాధ్యక్షులు పద్మవతి, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు బి ఎల్ నారాయణ, ఎమ్మిగనూరు మండల ఉపాధ్యక్షులు కురువ బడేసాబ్, జిల్ల లీగల్ సెల్ ఉపాధ్యక్షులు అడ్వొకేట్ వడ్డె ఉరుకుందు, తదితరులు పాల్గొన్నారు.

# బెంగాల్, అస్సాం, పుదుచ్చేరీలలో బీజేపీ జయభేరి





**జీలుగుమిల్లిలో ఘనంగా విజయోత్సవ ర్యాలీ**

(జీలుగుమిల్లి /ప్రజాజ్యోతి) పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రమైన జీలుగుమిల్లి మరియు దర్భగూడెం గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

**ధర్మం గెలిచింది:**

బీజేపీ నేతలు ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు చాత్రాతి ప్రసాద్, మండల అధ్యక్షుడు గుడ్ల రాంబాబు మాట్లాడుతూ, దేశం కోసం, ధర్మం కోసం బీజేపీని ఆదరించిన మూడు రాష్ట్రాల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**బెంగాల్ మార్పు:**

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ అరాచక పాలనకు ప్రజలు ముగింపు పలకడం ఆ రాష్ట్ర ప్రజల ఔన్నత్యానికి నిదర్శనం.

**మోదీ నాయకత్వం:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు పూర్తిస్థాయిలో నమ్ముతున్నారు.

**తెలుగు రాష్ట్రాలపై ధీమా:**

రానున్న రోజుల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు.

**అగ్రగామిగా భారత్:**

భవిష్యత్తులో భారతదేశం అభివృద్ధిలో ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలుస్తుందని వారు పేర్కొన్నారు. పాల్గొన్న ముఖ్య నాయకులు ?ఈ విజయోత్సవ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పులగం సుబ్బారెడ్డి, కేతిరెడ్డి నెహ్రూ రెడ్డి, వీరంకి బాలు, సోమిరెడ్డి, రేపాక గోపాలం, దారా మధుతో పాటు జనసేన నాయకులు బండారు అనిల్ తదితరులు పాల్గొన్నారు. కార్యకర్తల బాణాసంచా కాల్పులు, నినాదాలతో జీలుగుమిల్లి పరిసర ప్రాంతాలు మారుమోగాయి.

## అడుగడుగునా గుంతలు-ప్రయాణికులకు చుక్కలు

**--చిల్లంగి-వేలంక రహదారి దుస్థిత**

**కాకినాడ జిల్లా మే 04( ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామం నుంచి వేలంక గ్రామం వరకు ఉన్న రహదారి పూర్తిగా దెబ్బతిని వాహనదారులకు ప్రాణాంతకంగా మారింది.గుంతలతో నిండిపోయిన ఈ మార్గంలో ప్రయాణం రోజురోజుకు ప్రమాదకరంగా మారుతోంది.అడుగుకోమడుగు మాదిరిగా ఉన్న ఈ రహదారిపై కార్లు,ఆటోలు,ద్విచక్ర వాహనాలు నడపడం కష్టసాధ్యంగా మారింది.ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలు తరచూ మరమ్మత్తులకు గురవుతున్నాయి.రెండు రోజుల క్రితం న్యాయవాది కాళీ ప్రసాద్ కారు గుంతల్లో పడి దెబ్బతిన్న ఘటన స్థానికులను ఆందోళనకు గురి చేసింది.ఇప్పటికే పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురైనట్లు తెలుస్తోంది.స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రహదారి నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీ అమలు ఆలస్యం కావడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.కాలయాపన కారణంగా ఇబ్బందులు మరింత పెరిగాయని గ్రామస్తులు అంటున్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చిల్లంగి-వేలంక రహదారిని పునర్నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## పాలకొల్లులో బిజెపి విజయోత్సవ సంబరాలు.



**పాలకొల్లు ప్రజా జ్యోతి ప్రతినిధి కొట్టి రామం మే 4.** పశ్చిమబెంగాల్,అస్సాం,పుదుచ్చేరి లలో బీజేపీ విజయం సాధించిన సందర్భంగా పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్ లో గల బీజేపీ కార్యాలయం వద్ద బిజెపి పాలకొల్లు పట్టణ శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు జరిగాయి. పట్టణ అధ్యక్షులు కొల్లి కొండప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు,కార్యకర్తలు మందుగుండు సామాను కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ మోడీ పరిపాలన దక్షతకు ఈ ఫలితాలు నిదర్శనం అన్నారు. అస్సాం లో హాట్రిక్ విజయం నమోదు చేశామని,పశ్చిమ బెంగాల్ లో మమత బెనర్జీ పాలనకు చరమ గీతం పాడి బీజేపీ పాలన ప్రారంభం అయిందన్నారు. ఈ కార్యక్రమం లో ఉన్నమట్ల కబర్ది,రావూరి సుధ,జక్కంపూడి కుమార్,చెరుకూరి శ్రీనివాస్,మల్లవోలు సురేష్,బోడా కనకరాజు,యర్రంశెట్టి పద్మారావుగవర పవన్ నాయుడు,,నాలం బాబీ,వేరుకొండ దుర్గా ప్రసాద్,కోరాడా సూరిబాబు ,కొణిజేటి గుప్త,చందని లక్ష్మీ నారాయణ, ,దూడే హరనాథ్,కాండురీ రవి,కడశారపు అప్పన్న,సలాది రామ చంద్రరావు,బొక్క నరసింహమూర్తి,బెల్లంకొండ నరసింహారావు,దంతులూరి నాగేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

## శివాల్ పల్లె లోఉపాధి కూలీలకు లస్సిప్యాకెట్ల

**పంపిణీ చేసిన ఆధ్యాత్మికవేత్త పొట్టి పాటి ప్రతాప్ రెడ్డి**




**చెన్నూరు,,మే,4,** చెన్నూరు మండలం శివాల్ పల్లి గ్రామపంచాయితీ పరిధిలో సోమవారం ఉదయం వ్యవసాయ పంటపోలల్లో పంటకాలువలు లోఉపాధి పనులు చేపడుతున్న ఉపాధి కూలీలకు శివాల పల్లి జింకల వంక ప్రక్కన వెలసిన శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామి( ఉరుకుంద ఈరన్న స్వామి) ఆలయం వ్యవస్థాపకులు. ఆధ్యాత్మికవేత్త. పొట్టి పాటి ప్రతాపరెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులు కు లీకులు లస్సి ప్యాకెట్లు పంపిణీ చేశారు. శివాలపల్లి. దళితవాడ. గోపవరం గ్రామానికి చెందిన 150 మంది ఉపాధి కూలీలు పంటకాలువలు నందు ఉపాధి పనులు చేస్తున్నారు. ఎండ వేడిమి తో పనులు చేస్తున్న కూలీలను చూసి ప్రతాపరెడ్డి మానవతాదృష్టితో వారికి దప్పిక తీర్చేందుకు లస్సి ప్యాకెట్లు పంపిణీ చేశారు. వంటకాలలో మూడు చోట్ల ఉపాధి పనులు చేపడుతున్న వారి దగ్గరికి వెళ్లి లస్సి ప్యాకెట్లు అందించారు. కూలీలకు సేద తీర్చేందుకు వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆశీర్వాదంతో శనివారం ఉపాధి పనులు చేస్తున్నకులీలకు మజ్జిగ పంపిణీ చేయగా ప్రస్తుతం రెండో విడత కూలీలకు లస్సిప్యాకెట్ల అందజెశారు. ప్రతాప్ రెడ్డి మజ్జిగ లస్సిప్యాకెట్ల అందజెయడంతో చేయడంతో ఉపాధి కూలీలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆశీర్వాదం ఆయన కటాక్షం వల్ల ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యులు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్, నంద్యాల చంద్రశేఖర్ మెట్లు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## కల్లమడి ప్రియాంక కి డాక్టరేట్



**గుంతకల్లు మే 4 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు పట్టణంలోని సత్యనారాయణ పేటకు చెందిన గుంతకల్లు రైల్వే డీజిల్ లోకో షెడ్ మెకానికల్ డిపార్ట్మెంట్లో గ్రేడ్ వన్ ఉద్యోగి గా చేస్తున్న అనసూయ కుమార్తె కు శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాల యం ఆర్థిక శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని కల్లమడి ప్రియాంక కి డాక్టోరేట్ ను ప్రధానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ బి.రాజ మాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక శాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ జి. సవరయ్య మార్గదర్శక త్వంలో ఇంపాక్ట్ అఫ్ నేషనల్ రూరల్ లైవ్లిహుడ్ మిషన్ ఆన్ రూరల్ పూర్ ఏ కేస్ స్టడీ ఇన్ అనంతపూర్ డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. ఈ పరిశోధనలో అనంతపూర్ జిల్లాలోని సుమారు 356 మంది గ్రామీణ స్త్రీల బాగోగు లు వారి జీవన ప్రమాణాల్లో ఏన్ఆర్ఎల్ఎం స్కీం ఎంత ప్రభావం చూపిందో విశ్లేషించిన ట్లు తెలిపారు. కల్లమడి ప్రియాంక పలు జాతీయ అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ లో 15 కు పైగా పరిశో ధనా పత్రాలను ప్రచురించిన ట్లు మరియు ఏపీ సెట్, కర్ణాటక సెట్, యుజిసి నెట్, జెఆర్ఎఫ్ మరియు గ్లోబల్ ఎకనామిక్ ప్రోగ్రెస్ అండ్ రీసెర్చ్ అసోసియేషన్ న్యూఢిల్లీ నుండి గోల్డ్ మెడల్ కూడా సాధించింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు బంధుమిత్రులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

## విభిన్న ప్రతిభావంతు లకు రూ.6.15 లక్షలు విలువైన ల్యాప్ టాప్, మొబైల్ ఫోన్లు ఉచితంగా అందజేసిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్..



**కాకినాడ జిల్లా (ప్రజా జ్యోతి)** కాకినాడ కలెక్టరేట్ లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులకు రూ.6.15 లక్షల విలువైన ల్యాప్ టాప్ లు, మొబైల్ ఫోన్లను జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్.. విభిన్న ప్రతిభావంతులు వయావృద్ధుల సంక్షేమ శాఖ ఏడి ఏవై.శ్రీనివాసుతో కలిసి ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ, ఆపైన చదువుతున్న దివ్యాంగులకు, రూ.45 వేల విలువైన ల్యాప్ టాప్, పదో తరగతి ఆ పైన చదువుతున్న బధిరులకు రూ.15 వేల విలువైన మొబైల్ ఫోన్లు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు.

## జర్నలిస్టును వేధించిన గీతం కాలేజీ కరస్పాండెంట్‌ను కఠినంగా శిక్షించాలి

**: ఎస్ డి పి ఐ డిమాండ్**




**హొళగుంద, మే 4, ప్రజా జ్యోతి న్యూస్ –** అనంతపురం జిల్లాలో పత్రికా విలేఖరిపై జరిగిన వేధింపుల ఘటనను సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాలో 'మనం' పత్రిక విలేఖరి లక్ష్మీనారాయణపై గీతం కాలేజీ కరస్పాండెంట్ మనీషా నాయర్ వ్యవహరించిన తీరు అమానుషమని మండిపడ్డారు. కాలేజీకి వ్యతిరేక వార్తలు రాశారనే నెపంతో, మనీషా నాయర్ తన అనుచరులతో కలిసి విలేఖరి ఇంటికి వెళ్లి, అతన్ని బెదిరించి బలవంతంగా తన కాళ్లపై వేయించుకోవడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్రంలో వాస్తవాలు వెలికితీసే వారిపై దాడులు పెరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలే చిత్తూరు జిల్లాలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యకు గురయ్యారని గుర్తు చేశారు. రాజకీయ నాయకులైనా, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లైనా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులైనా.. అన్యాయాన్ని ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కేయడం రాజ్యాంగ విరుద్ధమని, మనీషా నాయర్‌పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు. సంబంధిత అధికార యంత్రాంగం ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన మనీషా నాయర్ మరియు ఆమె అనుచరులపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ డి పి ఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద "స్టాప్ వాష్ అండ్ గో" ప్రత్యేక తనిఖీలు

**--డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కాకినాడ పోలీసులు కఠిన చర్యలు**

**--రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం**

**-- ట్రాఫిక్ వన్ సిఐ ఎన్ రమేష్**




**కాకినాడ జిల్లా మే 04( ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు రహదారి ప్రమాదాల నివారణ కోసం కాకినాడ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఆదివారం రాత్రి కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ యన్. రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది "స్టాప్ వాష్ అండ్ గో" (ఫేస్ వాష్) కార్యక్రమంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. దీర్ఘదూర ప్రయాణాలు చేసే వాహనదారులు అలసట, నిద్ర మత్తులో వాహనాలు నడపకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. వాహనదారులకు తక్షణ విశ్రాంతి, ఫేస్ వాష్ సౌకర్యం కల్పించి అప్రమత్తత కల్పించారు. ఈ సందర్భంగా రహదారి భద్రతపై పోలీసులు అవగాహన కల్పించారు, నిద్ర మత్తులో డ్రైవింగ్ చేయరాదని, డ్రైవింగ్‌కు ముందు తగిన విశ్రాంతి అవసరమని సూచించారు. అలాగే అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ ప్రమాదాలకు కారణమవుతాయని హెచ్చరించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని స్పష్టం చేశారు. చిన్న దూరమైనా ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందేనని సూచించారు. "ట్రాఫిక్ రూల్స్ పాటించండి.. సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోండి" అని పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించారు.

## తమిళనాడు రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించిన విజయ్

**టీవీకే అధినేత విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపిన వైసీపీ జిల్లా యువజన కార్యదర్శి శివ.**



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** తమిళనాడు రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించిన తమిళ వెట్రి కళగం (టీవీకే) అధినేత, సినీ నటుడు విజయ్ కు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన కార్యదర్శి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "తమిళనాడు చరిత్రలో తొలిసారి ఒక రాజకీయ పార్టీని స్థాపించి, ఏ పార్టీతోనూ పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేసి విజయ్ అద్భుతమైన చరిత్ర సృష్టించారని .ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగనన్న మాదిరిగానే, విజయ్ కూడా ధైర్యంగా ఒంటరిగా బరిలోకి దిగి ప్రజల మనసు గెలుచుకున్నారని సొంత అతి తక్కువ కాలంలోనే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించి సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారన్నారని . ఆఖరికి విజయ్ కారు డ్రైవర్ కొడుకు ఎమ్మెల్యేగా పోటీ చేసి సింగిల్ గా గెలిచారని ఆయన పేరుకున్నారు. తమను నమ్మి ఓట్లు వేసిన ప్రజల ఆశయాలకు అనుగుణంగా, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి, తమిళనాడును ప్రగతి పథంలో నడిపించాలని కోరుకుంటున్నామని జిల్లా యువజన కార్యదర్శి శివ పేర్కొన్నారు.

## పెన్షన్ అయినా ఇవ్వండి

**--విషమైనా ఇవ్వండి రిటైర్డ్ కార్మికుల ఆవేదన**



**కాకినాడ జిల్లా పిఠాపురం నియోజవర్గం (ప్రజా జ్యోతి)** పెన్షన్ అయినా ఇవ్వండి విషమైన ఇచ్చి రిటైర్డ్ కార్మికులయినా కడతేర్చాలని అఖిల భారత కార్మిక సంఘాల ఉభయ గోధావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి కుంచే అంజిబాబు ఆగ్రహం వ్యక్తం చేసారు. సోమవారం సమస్యలు తో కూడిన వినతిపత్రం పాడా పిడికి అందజెసారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ రిటైర్మెంట్ తీసుకొని 8 సంవత్సారలు కావస్తున్న అధికారులు నుండి ఏ విధమైన సమాచారం కానీ, పెన్సన్ సదుపాయం కల్పించ కుండా అప్పులు పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అధికారులు తీరు ఏ మాత్రం భావ్యంగా లేదని, రిటైర్మెంట్ అయితే వారికి ఈ బాదలు మా బాదలు అర్థం అవుతాయని తెలిపారు. తినడానికి అహరం లేక కార్మికులు అడక్కుని బ్రతుకు తున్నారని, కార్మికుల ఆకలి కేకలు ఆడిట్ అధికారులకు వినిపించడం లేదా అని తూర్పారబట్టారు. ఇప్పటికే రిటైర్మెంట్ అయినా నలుగురు కార్మికులు లో పెన్షన్ ఇవ్వకుండా అధికారులు ఇద్దరు కార్మికులను కాటికి పంపించారని మరో ఇద్దరు అనేక రోగాలు తో, బ్రతుకు భారంతో బ్రతుకు తన్నారని అంజిబాబు ఆవేదన వ్యక్తం చేసారు. పాడా పిడి అయినా మా యందు దయచూపాలని, ఈ లోగా కొంతమంది గొల్లప్రోలు మున్సిపల్ అధికారులు మేము కొర్రిలు పెడుతున్నామని, ఎలా అవుతుందో చూస్తామని బెదిరింపులకు దిగడం మంచిది కాదని, లేని ఇబ్బందులకు గురి చస్తే సహించేది లేదని, తప్పుడు గా మాట్లాడ వద్దని కోరారు. అలాగే ఉప ముఖ్య మంత్రి పవన్ జోక్యం చేసుకొని కార్మికులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమం లో అఖిల భారత కార్మిక సంఘాల ఉబయ గోధావరి జిల్లాల ఉపాధ్యక్షులు నారాయణ మూర్తి, గొర్ల శివ, కార్మికులు పొట్నూరి నాగేశ్వరావు, సామ్యేలు, శారమ్మ, లక్ష్మి పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడు రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించిన విజయ్

**టీవీకే అధినేత విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపిన వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కె.గిరి**



**హోళగుంద, మే 4, ప్రజా జ్యోతి న్యూస్–** తమిళనాడు రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించిన తమిళ వెట్రి కళగం (టీవీకే) అధినేత, సినీ నటుడు విజయ్ కు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కె. గిరి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "తమిళనాడు చరిత్రలో తొలిసారి ఒక రాజకీయ పార్టీని స్థాపించి, ఏ పార్టీతోనూ పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేసి విజయ్ అద్భుతమైన చరిత్ర సృష్టించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగనన్న మాదిరిగానే, విజయ్ కూడా ధైర్యంగా ఒంటరిగా బరిలోకి దిగి ప్రజల మనసు గెలుచుకున్నారు. అతి తక్కువ కాలంలోనే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించి సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారన్నారు. తమను నమ్మి ఓట్లు వేసిన ప్రజల ఆశయాలకు అనుగుణంగా, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి, తమిళనాడును ప్రగతి పథంలో నడిపించాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు.

## గ్రీవెన్స్ కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రం అందజేసిన టి.డి.పి నాయకుడు రంజిత్.



**అనంతగిరి మండలం. మే 4. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం నాడు గ్రీవెన్స్ అధికారి వీరభద్ర చారి అధ్యక్షతన గ్రీవెన్స్ కార్యక్రమంనిర్వహించడం జరిగింది. కార్యక్రమంలోఅనంతగిరి పంచాయతీ పరిధి గిరిజన గ్రామాలలో వివిధ సమస్యల నెలకొని ఉన్నాయని ముఖ్యంగా ఉపాధి హామీ పనులు నేటికీ అనంతగిరిలో ప్రారంభం కాలేదని వీ.ఆర్పీ వల్ల సమస్య ఏర్పడుతుందని వినతి పత్రంలో కోరారు. అధికారి స్పందించి తక్షణమే సమస్య పరిష్కారం చేయాలని మండలఉపాధి హామీ అధికారికి ఆదేశాలు జారీ చేయడంతో రేగం గ్రామానికి చెందిన స్థానిక యువకుడు కు కొన్ని బాధితులు అప్పగించి పనులు ప్రారంభించిచర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు గ్రామాలకు మధ్యలో ఉన్నాయని తొలగించే కార్యక్రమం చేయాలని టి.డి.పి నాయకుడు రంజిత్ కోరడంతో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాయకుడు వెంట తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు భీమన్న. అనంతగిరి మాజీ వైస్ సర్పంచ్ అర్జున్. స్థానిక యువకులు ధర్మ. బి.జె.పి ఉపాధ్యక్షుడు సింహాద్రి. తదితరులు ఉన్నారు.

## మూడు రాష్ట్రాల్లో బి జె పి చారిత్రాత్మక విజయం

**సంబరాలు చేసుకున్న బిజెపి నాయకులు కార్యకర్తలు**



సోమవారం విడుదలైన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మూడు రాష్ట్రాల్లో ఘనవిజయం సాధించి, అధికారాన్ని కైవసం చేసుకున్న చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం హోళగుంద మండల బస్టాండ్ ఆవరణలో బీజేపీ కార్యకర్తలు మరియు నాయకులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. మోదీ నాయకత్వం, బిజెపి అభివృద్ధి సిద్ధాంతాలతోనే ఇంతటి ఘనవిజయం సాధించిందని. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని కాకినాడ కలెక్టర్. ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్దివ్యంగుల వినతి పత్రం దివ్యాంగులు అందజేశారు.



**కాకినాడ జిల్లా (ప్రజా జ్యోతి)** కాకినాడ పిజిఆర్ఎస్ దివ్యాంగుల ఎన్టీఆర్ భరోసా పథకం దివ్యాంగులకు ఇచ్చే 15000 రూపాయలు టెన్షన్ అర్హులని జిల్లా మెడికల్ బోర్డు వారు గ్రామ పిహెచ్.సీ వారు మరియు జిల్లా డిఎంహెచ్వో అధికారి వారు అందరూ కలిసి అర్హులని పత్రాలు ప్రభుత్వం ఆదేశాలు ప్రకారం ఇచ్చినారు. కానీ ఏపీ గవర్నమెంట్ ఏర్పడి సుమారు రెండు సంవత్సరాలు అయినప్పటికీ 15000 పెన్షన్ మంజూరు కాలేదని కాకినాడ కలెక్టర్ వారిని కలిసి దివ్యాంగులు వినత పత్రం సమర్పించినారు అంతేకాకుండా దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏపీ ప్రభుత్వం వారు ఆదేశాల ప్రకారం దివ్యాంగుల కోసం నెలకు ఒకసారి అందుల కోసం ప్రత్యేకంగా దివ్యాంగుల గ్రీవెన్స్ నిర్వహించాలని కలెక్టర్ వారిని కోరగా పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్మించిన విషయాన్ని ఆంధ్రప్రభ పత్రికలో వచ్చిన విషయాన్ని కాకినాడ లో దివ్యంగుల కు ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయమని కోరడం జరిగింది. చట్టాలను ఆదేశాలతో చెయ్యమని లేదా రద్దు చేయమని కోరడం జరిగింది అంతేకాకుండా దివ్యాంగులకు చట్టాలు ఆదేశాలు ఇచ్చి నరక కుపంలో జీవిస్తూ. దివ్యాంగులకు అమృతం పోసినట్లు చట్టాలు ఆదేశాలు ఇచ్చి అమలు చేయకుండా విషాన్ని చిమ్మడాన్ని దివ్యాంగులు ఖండించారు .ఈ కార్యక్రమంలో యువ స్పందన వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు బీవీవీ సత్యనారాయణ కర్రీ అర్జున్, భూలోకాలు జీవన్, ఉలవకాయల దేవానందం, వివిధ వికలాంగుల సంఘ నాయకులు పాల్గొన్నారు

## కౌలు రైతులు సి సి ఆర్ సి కార్డులతో సాగు ప్రయోజనాలు పొందాలి

**మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోకదళ్ కౌలు రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, కార్డుల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన**



**హోళగుంద, మే 04, ప్రజా జ్యోతి న్యూస్ –** మండల కేంద్రంలోని హోళగుంద–4 రైతు సేవా కేంద్రం పరిధిలో సోమవారం మండల వ్యవసాయ అధికారి శ్రీ ఆనంద్ లోకదళ్ అధ్యక్షతన కౌలు రైతు గుర్తింపు కార్డులపై గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోక్ దళ్ మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, కార్డుల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌లో పొలాన్ని కౌలుకు తీసుకునే రైతులు తప్పనిసరిగా కార్డులను పొందాలన్నారు. ఈ కార్డు ఉన్నవారికి ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలు, ఎరువులు, పంట భీమా, పంట నష్టపరిహారం మరియు గిట్టుబాటు ధర వంటి ప్రయోజనాలు అందుతాయన్నారు. భూమి లేని ఎస్సీ ఎస్టీ మరియు మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులు కౌలు రైతు కార్డు పొందితే, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ' పథకానికి అర్హత సాధిస్తారన్నారు. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాల వల్ల లేదా అకాల వర్షాల వల్ల పంట నష్టం వాటిల్లితే, ఆ నష్టపరిహారం నేరుగా సాగు చేసిన కౌలు రైతుకే చెందేలా ఈ కార్డులు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్డుల కాల పరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందన్నారు. గడువు ముగిసిన తర్వాత తిరిగి పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. కార్డు పొందాలనుకునే రైతులు భూ యజమాని ఒప్పంద పత్రం, పొలం సర్వే నంబర్ మరియు ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబర్‌తో తమ పరిధిలోని రైతు సేవా కేంద్రం లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని అధికారులు సూచించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విరూపాక్షి,రైతు సేవ కేంద్రం సిబ్బంది శివకృష్ణ, రాజు నాయక్, రమేష్ మరియు గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

## చేపల దుకాణాన్ని తొలగించాలని కమిషనర్ కు వినతి



**గుంతకల్లు మే 4 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని కసాపురం రోడ్డులోని మారుతీ నగర్ లో ఉన్న చేపల దుకాణాన్ని వెంటనే తొలగిం చాలని మారుతి నగర్ వాసులు సోమ వారం స్థానిక మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కాలనీ వాసులు మాట్లాడుతూ కసాపురం రోడ్డులోని మారుతి నగర్ కాలనీలో చేపల దుకాణం ఏర్పాటు చేయడం జరిగింది. చేపల దుకాణం నుండి వ్యర్థ పదార్థాలు, నీళ్లను ఇళ్ల ముందు ఉన్న డ్రైనేజీలో చేపల దుకాణ దారులు వదులుతున్నారు. ఈ దుర్వాసన వల్ల ఇళ్ల ముందు కూర్చోలేక పోతున్నా మని విష జ్వరాలతో ఆరోగ్యం చెడిపోతాయని కాలనీవాసు లు వాపోయారు. ఈ విషయం 10 రోజుల కిందట సచివాల యం అధికారులకు అర్జీ ఇచ్చినాము కానీ వారు నోటీసులు ఇస్తామని చెబుతు న్నారే కానీ దుకాణం పై ఎటువంటి చర్య తీసుకోలేదని పేర్కొన్నారు. మీరైనా మా ఇళ్ళ ముందు డ్రైనేజీలోకి చెడు వ్యక్తపదార్థాలు వదల కుండా ఈ దుకాణంపై చర్య లు తీసుకోవాలని కమిషనర్ను కోరారు. ఈ కార్యక్రమంలో మారుతి నగర్ కాలనీవాసులు మోపురి.రాజశేఖర్, ఎం డి ఆర్ ఖలీల్, టి. ఉమాదేవి, ఆదిలక్ష్మి, జ్యోతి, రంగవేణి, భీమలింగప్ప, ముత్తులక్ష్మి, రక్షిత, గాయత్రి, జగన్, లక్ష్మన్న, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ.

## రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరుపై గ్రీవెన్స్ సెల్ లో ఫిర్యాదు




**దువ్వూరు,మే 04 ( ప్రజా జ్యోతి )** మండల కేంద్రంలో దువ్వూరు లో పోలీస్ స్టేషన్ దగ్గర మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తున్న కారణంగా అనేక మంది వాహనదారులు అక్కడ స్థానికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్న నేపథ్యములో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆరవేటి హరికృష్ణ, స్థానికులు ఆధ్వర్యంలో దువ్వూరు తహసీల్దార్ కార్యలయంలో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ లో ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చమండల అధ్యక్షులు బాలనాగిరెడ్డి మరియు అక్కడ స్థానికులు పాల్గొన్నారు.

## విలేకరులపై దాడులను ఖండిస్తున్న పామిడి వర్కింగ్ జర్నలిస్టులు

దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలి



**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** అనంతపురం టౌన్ నందు ఉన్న శ్రీ గీతం జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ అయినటువంటి మనిషా నాయర్ అనంతపురం టౌన్ మనం ఛానల్ రిపోర్టర్ అయినటువంటి లక్ష్మీనారాయణను మనిషా నాయర్ మనం ఛానల్ రిపోర్టర్ ఒక దళితుడు అని తెలుసుకొని కొందరు రౌడీల సహాయంతో లక్ష్మీనారాయణ ఇంటిపై దాడి చేసి తనను భయభ్రాంతులకు గురిచేసి భయపెట్టి మనం ఛానల్ రిపోర్టర్ అని తెలిసి కూడా తన కాళ్లు పట్టించుకోని మొక్కించుకొని మీడియా వ్యవస్థని కించపరిచేలా వ్యవహరించింది. అనంతపురం శ్రీ గీతం జూనియర్ కాలేజ్ నందు లోపాలను మనం ఛానల్ గుర్తించి ఎత్తిచూపడం మనం ఛానల్ నందు ప్రచురించడం సహించలేని కరెస్పాండెంట్ మనిషా నాయర్ జూనియర్ కాలేజ్ నందు మనం ఛానల్ ఎత్తి చూపిన లోపాలను సరిదిద్దుకోవడం మానివేసి ఒక దళిత రిపోర్టర్ అని తెలిసి కూడా తన ఇంటి మీదకు రౌడీల సహకారంతో వెళ్లి దాడి చేసి మీడియాను కించపరిచేలా తనతో కాళ్లు పట్టించుకోని మొక్కించుకోవడం అమానుషం సమాజంలో ఒక బాధ్యత గల మనం ఛానల్ రిపోర్టర్ అని తెలిసి కూడా ఇలా వ్యవహరించడం గీతం జూనియర్ కాలేజ్ కరెస్పాండెంట్ మనిషా నాయర్ కు మీడియా వ్యవస్థ మీద ఉన్న సదాభిప్రాయశీ ఏమిటో తెలుస్తుంది తోటి మనం ఛానల్ రిపోర్టర్ మీద జరిగిన అనుచిత సంఘటనలను నిరసిస్తూ పామిడి మండలానికి చెందిన అన్ని చానల్స్ విలేకరులందరూ పామిడి మండల తహసిల్దార్ షర్మిల కి మరియు పామిడి మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐ అయినటువంటి నాగేంద్ర సార్ కి కలసి పామిడి మండలానికి చెందిన అన్ని పత్రిక ఎలక్ట్రానిక్ మీడియా ఛానల్స్ విలేకరులు అనంతపురం కి చెందిన శ్రీ గీతం జూనియర్ కాలేజ్ కరెస్పాండెంట్ అయినటువంటి మనీషా నాయర్ మీద చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించడం జరిగింది.

## 10 పరీక్షల్లో (578) మార్కులు సాధించిన విద్యార్థిని గాజుల సాయి దివ్య, కు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చేతుల మీదుగా ఘనంగా సన్మానం



**కంబదూరు మే 4 (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల కేంద్రానికి చెందిన గాజుల రాజు, గాజుల చంద్రకళ, కుమార్తె గాజుల సాయి దివ్య, అనే విద్యార్థిని ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో (578) మార్కులు సాధించి తన ప్రతిభను కనబరిచి కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టాపర్ గా నిలిచింది. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రజా వేదిక నందు సోమవారం జరిగిన కార్యక్రమంలో కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, చేతుల మీదుగా ఘనంగా సన్మానం నిర్వహించారు. ఆమె సాధించిన విజయాన్ని ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు, గాజుల సాయి దివ్య, ముందు ముందు మరెన్నో విజయాలు సాధించి ఆ పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు..

## ప్రజల సమస్యలు తీర్చేందుకే ప్రజాదర్బార్.

తేది. 04/05/2026.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-** యం. నరేష్.పాతపట్నం శాసనసభ్యులు వారి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే ఎంజీఆర్ పాతపట్నం నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా సమస్యలు తెలుసుకొని, వాటిని తక్షణమే పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆదేశించిన స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు .ఈ ప్రజా ధర్బార్ కు, 35 వినతి పత్రాలు స్వీకరించారు .రెవెన్యూ, రహదారులు,విద్యుత్, తాగునీరు వంటి ప్రధాన సమస్యలతో పాటు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇల్లు స్థలాలు, గృహ నిర్మాణాలు,వృద్ధులు--వికలాంగులు--వితంతువుల వ్యక్తిగత వినతులు స్వీకరించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రతి అర్జీపై స్పష్టమైన చర్యలు తీసుకుని,15 రోజుల్లో పరిష్కార వివరాలు ప్రజలకు తెలియజేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

## కొలిశెట్టి పవన్ కుమార్ ఆధ్వర్యంలో బిజెపి విజయోత్సవ సంబరాలు



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ మే 4 (ప్రజా జ్యోతి)** పశ్చిమబెంగాల్,అస్సాం,పుదుచ్చేరి లలో బీజేపీ విజయం సాధించిన సందర్భంగా బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటివ్ కొలిశెట్టి పవన్ కుమార్ బద్వేల్ పట్టణ అధ్యక్షులు ధర్మిశెట్టి వెంకట సుబ్బయ్య రాయల్ ఆధ్వర్యంలో బద్వేల్ పట్టణం నాలుగు రోడ్ల కూడలిలో బాణసంచా కాల్చి స్వీట్స్ పంపిణీ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ పరిపాలన దక్షతకు ఈ ఫలితాలు నిదర్శనం అన్నారు. అస్సాం లో హాట్రిక్ విజయం నమోదు చేశామని, పశ్చిమ బెంగాల్ లో మమత బెనర్జీ పాలనకు చరమ గీతం పాడి బీజేపీ పాలన ప్రారంభం అయిందన్నారు. ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా సెక్రటరీ కె.వి రమణయ్య కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎన్ వి సుబ్బారెడ్డి రూరల్ అధ్యక్షులు సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి నాయకులు కుప్పాల నరసింహులు ఆర్ఎస్ఎస్ రామకోటి రాజు అశోక్ కుమార్ రెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ లో వేసుకొను ఉల్లి పంట పై అవగాహన - మైదుకూరు ఉద్యాన అధికారి రామకృష్ణ



దువ్వూరు,మే 04(ప్రజాజ్యోతి) మండల పరిధిలోని చిన్న సింగంపల్లె, మదిరేపల్లె, టి.చల్లబసాయపల్లె గ్రామాల్లో 2026 ఖరీఫ్ లో పెద్ద బళ్ళారి ఉల్లి సాగును తగ్గించుకోవలసినదిగా ఖరీఫ్ లో వేసుకొను ఉల్లి పంట పై మైదుకూరు ఉద్యాన అధికారి రామకృష్ణ సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఒకే పంట కాకుండా పసుపు, అరటి, కూరగాయలు, పూల మొక్కలు కూడా సాగు చేసుకోవాలని సూచించడమైనది. ఉల్లి పంట లో ఎత్తు మడుల పద్ధతి గురించి మరియు బిందు సేద్యం ప్రాము ఖ్యతను గురించి తెలి యజేయడ మైనది.ఉల్లి వేసుకునే రైతులు బొప్పాయి మరియు కొత్తగా నాటిన పండ్ల తోటల్లో ఉల్లిని అంతర పంటగా సాగు చేసుకోవాలని సూచించారు.కేపీ ఉల్లి పంటను (ఎగుమతి రకం) సంక్రాంతి పండగలోపు కోతకు వచ్చేట్లు వేసుకోవాలని తెలియపరచడమైనది. ఉల్లి పంటలో వేసుకొనే ఎరువులు గురించి మరియు సస్య రక్షణ గురించి వివరించారు ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది సూర్య నరసింహులు, సుప్రియ, రైతులు పాల్గొన్నారు.

## శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఒటెందు బండి బలప్రదర్శన




**కోవెలకుంట్ల:మే = 04 ప్రజాజ్యోతి** కోవెలకుంట్ల శ్రీ పాండురం విఠలేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా గౌరవ శ్రీ బీసీ జనార్దన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మం త్రివర్యులు మరియు గౌరవ శ్రీ బీసీ రామ్నాథ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఒంటెద్దు బండి బల ప్రదర్శన పోటీలు శ్రీ పాండురంగ స్వామి ఉత్సవ కమిటీ వారు నిర్వహించినారు, ఈ పోటీల్లో

మొదటి బహుమతిగా పిట్టల పెద్ద అంకన్న పుల్లారెడ్డిపేట గారి ఎద్దు పది నిమిషాల్లో 3518.6 అడుగుల దూరాన్ని లాగి 20,000/- రూపాయలను పొందినారు దాత:- శ్రీ పాండురంగ స్వామి కమిటీ కోయలకుంట్ల రెండవ బహుమతి వీ చెన్నకేశవ ప్రొద్దుటూరు గారి ఎద్దు పది నిమిషాల్లో3614.6 అడుగులు లాగి 15,000/- రూపాయలను పొందినారు దాత :-రా. హాజీపిరా రావీ ఆటోమోటివ్స్ ట్రాక్ స్టార్ ట్రాక్టర్స్ కోయిలకుంట్ల మూడో బహుమతిగా పోసిన నరసింహారెడ్డి మైదుకూరు గారి ఎద్దు పదినిమిషాల్లో 3553.2 అడుగుల దూరాన్ని లాగి 10,000/- రూపాయలను పొందినారు దాత:- సిరివెళ్ల సురేంద్రనాథ్ రెడ్డి కలుగొట్ల వారి జ్ఞాపకార్థం సిరివెళ్ల వెంకటేశ్వర రెడ్డి నాలుగో బహుమతి మల్ల వేముల సుబ్బారాయుడు మల్లెవేముల గారి ఎద్దు పది నిమిషాల్లో 3507 అడుగుల దూరాన్ని లాగి 8,000/- రూపాయలను పొందినారు దాత:- జై జవాన్ జై కిసాన్( వాటర్ ట్యాంకర్స్డ సెంట్రింగ్ సామాన్లు) ఐదో బహుమతిగా సుధాకర్ పెద్ద కందుకూరు వారి ఎద్దు పది నిమిషాల్లో 3401 అడుగుల దూరాన్ని లాగి 5,000/- రూపాయలను గెలుపొందినారు దాత:- వెంకటరమణ ( శశి మొబైల్స్ కోవెలకుంట్ల), ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గుద్దేటి చిన్న వెంకటసుబ్బారెడ్డి( గుండయ్య), కరిమద్దుల మురళీకృష్ణ, పెనుగొండ రాజశేఖర్, కరిమద్దుల లక్ష్మీ నాగేంద్రబాబు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గౌరా చెన్న కృష్ణుడు ( కిట్టు), సింగారెడ్డి మోహన్ రెడ్డి, కొమ్ము సుబ్బారావు ( రాజు), వేణుగోపాల్ నాయుడు, శ్రీనివాసులు, రొక్కం యేసయ్య, పూజారి బాలరాజు, మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## మూడు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ చరిత్ర సృష్టించడం ఒక శుభపరిణామం : బీజేపీ మండల అధ్యక్షులు



**వేలేరుపాడు :04 మే వేలేరుపాడు :ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ )** ఈరోజు వచ్చిన 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలలో ఒరిస్సా, పుదుచ్చేరి,పశ్చిమ బెంగాల్ లలో బీజేపీ విజయ దుందుభి మోగించి సరికొత్త చరిత్రని సృష్టించిందన్నారు, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ముందుగా టపాసులు కాల్చి కేక్ కట్ చేసి బీజేపీ కార్యకర్తలకు, కూటమి నాయకులకు మిఠాయిలు పంచారు, ఈ సందర్భంగా వేలేరుపాడు భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఓలేటి నాగ దుర్గ అనిల్ (బాలకృష్ణ ) మాట్లాడుతూ రెండు రాష్ట్రాలలో విజయం సాధించడం తో పాటు కేంద్రపాలిత ప్రాంతంలో కూడా బీజేపీ జశీడా పాతిందని, మోదీ, అమిత్ షా నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి సాదించిందని దానిని చూసే ప్రజలు భ్రహ్మరథం పడుతున్నారన్నారు, మరీ ముఖ్యంగా బెంగాల్ లో సామాన్య ప్రజల మీద టీ ఎమ్ సి రౌడీల గుండాగిరి, బశీగ్లాదేశ్ నుండి వలస వచ్చిన వారు బెంగాల్ ప్రజల ప్రాణ, మానాలను దోచుకుంటుంటే కాపాడాల్సిన దీదీ సర్కార్ అరికట్టాల్సింది పోయి వారికే వత్తాసు పలికి స్థితికి దిగజారీ పోయారన్నారు, విటన్నింటి మీద విసిగి పోయిన బెంగాల్ ప్రజలు బీజేపీ పార్టీ కి 200 సీట్లకు పైగా గెలిపించి, పశ్చిమ బెంగాల్ కు పట్టిన ధీ ధీ అనే దరిద్రాన్ని పారతోలారన్నారు, ఈ యొక్క కార్యక్రమంలో జనసేన ప్రధాన కార్యదర్శి మేచినేని సంజయ్, టీడీపి నాయకులు చాపర్ల, శ్రీనివాస్, ఎండీ, సలీం,కృష్ణారెడ్డి, జనసేన నాయకులు బద్దుల, శివరామ్ ప్రసాద్, చంటి, భాను, సవలం వంశీ, బీజేపీ నాయకులు సుభ్రమణ్యం, జ్యోతి, రత్నాజీ, విమలరాణి, వెంకటేశ్వర్లు, లక్ష్మి రాణి,లక్ష్మి, పావని, రాము, నాగేంద్ర, రాముతదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం లక్ష్యం



**బాపట్ల మే 04 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** అర్జీలు పునరావృతం కాకుండా చట్టపరంగా శాశ్వత పరిష్కారం చూపాలని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు.జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అర్జీదారుల సమస్యలను స్వయంగా విని, తక్షణ చర్యలకు అధికారులను దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించగా, వాటిని ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలపై సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి, చట్టపరిధిలో విచారణ జరిపి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. కుటుంబ కలహాలు, భర్త-అత్తింటి వేధింపులు, స్థల వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 36 మంది అర్జీదారులు ఫిర్యాదులు అందజేశారు. పోలీస్ స్టేషన్లు, కార్యాలయాలకు వచ్చే ఫిర్యాదీదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, సమస్యలు తిరిగి పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ స్పష్టం చేశారు. పోలీస్ శాఖ పరిధిలోకి రాని అంశాల విషయంలో సంబంధిత విభాగాలను సూచిస్తూ అర్జీదారులకు సరైన మార్గనిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డిఎస్పీ పి. జగదీష్ నాయక్, పి.జి.ఆర్.ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు, ఎస్ఐ లక్ష్మి రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ కాంట్రాక్ట్ కార్మికులందరికీ రెగ్యులర్ చేయాలి - యూఈఈయు రాష్ట్ర అధ్యక్షులు నాయబ్ రసూల్



**దువ్వూరు,మే 04 ( ప్రజా జ్యోతి )** విద్యుత్ శాఖలో నూతన పి ఆర్ సి అమలు చేయాలని అలాగే పెండింగ్లో ఉన్నటువంటి డిఏ లను వెంటనే విడుదల చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి .నాయబ్ రసూల్ కడప జిల్లా అధ్యక్షులు బి.ఎన్ నాగసుబ్బయ్య మరియు డిస్కం ఉపాధ్యక్షులు శీలం సుబ్బరాయుడు దువ్వూరు సెక్షన్ ఆఫీస్ పరిధిలో సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నాయబ్ రసూల్ మాట్లాడుతూ 2026పిఆర్సి వెంటనే అమలు చేయాలని అలాగే పెండింగ్లో ఉన్నటువంటి 3 డి ఏ లను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేష్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని చెప్పి రెండు సంవత్సరాలు పూర్తయి నది ఇప్పుడైనా కాంట్రాక్ట్ కార్మికులందరికీ రెగ్యులర్ చేయాలని ఆయన తెలిపారు. విద్యుత్ శాఖలో ఉన్నటువంటి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఆయన తెలిపారు. డిస్కం ఉపాధ్యక్షులు శీలం సుబ్బరాయుడు మాట్లాడుతూ తెలంగాణలో కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసి 46 వేల రూపాయలు పైబడి జీతం ఇస్తుంటే మన రాష్ట్రంలో కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆయన ఆవేదన తెలియజేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్న అమలు చేయడం లేదని ఆయన తెలియజేశారు. అలాగే జిల్లా అధ్యక్షుడు బి ఎన్ నాగ సుబ్బయ్య మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తెలియజేశారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ లకు ,పోల్ టు పోల్ వర్కర్లకు టీ ఏ బిల్లు సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సబ్ స్టేషన్లలో యార్డు లైటింగ్ సౌకర్యం కల్పించాలని ఆయన అన్నారు. మైదుకూరు డివిజన్ అధ్యక్షులు బండి రామ్మోహన్ మాట్లాడుతూ ఓ అండ్ ఎం సిబ్బందికి భద్రతా పరికరాలు ఇవ్వాలని ఆయన తెలిపారు. సబ్ స్టేషన్లలో నైట్ వాచ్మెన్ సౌకర్యం కల్పించాలని ఆయన తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు అన్లిమిటెడ్ మెడికల్ పాలసీ ఇవ్వాలని తెలిపారు.

# బీజేపీ ఎన్నికల విజయోత్సవసంబరాలు





తేది. 04/05/2026.

**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. పాతపట్నం** ఈ రోజు భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం 7రోడ్ల కూడలి వద్ద వెస్ట్ బెంగాల్, పుదుచ్చేరి, అస్సాం లో బీజేపీ విజయదుందుబి మోగించిన అనంతరం విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. అనంతరం పాత్రికేయ మిత్రులతో శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు , రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జి ,నరసన్నపేట బి ఎల్ ఏ 1ఇంచార్జ్ పోకతోట సింహాచలం మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ సాధించిన విజయానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, ఈ విజయం దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిబింబం. ప్రత్యేకంగా పశ్చిమ బెంగాల్‌లో... ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన మార్పు నేటి రోజుతో ఆరంభమైంది. ప్రజల సంకల్పం గెలిచింది... అభివృద్ధి, పారదర్శక పాలన వైపు బెంగాల్ అడుగులు వేస్తోంది. ఈ విజయం కేవలం రాజకీయ విజయం కాదు ఇది ప్రజాస్వామ్యానికి వచ్చిన మహా విజయదుందుభి! అస్సాం మరియు పుదుచ్చేరిలో కూడా ప్రజలు అభివృద్ధి, స్థిరత్వానికి మద్దతు ఇస్తూ భారతీయ జనతా పార్టీపై విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ విజయాన్ని సాధించిన పార్టీ నాయకత్వానికి, కృషి చేసిన ప్రతి కార్యకర్తకు మరియు ముఖ్యంగా ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు అందరితో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, మిఠాయిలు తినిపించుకుంటూ , బాణసంచా కాల్చుకుని సంబరాలు నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు , రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం ,రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జి ,సెవ్వనా ఉమామహేశ్వరీ , పూర్వ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావుగారు,జిల్లా ప్రధాన కార్యదర్శి చింతు పాపారావు ,నరసన్నపేట నియోజకవర్గ బి ఎల్ ఏ 1 ఇంచార్జ్ పోకతోట సింహాచలం ,విజయనగరం జిల్లా ఓబీసీ మోర్చా ఇంచార్జ్ సురేష్ సింగ్ , మహిళమోర్చ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర , యువమోర్చ జిల్లా అధ్యక్షులు ధన్నాన మదన్ ,జిల్లా పదాధికారులు,మోర్చాల నాయకులు,కార్యకర్తలు మండల అధ్యక్షులు, మండల పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గున్నారు

# కన్నుల పండువగా వెంకటేశ్వర స్వామి కల్యాణం





**- కల్యాణాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన భక్తజనం**

**- వేదమంత్రోర్చనలతో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించిన పురోహితులు**

**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** పొందూరు మండలం మన్నెపేట కొండపై వెలసియున్న శ్రీ అలివేలు మంగమ్మ ,పద్మావతి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. 35 వ జాతర ఉత్సవాలు సందర్భంగా ఈ మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. పురోహితులు గన్నవరపు రాంబాబు ,పొందూరు శ్రీనివాసా ఆచార్యులు , నాగేశ్వర రావు , కూన పులి విశ్వనాథ శాస్త్రి ,చిలుకూరి శ్రీనివాస రావు వేదమంత్రోర్చనల కళ్యాణం కన్నులపండువగా నిర్వహించారు. మన్నే శ్రీనివాసరావు , రత్న ప్రసూనల సౌజన్యంతో ఈ కార్యక్రమంగా ఘనంగా జరిగింది. ముందుగా పందిరి రాత ఉత్సవాన్ని నిర్వహించి కళ్యాణ మహోత్సవాన్ని జరి పించారు. ఈ మహోత్సవం లో భాగంగా ముందుగా స్వామి , అమ్మవారిని కళ్యాణ మండపానికి తీసుకువచ్చారు. అనంతరం స్వామివారిని ,అమ్మవారిని ప్రత్యేక పూలతో అందంగా అలంకరించారు. శు భ ముహూర్త సమయాన మంగళ వాయిద్యాలు , మేళ తాళాల నడుమ వేద మంత్రాలతో అర్చకులు జీలకర్ర బెల్లం కార్యక్రమాన్ని పూర్తి చేశారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కళ్యాణం అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను, తలంబ్రాలను భక్తులకు అందజేశారు. వీటితోపాటు లలిత సహస్రనామ పారాయణ ,కుంకుమ పూజలు నిర్వహించారు.

# జెట్టి వారి మల్లిపెల్లి వేడుకకు హాజరైన టీడీపీ తెలుగు యువత నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి




**చాగలమర్రి , మే04( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** జెట్టి వారి మల్లిపెల్లి వేడుకలు అంగరంగ వైభవంగా టీడీపీ సీనియర్ నాయకులు జెట్టి ప్రసాద్ స్వగృహం నందు ఏర్పాటు చేశారు. దాదాపుగా 300మందికి పైగా మల్లిపెల్లి వేడుకకు హాజరయ్యారు. చైతన్య కుమార్ అలైక్య మల్లిపెల్లి వేడుకకు ఆళ్ళగడ్డ నియోజకవర్గం టీడీపీ తెలుగు యువత నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి హాజరై విందులో పాల్గొన్నారు. ఈ మల్లిపెల్లి వేడుకలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జెట్టి బాలుడు 4వ ఎంపిటిసి ఇంచార్జి జెట్టి నాగరాజు , జెట్టి ప్రసాద్ , జెట్టి సుధాకర్ , జెట్టి సురేష్ జెట్టి సాయి ,జెట్టి కుమార్ జెట్టి కుటుంబసభ్యులు రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్ భాష పార్లమెంట్ బిసి సంఘం స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు టీడీపీ పట్టణ అధ్యక్షుడు అలాంస గారి మౌలాలి ,కొలిమి హుస్సేన్ వల్లి కొలిమి షరీఫ్ సయ్యద్ బషీర్ టీడీపీ నాయకులు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మొక్కజొన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ మే 4 (ప్రజా జ్యోతి)** రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బద్వేలు ఏరియా సహాయ కార్యదర్శి నాగ దాసరి ఇమ్మానుయేలు, జిల్లా సమితి సభ్యులు పడిగ వెంకటరమణ పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ, ఏపీ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలు తక్షణం ఏర్పాటు చేయాలని బద్వేలు తాసిల్దార్ గారికి మెమరాన్ని ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఇమ్మానుయేలు మాట్లాడుతూ .రాష్ట్రవ్యాప్తంగా పంటల మార్పిడి చేపట్టాలని వ్యవసాయ అధికారులు, ప్రభుత్వం పిలుపు ఇవ్వడంతో రైతాంగం ఆ దిశగా మొక్కజొన్న పంటను సాధారణం కంటే రెండింతలు ఎక్కువగా సాగు చేసి ప్రస్తుతం దిగుబడులు వచ్చిన నేపథ్యంలో మొక్కజొన్న పంటకు క్వింటాల్ 2400 ఉంటే దళారులు 1600, 1700 కు మాత్రమే కొనుగోలు చేయడం వల్ల రైతులు దాదాపు 700 నుంచి 800 రూపాయలు నష్టపోవడం జరుగుతుందని ఆరుగాలం కష్టపడిపండించి న పంటకు గిట్టుబాటు ధర లేకపోతే రైతు తీవ్రంగా నష్టపోతాడని తక్షణం ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేపట్టాలని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తున్నది అలాగే జిల్లాలో రబీలో సాగు చేసిన వరి రైతులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు ఆ విధంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు విజయ్ కుమారి, డి హెచ్ పి ఎస్ ప్రసాదు, సుధాకర్, నాయకులు సుధాకర్ ప్రసాదు రైతు సంఘం నాయకులు, ఓబయ్య రమణయ్య అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

## బేటి బచావో లక్ష్యంతో కిశోరి వికాసం ప్రారంభం




**బాపట్ల మే 04 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జిల్లాలో కౌమార దశలోని బాలబాలికల సాధికారతను లక్ష్యంగా చేసుకుని కిశోరి వికాసం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ తెలిపారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కిశోర్ వికాస గోడపత్రాలను సోమవారం ఆయన విడుదల చేశారు. వేసవి సెలవులను వినియోగించుకుని రేపటి నుంచి జూన్ 11వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమాలు చేపడతామని కలెక్టర్ వెల్లడించారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమాల సమన్వయానికి 13 శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కౌమార దశలో విద్య ప్రాముఖ్యతపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు బాలికల్లో చైతన్యం కల్పించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆరోగ్యం, పోషకాహారం, ఋతు పరిశుభ్రత, లైంగిక మరియు పునరుత్పత్తి ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన పెంపొందించనున్నట్లు తెలిపారు. అలాగే పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధం, యువతలో గర్భధారణ నివారణ, మాదకద్రవ్యాల నియంత్రణ, జీవనోపాధి అవకాశాలు, కెరీర్ కౌన్సిలింగ్, సైబర్ భద్రత, ఆన్‌లైన్ రక్షణ, ఆర్థిక నిర్వహణపై శిక్షణలు అందిస్తామని వివరించారు. బేటి బచావో–బేటి పడావో నినాదంతో ప్రతి బాలికకు విద్య అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో బాలల నేస్తం 112, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, మహిళల హెల్ప్‌లైన్ 181 నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ఠ, డీఆర్వో జి. గంగాధర్ గౌడ్, మహిళా సంక్షేమ శాఖ పీడీ రాధా మాధవి, ఐసీపీఎస్ డీసీపీఓ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## లిమాకు న్యాయం చేయండిలి



**మే 4 నెల్లూరు జిల్లా ప్రతినిధి (ప్రజా జ్యోతి):** తాకట్టు పెట్టిన తమ ఇల్లు ఇప్పించే విధముగా అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని, బాధితుడు షేక్.గఫూర్ కోరారు. స్థానిక చిన్న బజార్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని సంవత్సరాల క్రితం స్థానిక చిన్న బజార్ పరిధిలో తాము ఇంటిని కొనుగోలు చేశామని తెలిపారు. తమ అవసర నిమిత్తం ఓ సంస్థలో ఆ ఇంటిని తాకట్టు పెట్టి నగదును అప్పుగా తీసుకున్నట్లు తెలిపారు. క్రమం తప్పకుండా ఆ సంస్థకు నగదు వాయిదాల ద్వారా చెల్లిస్తున్నామని తెలిపారు. కరోనా కష్ట కాలం నుండి నగదును చెల్లించేందుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తినట్లు తెలిపారు. దాంతో తాము తీసుకున్న అప్పుకు సెటిల్మెంట్ ద్వారా నగదు చెల్లించేందుకు ఆ సంస్థతో మాట్లాడినట్లు తెలిపారు. ఆ సంస్థ తమ మాట వినకుండా మరొకరికి తమ ఇల్లు అమ్మేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు విచారణ జరిపి తమ ఇల్లు తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

## ఇల్లయ్యగారి పేటలో ఉపాధి హామీ పనులకు శ్రీకారం



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** పొందూరు మండలం ఇల్లయ్యగారి పేటలో ఉపాధి హామీ పథకం పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు, మండల తెలుగు యువత అధ్యక్షులు కండాపు శ్రీని వాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలోని నిరుద్యోగులకు ఉపాధి లభించడమే కాకుండా ,చెరువుల అభివృద్ధి ద్వారా నీటి వనరులు పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధికి ఉపాధి హామీ పథకం పనులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొంచాడ చిన్నం నాయుడు , ఫీల్డ్ అసిస్టెంట్ రామినాయుడు ,స్తానిక నాయకులు కోటి ,నారాయణ రావు , సిమ్మి నాయుడు , జి భాస్కర్ , సోములు ఉమా తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి పాలనలో ప్రభుత్వ ఆసుపత్రుల దుస్థితికి ఇదే నిదర్శనం

**తేది. 04/05/2026.**

**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్. పాతపట్నం** కనీసం పారాసెటమాల్ బిళ్ళ లేదు.. గాయాలు కట్టే దూది ముక్క లేదు టీడీపీ పాలనలో ప్రభుత్వ ఆసుపత్రుల దుస్థితికి ఇది నిదర్శనం. ప్రజారోగ్యం గాలికి. ప్రచారాలే ప్రాధాన్యమా నాడు చూశాం మార్పు.. నేడు చూస్తున్నాం నిర్వీర్యం!- వైఎస్ జగన్ గారి పాలన - ఒక స్వర్ణయుగం . వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నాడు-నేడు' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల రూపురేఖలు మారి పోయాయని, అయితే ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా గాలికొదిలేసిందని వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత ఐదేళ్లలో జగన్ వేల కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. ఇంగ్లీష్ మీడియం బోధన, డిజిటల్ లైబ్రరీలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలతో పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో నాడు-నేడు ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించి, విలేజ్ క్లినిక్‌ల నుండి బోధనా ఆసుపత్రుల వరకు ఆధునీకరించారు. ప్రజలకు వైద్యం భారమవ్వకూడదని ఆరోగ్యశ్రీని బలోపేతం చేసిన ఘనత జగన్ దే. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే కూటమి ప్రభుత్వం తన అసలు రంగు బయటపెట్టుకుంది. నాడు-నేడు ద్వారా అభివృద్ధి చెందిన పాఠశాలలను, ఆసుపత్రులను కనీసం నిర్వహించలేక నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ వైద్య రంగం పూర్తిగా కుంటుపడింది, సామాన్యుడికి వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఆసుపత్రులకు వెళ్లే రోగులకు కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయి. ?జ్వరం వస్తే ఇచ్చే క్రోసిన్ పారాసెటమాల్ బిళ్ళలు, గాయాలకు కట్టే 'కాటన్' దూది, కనీసం ఒక చిన్న బ్యాండేజ్ వంటి ప్రాథమిక అవసరాలు కూడా ఆసుపత్రుల్లో అందుబాటులో లేకపోవడం శోచనీయం. ఉచిత వైద్యం అందుతుందని ఆశతో వచ్చే నిరుపేదలు, రూపాయి ఖర్చు లేకుండా మందులు దొరుకుతాయని భావిస్తే.. బయట మెడికల్ షాపులకు వెళ్లి కొనుక్కోవాలని సిబ్బంది చీటీలు రాసి ఇస్తున్నారు. ఇది సామాన్యుల నడ్డి విరవడమే. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఆసుపత్రుల్లో మందుల కొరత, సిబ్బంది కొరత వేధిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. పేదలకు మేలు చేసే ప్రభుత్వ విద్యా, వైద్య రంగాలను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేందుకే చంద్రబాబు ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తోందన్నారు. గతంలో మెరుగ్గా ఉన్న వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. ప్రభుత్వ ఆసుపత్రులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించి, కనీసం ప్రాథమిక చికిత్సకు అవసరమైన సామగ్రి లేకపోతే రోగుల ప్రాణాలకు భరోసా ఎక్కడుంది. జగన్ పేదల పక్షపాతిగా నిలబడి విద్య, వైద్యంపై పెట్టిన పెట్టుబడి రేపటి తరానికి ఆస్తి.




కానీ, కూటమి ప్రభుత్వం కేవలం ప్రచారానికే పరిమితమై, క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలను విస్మరిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల పట్ల ఇప్పటికైనా వివక్ష మానుకోవాలి, లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అని ప్రగల్భాలు పలికే కూటమి ప్రభుత్వం, కనీసం ఆసుపత్రుల్లో దూది, బిళ్ళలు కూడా ఉంచలేని పరిస్థితిలో ఉంది.

# శాంతియుతంగా ఉరుసు వేడుకలు జరుపుకోవాలి





రూరల్ సి ఐ భాస్కర్ రెడ్డి
ఎస్ ఐ శ్యామ్ సుందర్ రెడ్డి

**మే 4 ప్రజా జ్యోతి న్యూస్ మైలవరం** మైలవరం మండలంలోని దొడియం గ్రామంలో సీఐ, ఎస్ ఐ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. డి-కేటగిరీ గ్రామంగా గుర్తింపు పొందిన ఈ గ్రామంలో భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్ రెడ్డి, ఎస్ ఐ శ్యామ్ సుందర్ రెడ్డి గ్రామస్థులతో మాట్లాడుతూ, రాబోయే దొడియం గ్రామం లో జరిగే మే 07 వ తేదీ 8 వ తేదీ ఉరుసు పండుగను అన్నదమ్ముల భావంతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పరస్పర సహకారంతో పండుగను విజయవంతం చేయాలని కోరారు. అదనంగా, పండుగ సమయంలో చట్టాలు పాటించాలని, పోలీసులకు సహకరించాలని గ్రామ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, టి డి పి యువనాయకులు మల్లెల రవి యువకులు అలాగే స్థానికులు పాల్గొన్నారు

# తెలంగాణ ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే..

## బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మి నరసింహారావు

మళ్లీ కేసీఆర్ పాలన కోసం ప్రజలంతా ఎదురుచూపులు
క్రీడల పట్ల యువత ఆసక్తి పెంచుకోవాలని సూచన




**వేములవాడ :** అబద్దాల హామీతో అధికారంలోకి వచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని వేములవాడ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. వేములవాడ పట్టణంలోని ఆయన నివాసంలో వేములవాడ రూరల్ చెందిన క్రికెట్ క్రీడాకారులకు సోమవారం క్రికెట్ కిట్ లను అందజేసి మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలుగా మోసం చేస్తుందని అన్నారు. మళ్లీ మరోసారి సీఎంను కేసీఆర్ చేయాలని యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందు ఉండాలని, క్రీడాకారులను ప్రోత్సహించడానికి కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించామని అన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ లో కాంగ్రెస్ కరువు ప్రభుత్వం వచ్చాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నరని, అబద్దపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను మర్చిపోయాని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి కెసిఆర్ ను సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధమవుతు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. కేటీఆర్ ముఖ్యమైన మంత్రి, ఆయన సహకారంతో రానున్న రోజుల్లో వేములవాడ ను అభివృద్ధి చేసుకుందామన్నారు. కేసీఆర్ కప్ తో క్రికెట్ క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తి పెంపొందడమే కాకుండా గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారులు తమ ప్రతిభను చాటారన్నారని కొనియాడారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపేందుకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముందున్నారని గుర్తు చేశారు. క్రికెట్ ఏ కాకుండా భవిష్యత్తులో కబడ్డీ, వాలీబాల్ టోర్న మెంట్ల నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు. టోర్నమెంట్ లో పాల్గొన్న అన్ని జట్లకు కేటీఆర్ ఆదేశాల మేరకు క్రికెట్ కిట్లను అందజేసి వారికి ప్రోత్సాహంగా ఉండడమే కాకుండా భవిష్యత్‌లో ఇలాంటి క్రీడలను ప్రోత్సహించి క్రీడాకారులను వెలికి తీస్తామని తెలిపారు. అనంతరం యువతకు సమాజంలో జరుగుతున్న పలు అంశాలపై అవగాహనా కల్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి చల్మెడ ఎప్పుడు అండగా ఉంటారని, హాస్పిటల్ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నరని కొనియాడారు. వేములవాడ నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలు చల్మెడ వస్తే అభివృద్ధి జరుగుతుందే, కేసీఆర్ వస్తే కరువు లేకుండె అంటున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు చల్మెడ కే పట్టం కడుతారని, పార్టీలకు అతీతంగా ప్రజా సేవ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గోస్కుల రవి, గడ్డం హనుమాన్లు, ఏష తిరుపతి, మల్లేశం, బాల్ రెడ్డి, యవకులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి.. కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి

**కోరుట్ల :** కోరుట్ల డివిజన్ స్థాయిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని కోరుట్ల ఆర్‌డీవో జీవాకర్ రెడ్డి పేర్కొన్నారు. కోరుట్ల పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను డివిజన్ స్థాయి అధికారులు, తహసీల్దార్లతో కలిసి ఆర్డీవో స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ డివిజన్ కేంద్రంతో పాటు డివిజన్ లోని పలు మండలాల నుంచి ప్రజలు సమస్యలు విన్నవించు కోడానికి ప్రజావాణికి వచ్చారని తెలిపారు. అధికారులు శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించాలని, సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని ఆర్డీవో అధికారులకు సూచించారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 9 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీవో వివరించారు. ఇందులో రెవెన్యూ విభాగానికి సంబంధించి 7 దరఖాస్తులు, మున్సిపల్-01, పంచాయతీ రాజ్-01 వినతులు వచ్చాయని తెలిపారు. ప్రతీ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో జైపాల్ రెడ్డి, పంచాయతీరాజ్ సబ్ డివిజన్ డీఈ ఈ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు,




తహసీల్దార్లు, మున్సిపల్ రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుల పరిష్కారానికి ఎస్పీ ప్రాధాన్యం

పి జి ఆర్ ఎస్ లో ప్రజల వినతుల స్వీకరణ
-- త్వరిత చర్యలకు అధికారులకు ఆదేశాలు



**గుంటూరు మే 04 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులు, వినతులను స్వీకరించి ప్రతి అంశాన్ని శ్రద్ధగా పరిశీలించారు. ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఉత్తమమైన పోలీస్ సేవలు అందించడం పోలీస్ శాఖ బాధ్యతగా పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీస్ శాఖకు తెలియజేయాలని, వాటి పరిష్కారానికి పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.వి. రమణమూర్తి, మహిళ పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పీజీఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్ పాల్గొని వచ్చిన వినతులను నమోదు చేసి తదుపరి చర్యల కోసం సంబంధిత విభాగాలకు పంపించారు.

# ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి- తహసీల్దార్ సంజీవ రెడ్డి



**దువ్వూరు,మే 04 ( ప్రజా జ్యోతి )** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని తహసీల్దార్ సంజీవ రెడ్డి తెలిపారు. దువ్వూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్య లను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమణయ్య, పంచాయతీ రాజ్ ఎఈ సుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ మదన్ మోహన్ రెడ్డి,వర్క్ ఇన్స్పెక్టర్ సత్య నారాయణ పాల్గొన్నారు.

# తూర్పుగోదావరి జిల్లా




రాజమండ్రి (ప్రజా జ్యోతి) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్ తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్ అండ్బి గెస్ట్ హౌస్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ రిజర్వేషన్లపై వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమం డెడికేటెడ్ కమిషన్ అధ్యక్షుడు రిటైర్డ్ ఐ ఏ ఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఆధ్వర్యంలో నిర్వహించారు. బీసీలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను స్వీకరిస్తూ ముందుకు సాగుతుండటం శుభపరిణామమని పెంకే జగదీష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తూ వారికి రాజకీయ అవకాశాలను విస్తరించిందన్నారు. ఇదే దిశగా మరింత సమగ్ర అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా పురోగతికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. బీసీ వర్గాల సాధికారతకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరింత బలమైన విధానాలు అమలులోకి రావాల్సిన అవసరం ఉందని సూచించారు. ముఖ్యంగా బీసీ కార్పొరేషన్ల బలోపేతం, ఉపాధి అవకాశాల పెంపు, కోచింగ్ సెంటర్ల ఏర్పాటు, విద్యా సదుపాయాల విస్తరణ, రాజకీయాల్లో బీసీల ప్రాతినిధ్యం పెంపు, బీసీ మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. అదేవిధంగా, బీసీల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు తోడు, రాజకీయ అవగాహన, సంఘటిత శక్తి ,నాయకత్వ వికాసం కూడా అవసరమని పేర్కొన్నారు. బీసీల హక్కులను అమలు చేయడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్లు వమ్మి బాలాజీ , ఆంధ్రప్రదేశ్ రజిక కార్పొరేషన్ డైరెక్టర్ మెంటారావు , రాజమండ్రి సిటీ జనసేన పార్టీ వైస్ ప్రెసిడెంట్ గుత్తుల సత్యనారాయణ , తదితరులు పాల్గొని బీసీలకు సంబంధించిన పలు వినతిపత్రాలను సమర్పించారు.

## బిజినెస్

### రూ. 656 కోట్లను దాటిన 'డీమార్ట్' లాభం




**న్యూఢిల్లీ:** రిటైల్ రంగ దిగ్గజం ఎవెన్యూ సూపర్‌మార్ట్స్(డీమార్ట్) గత ఆర్థిక సంవత్సరం(2025--26) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి--మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 19 శాతం ఎగసి రూ. 656 కోట్లను అధిగమించింది. 2024--25 ఇదే కాలంలో రూ. 551 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఆదాయం సైతం 19 శాతం బలపడి రూ. 17,684 కోట్లకు చేరాయి. అంతక్రితం క్యూ4లో రూ. 14,872 కోట్ల అమ్మకాలు సాధించింది. మొత్తం వ్యయాలు 19 శాతం పెరిగి రూ. 16,798 కోట్లను తాకాయి. నికర లాభ మార్జిన్లు నిలకడను చూపుతూ 3.7 శాతంగా నమోదయ్యాయి. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి డీమార్ట్ స్టోర్ల దిగ్గజం నికర లాభం 10 శాతం వృద్ధితో రూ. 2,970 కోట్లయ్యింది. మొత్తం కన్సాలిడేటెడ్ ఆదాయం 16 శాతం పుంజుకుని రూ. 68,895 కోట్లను తాకింది. క్యూ4లో ప్రారంభించిన 58 కొత్త స్టోర్లతో కలిపి వీటి సంఖ్య 500 మైలురాయికి చేరినట్లు కంపెనీ వెల్లడించింది.

### సరైన ప్రశ్నలు అడగండి.. రాత్రికి రాత్రే యాప్ రెడీ





సాఫ్ట్‌వేర్ అభివృద్ధి అంటేనే ఒకప్పుడు కంప్యూటర్ సైన్స్ ఇంజినీర్లు, వేల గంటల శ్రమ, సంక్లిష్టమైన కోడింగ్‌తో కూడిన సుదీర్ఘ ప్రక్రియ. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోంది. సరైన ప్రశ్న అడగడం తెలిస్తే చాలు సాంకేతిక పరిజ్ఞానం లేకపోయినా అద్భుతాలు సృష్టించవచ్చని తాజాగా జరిగిన ఒక ఉదంతం నిరూపించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాఫ్ట్‌వేర్ తయారీ రంగాన్ని ఎలా మారుస్తుందో చెప్పే ఈ ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది.

**రాత్రికి రాత్రే ఫంక్షనల్ యాప్**

ప్రముఖ వ్యవస్థాపకుడు సందీప్ మాల్ ఎక్స్ (గతంలో ట్విట్టర్) వేదికగా పంచుకున్న ఒక పోస్ట్ టెక్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. అందులోని వివరాల ప్రకారం.. తన కుమారుడు అసలు ప్రోగ్రామింగ్ నేపథ్యమే లేని మార్కెటింగ్ గ్రాడ్యుయేట్ 'క్లాడ్' అనే ఏఐ సాధనాన్ని ఉపయోగించి కేవలం ఒక్క రాత్రిలో పూర్తి స్థాయి వెండర్ మేనేజ్‌మెంట్ యాప్‌ను రూపొందించాడని ఆయన వెల్లడించారు. ఈ యాప్‌లో కెపాసిటీ ట్రాకింగ్, క్వాలిటీ మానిటరింగ్, వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్ వంటి కీలక ఫీచర్లు ఉన్నాయని, ఒక ప్రొఫెషనల్ యాప్‌కు ఉండాల్సిన అన్ని అర్హతలు ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. సాంప్రదాయకంగా సాఫ్ట్‌వేర్ తయారీలో ప్రోగ్రామింగ్ భాషల వాక్యనిర్మాణం (సింట్యాక్స్) తెలుసుకోవడం అత్యంత కీలకం. అయితే, ఈ ఘటన తర్వాత జరుగుతున్న చర్చలో నెటిజన్లు ఆసక్తికరమైన విషయాలను ప్రస్తావిస్తున్నారు. ఏఐ యుగంలో కోడింగ్ నేర్చుకోవడం కంటే, సమస్యను ఎలా ఫ్రేమ్ చేయాలి? ఏ ప్రశ్న అడిగితే సరైన పరిష్కారం వస్తుంది? అనే జడ్జిమెంట్ (నిర్ణయాత్మక సామర్థ్యం)కు ప్రాధాన్యత పెరిగిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఒకప్పుడు ఒక సాఫ్ట్‌వేర్ ప్రాజెక్ట్ మొదలుపెట్టాలంటే టీమ్, భారీ పెట్టుబడి అవసరమయ్యేవి. ఇప్పుడు ఆ ప్రవేశ అడ్డంకులు కనుమరుగవుతున్నాయి.

# టీడీఎస్, టీసీఎస్‌లో మారిన రూల్స్

**ఎన్నారైలు, విద్యార్థులు, పర్యాటకులు మదుపర్లు తెలుసుకోవాల్సింది ఇవే..**




ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) మొదలు (ఈ ఏడాది ఏప్రిల్ 1) ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ (టీడీఎస్), ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్ (టీసీఎస్) నిబంధనల్లో కొత్త మార్పులు వచ్చాయి. పన్ను ప్రక్రియల క్రమబద్ధీకరణ, తప్పులు-లోపాలను సరిదిద్దడమే లక్ష్యంగా ఈ సవరణల్ని చేశారు. టీసీఎస్ రేట్ల తగ్గింపు, ఎన్నారైల కోసం సరళతర ఆస్తి లావాదేవీలు, ట్యాక్స్‌పేయర్స్ పేపర్ వర్క్‌ను కుదించడానికి యూనిఫైడ్ టీడీఎస్ డిక్లరేషన్ ఫారం పరిచయమయ్యాయి. విదేశీ రెమిటెన్స్‌లు, ఆస్తి లావాదేవీలు, పెట్టుబడి ఆదాయం సహా అనేక రకాల ఆర్థిక లావాదేవీలను ఈ సంస్కరణలు ప్రభావితం చేయనున్నాయి. మరి పన్ను చెల్లింపుదారులు, ముఖ్యంగా ఎన్నారైలు, మదుపర్లు, విదేశాల్లో చదువుకొనే భారతీయ విద్యార్థులు, విదేశీ పర్యటనలకు వెళ్లేవారు తెలుసుకోవాల్సిందే ఏమిటో చూద్దాం..

**రెమిటెన్స్‌లు, ప్రయాణ ఖర్చులపై..**

ఏప్రిల్ 1 నుంచి విదేశీ పర్యటన ప్యాకేజీలపై టీసీఎస్ 2 శాతంగానే ఉంటుంది. ఇంతకుముందు రూ.10 లక్షల వరకున్న ప్యాకేజీలపై 5 శాతం, ఆపై 20 శాతంగా పన్ను నిర్మాణం ఉండేది. అలాగే విద్య, వైద్య విదేశీ రెమిటెన్స్‌లపై టీసీఎస్ రేటు 5 శాతం నుంచి 2 శాతానికి దిగింది. మునుపు రూ.10 లక్షలకుపైగా ఉంటే 5 శాతం టీసీఎస్ వర్తించేది. ఈ మార్పుల్ని ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు.

**సులువుగా ఎన్నారైలతో లావాదేవీలు**

ప్రవాస భారతీయుల (ఎన్నారైలు) నుంచి ఆస్తి కొనుగోలు చేసే భారతీయులకూ ఊరట దక్కనున్నది. ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి కొనుగోలుదారులకు ట్యాక్స్ డిడక్షన్ అకౌంట్ నెంబర్ (ట్యాన్)తో అవసరం లేదు. టీడీఎస్‌కు కొనుగోలుదారుల పర్మనెంట్ అకౌంట్ నెంబర్ (పాన్) చాలు. దీంతో ఎన్నారైలకు చెందిన ఆస్తుల కొనుగోలు లావాదేవీలు మరింత సులువుగా, వేగంగా జరుగడానికి మార్గం సుగమం కానున్నది.

**చిన్న మదుపర్ల కోసం..**

రిటైల్ ఇన్వెస్టర్ల కోసం సింగిల్ టీడీఎస్ నాన్-డిడక్షన్ డిక్లరేషన్ ఫారం పరిచయమైంది. దీంతో ఇక పేపర్ వర్క్ బాగా తగ్గడమేగాక, సమయం ఆదా అవుతుందన్న అంచనాలున్నాయి. 15జీ, 15హెచ్ ఫారాల స్థానంలో ఒకే ఒక యూనిఫైడ్ ఫారం 121ను తెచ్చారు. పన్నుసహిత ఆదాయం తక్కువగా ఉన్న వ్యక్తులు, వృద్ధులు.. అనవసరమైన టీడీఎస్ డిడక్షన్ల నుంచి తప్పించుకోవడానికి ఈ 15జీ, 15హెచ్ ఫారాలను వినియోగించేవారు. ఇప్పుడు ఫారం 121తో ఆ రెండింటి పనీ తీరిపోతుంది.

# డిగ్రీ ఉంటే సరిపోదు.. స్కిల్ ఉంటేనే జాబ్



**ముంబై:** నేటి తరం విద్యార్థుల వేతన అంచనాలకు, మార్కెట్లోని వాస్తవ పరిస్థితులకు మధ్య భారీ వ్యత్యాసం నెలకొంది. పట్టభద్రులవుతున్న విద్యార్థుల్లో దాదాపు 73 శాతం మంది రూ.5 లక్షలకు మించి వార్షిక వేతనాన్ని (ఎల్‌పీఏ) ఆశిస్తుండగా.. కేవలం 40 శాతం మంది మాత్రమే ఆ లక్ష్యాన్ని సాధిస్తున్నారని 'అన్‌స్టాప్ టాలెంట్ రిపోర్ట్ 2026' వెల్లడించింది. దేశవ్యాప్తంగా 37 వేలకు పైగా విద్యార్థులు, 500 మందికి పైగా హెచ్‌ఆర్ ప్రతినిధుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. డిగ్రీ 'ప్రీమియం' కనుమరుగు: ఒకప్పుడు పెద్ద కోర్సులు చదివిన వారికి మాత్రమే దక్కే 'అదనపు వేతన ప్రాధాన్యం' క్రమంగా తగ్గుతోంది. ఎంబీఏ పూర్తి చేసిన వారిలో 30 శాతం మంది రూ. 10 లక్షల కంటే తక్కువ వార్షిక వేతనం పొందుతుండగా, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో 39 శాతం మంది రూ. 7 లక్షల లోపు వేతనాలకే పరిమితమవుతున్నారు. దీనిని బట్టి వివిధ కోర్సుల మధ్య ఉన్న 'వేతన అంతరం' తగ్గుముఖం పడుతోందని స్పష్టమవుతోంది. విద్యార్థుల ఆలోచనా ధోరణిలో మార్పు: పెరుగుతున్న పోటీ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు సైతం వాస్తవిక దృక్పథంతో ఆలోచిస్తున్నారు. మెరుగైన అభ్యాస అవకాశాలు, కెరీర్ వృద్ధి ఉంటే 90 శాతం మందికి పైగా విద్యార్థులు తక్కువ జీతానికైనా పనిచేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అలాగే 82 శాతం మంది విద్యార్థులు తక్షణ ఆర్థిక స్థిరత్వం కోసం అదనపు ప్రయోజనాల (పెర్క్స్) కంటే చేతికి వచ్చే జీతానికే (ఇన్--హ్యాండ్ శాలరీ) ప్రాధాన్యత ఇస్తున్నారు. నైపుణ్యమే అసలైన 'గేట్‌కీపర్': ప్రస్తుత పోటీ ప్రపంచంలో నియామక ప్రమాణాలు పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు కేవలం డిగ్రీ సర్టిఫికేట్లు చూసి ఉద్యోగాలిచ్చిన కంపెనీలు, ఇప్పుడు అభ్యర్థుల్లోని నైపుణ్యాలు (స్కిల్స్), కృత్రిమ మేధ (ఏఐ) సామర్థ్యాన్నే ప్రాతిపదికగా తీసుకుంటున్నాయి. సుమారు 64 శాతం మంది హెచ్‌ఆర్ ప్రతినిధులు ఏఐ/ఎంఎల్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి సాంకేతికతలపై పట్టున్న వారినే 'ప్రీమియం టాలెంట్'గా గుర్తిస్తున్నారు. భవిష్యత్తులో ప్రాబ్లమ్ సాల్వింగ్ (49%), ఏఐ పరిజ్ఞానం (39%), ఎమోషనల్ ఇంటెలిజెన్స్ (30%) వంటి సామర్థ్యాలు ఉన్నవారికే అత్యధిక డిమాండ్ ఉంటుందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. ఎంపిక ప్రమాణాలు మారాయి: భారత ఉద్యోగ విపణిలో అవకాశాలు తగ్గలేదు, కానీ ఒక నిర్మాణాత్మక మార్పు జరుగుతోంది. నైపుణ్యం, ఏఐ పరిజ్ఞానం ఉన్నవారికి మాత్రమే అవకాశాలు దక్కుతున్నాయి. బలమైన పునాదులతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలు, ఏఐ ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులే ఈ పోటీలో నిలబడతారు" అని అన్‌స్టాప్ వ్యవస్థాపకుడు, సీఈఓ అంకిత్ అగర్వాల్ విశ్లేషించారు.

# లీగ్ దశ ముగుస్తున్నా ధోనీ జాడేది.. చెన్నై ఎదురుచూపులు ఫలించేనా..!



ఐపీఎల్ ప్రతి సీజన్‌లో అభిమానులకు పిచ్చెక్కించే ఎంఎస్ ధోనీ పంతొమ్మిదో సీజన్‌లో ఇంకా అడుగే పెట్టలేదు. లీగ్ దశ ముగింపు దశకు చేరుకున్నా తాలా ఆటను ఫ్యాన్స్ మిస్సవుతున్నారు. ఆరంభ సీజన్ నుంచి వికెట్ల వెనకాల కుర్రాడిలా కదులుతూ.. ఫినిషర్‌గా సీఎస్కే విజయాల్లో కీలకమైన ధోనీ 19వ ఎడిషన్‌లో ఒక్క మ్యాచ్ ఆడలేదు. ఇదుగో వస్తుండు.. అదుగో వస్తుండు అనే మాటలు వినిపిస్తున్నా.. ఈ మాజీ కెప్టెన్ ఎంట్రీపై సీఎస్కే యాజమాన్యం స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. చెన్నై సూపర్ కింగ్స్‌ను ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన ధోనీ పంతొమ్మిదో సీజన్‌లో ఆడడంపై నెలకొన్ని అనిశ్చితికి తెరపడడం లేదు. మొన్నటికి మొన్న జట్టుతో పాటు హైదరాబాద్ వచ్చినా అతడు ఆడలేదు. రెండు రోజుల క్రితం ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో రోహిత్ శర్మను కలిసిన ధోనీ.. తుది జట్టులో ఉంటాడని అందరూ అనుకున్నారు. కానీ, ఆశ్చర్యంగా.. ఎల్ క్లాసికో మ్యాచ్‌కు ధోనీ, హిట్‌మ్యాన్ వరసగా రెండోసారి దూరమయ్యారు. మే 5న ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ కోసం జట్టంతా ఢిల్లీ వెళ్లగా ధోనీ చెన్నైలోనే ఉండిపోవడం అతడి రాక మరింత ఆలస్యం కానుందనే వార్తలకు బలం చేకూర్చుతోంది.

**వయసూ కారణమే..!**

పంతొమ్మిదో సీజన్ ముందు గాయపడిన ధోనీ.. కాలి పిక్క గాయం నుంచి కోలుకుంటున్నాడు. పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సాధించకపోవడంతోనే ఐపీఎల్ ఆడడం లేదని సమాచారం. వయసు 44 ఏళ్లు కావడంతో ధోనీ ఫిట్‌గా మారేందుకు మరికొంత సమయం పట్టనుంది. దాంతో.. చెన్నైలోనే తాలా పునరావాస కేంద్రంలో ఫిట్‌నెస్ మెరుగుపరుచుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో.. ధోనీ ఏదో ఒక దశలో అందుబాటులో ఉంటాడు అని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. పెద్దన్నలాంటి మహీ భాయ్ గైర్హాజరీలో రుతురాజ్ గైక్వాడ్ ఆరంభంలో తడబడినా ఎట్టకేలకు ట్రాక్‌లో పడ్డాడు. ఓపెనర్ శాంసన్.. మిడిలార్డర్‌లో ఉర్విల్, కార్తిక్ శర్మ.. పేసర్ అన్షుల్ కంబోజ్‌లు రాణిస్తుండగా చెన్నై నాలుగో విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.

### స్వదేశానికి ఆర్సీబీ ఓపెనర్.. కోహ్లీ జోడీ అతడేనా..!

పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు చేరువైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(=జదీ) కీలక బ్యాటర్ సేవల్ని కోల్పోయింది. ధనాధన్ ఆటతో శుభారంభాలు ఇచ్చే ఓపెనర్ ఫిల్ సాల్ట్ అనూహ్యంగా స్వదేశానికి పయనమయ్యాడు. వరసగా మూడు మ్యాచ్‌లకు దూరమైన సాల్ట్ గాయంతో బాధ పడుతుండడమే అందుకు కారణం. మెరుగైన చికిత్స కోసం ఈ డాషింగ్ బ్యాటర్ ఇంగ్లండ్‌కు వెళ్లాడు. దాంతో.. అతడు తిరిగి ఎప్పుడు ఆర్సీబీ స్క్వాడ్‌లో కలుస్తాడు? అనేది తెలియడం లేదు. టాపార్డర్‌లో దంచికొడుతూ ఆర్సీబీ విజయాల్లో కీలకమైన ఫిల్ సాల్ట్ ఐపీఎల్‌కు దూరమయ్యాడు. వేలి గాయంతో బాధ పడుతున్న సాల్ట్ స్వదేశం వెళ్లాడు. అక్కడ స్కానింగ్ పరీక్షలు చేయించుకొని కోలుకున్నాక తిరిగొచ్చే అవకాశముంది. ఏప్రిల్ 18న ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ అనంతరం సాల్ట్ మైదానంలోకి దిగలేదు. దాంతో.. సాల్ట్‌కు ఏమైంది? అని అభిమానులు ఆందోళన చెందారు. వారు భయపడినట్టే ఈ విధ్వంసక ప్లేయర్ సీజన్ మధ్యలోనే స్వదేశం బాట పట్టాడు.



**ఓపెనర్‌గా బెథెల్**

సాల్ట్ గైర్హాజరీలో విరాట్ కోహ్లీ జతగా కుర్రాడు జాకబ్ బెథెల్ ఇన్నింగ్స్ ఆరంభించడం ఖాయమైనట్టే. దూకుడైన ఆటతో ప్రత్యర్థి బౌలర్లను భయపెట్టే సాల్ట్ అందుబాటులో లేకపోవడంతో చురుకైన ఫీల్డర్‌ను కూడా బెంగళూరు కోలో?్పయింది. 18వ సీజన్‌లో ఆర్సీబీ ఛాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించిన సాల్ట్.. 19వ ఎడిషన్‌లోనూ దంచేశాడు. కేవలం ఆరు ఇన్నింగ్స్‌ల్లోనే 168.33 స్ట్రయిక్ రేటుతో 202 రన్స్ సాధించాడు. ప్రస్తుతం రెండో స్థానంలో కొనసాగుతున్న ఆర్సీబీ మే 7న లకో?్న సూపర్ జెయింట్స్‌ను ఢీ కొట్టనుంది.

## స్పోర్ట్స్

### షాక్‌లో ఆర్సీబీ.. 18 ఏళ్ల బంధానికి స్వస్తి!



ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సూపర్ ఫామ్ కొనసాగిస్తోంది. ఇప్పటివరకు సీజన్‌లో 9 మ్యాచ్‌లాడిన ఆర్సీబీ ఆరు విజయాలు సాధించి 12 పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. ఈసారి సీజన్‌లో ఆర్సీబీ సక్సెస్ వెనుక చాలా మంది ఆటగాళ్ల కృషి దాగుంది. బ్యాటింగ్ విభాగంలో కోహ్లితో పాటు కెప్టెన్ పటీదార్, దేవదత్ పడిక్కల్, టిమ్ డేవిడ్‌లు అదరగొడుతుంటే, బౌలింగ్‌లో హాజిల్‌వుడ్, భువనేశ్వర్, సుయాశ్ శర్మ, కృనాల్ పాండ్యాలు స్థిరమైన ప్రదర్శన కొనసాగిస్తున్నారు. ఇక 19 ఏళ్లుగా ఒకే జట్టుకు ఆడుతున్న కింగ్ విరాట్ కోహ్లి ఐపీఎల్ 2026 సీజన్‌లోనూ బ్యాటింగ్‌తో అదరగొడుతున్నాడు. 9 మ్యాచ్‌ల్లో కోహ్లి 165.50 స్ట్రైక్‌రేట్‌తో 379 పరుగులు సాధించాడు. గతేడాది తొలిసారి చాంపియన్స్‌గా నిలిచిన ఆర్సీబీ వరుసగా ఈ సీజన్‌లోనూ కప్ సాధించాలని ఉవ్విళ్లూరుతోంది. అయితే ఒక వార్త మాత్రం ఆర్సీబీని తెగ బాధపెట్టేస్తోంది. అదేంటంటే 18 ఏళ్ల పాటు ఆర్సీబీ ఫిజియోగా సేవలందించిన ఎవన్ స్పీచ్‌లీకి ఆర్సీబీ ఘనంగా ఫేర్‌వెల్ ఇచ్చింది. ఆర్సీబీ జట్టు వెనుక ఎవన్ స్పీచ్‌లీ పాత్ర మరువలేనిది. 2008 నుంచి 2025 సీజన్ వరకు ఎవన్ స్పీచ్‌లీ ఆర్సీబీకి ఫిజియోగా పనిచేశాడు. ఈ 18 ఏళ్లలో ఎంతో మంది ఆర్సీబీ ఆటగాళ్ల ఫిట్‌నెస్‌తో పాటు వాళ్లు గాయాల నుంచి త్వరగా కోలుకునేందుకు ఎవన్ ఎంతో కృషి చేశారు. అయితే గత సీజన్ ముగిసిన అనంతరం ఎవన్ స్పీచ్‌లీ ఆర్సీబీ ఫిజియోగా రిటైర్ అయ్యారు. ఈ నేపథ్యంలో ఎవన్ స్పీచ్‌లీకి 'ఒక అధ్యాయం ముగిసింది' (ఎండ్ ఆఫ్ ఎరా) పేరుతో ఫేర్‌వెల్ ఘనంగా నిర్వహించింది. దీనికి సంబంధించిన వీడియోనూ ఆర్సీబీ తమ 'ఎక్స్' వేదికగా షేర్ చేసుకుంది. ఫిజియోగా రిటైర్ అయిన తర్వాత స్వదేశంలో ఉండిపోయిన ఎవన్ స్పీచ్‌లీ ఈ ఫేర్‌వెల్ వేడుక కోసం బెంగళూరుకు రావడం విశేషం. కోహ్లి సహా ఆర్సీబీ ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్ ఎవన్‌కు గార్డ్ ఆఫ్ హానర్‌తో గౌరవించారు. ' ఎండ్ ఆఫ్ ఎరా, ఎవన్ స్పీచ్‌లీ'. నీ లెగసీని ఆర్సీబీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. 18 ఏళ్లుగా ఎవన్ స్పీచ్‌లీ ఆర్సీబీకి హెడ్ ఫిజియోగా వ్యవహరించారు. అందుకే అతనికి ఘనంగా వీడ్కోలు పలుకుతున్నాం.' అని క్యాప్షన్ జత చేసింది.



## ఏంటీ ప్రభాస్ కల్కి సీక్వెల్ షూట్‌లో జాయిన్ అయ్యాడా..?

ప్రభాస్ అభిమానులతో, సైన్స్ ఫిక్షన్ జోనర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటి 'కల్కి 2898 ఏడీ' ప్రాంచైజీ. ఇప్పటికే ఫస్ట్ పార్ట్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ప్రభాస్-నాగ్ అశ్విన్ టీం ఇక సీక్వెల్‌తో ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసిందే. అయితే సీక్వెల్ ఎప్పుడు సెట్స్‌పైకి వెళుతుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం ఇప్పటికే అమితాబ్ బచ్చన్ షూట్‌లో పాల్గొన్నట్టు ఆసక్తికర అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. తాజాగా మరో ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. హీరో ప్రభాస్ నేడు కల్కి సీక్వెల్ షూట్‌లో జాయిన్ అయ్యాడట. ఎక్కువగా నైట్ షూట్స్ ఉండనుండగా.. కొన్ని రోజులపాటు ఈ షెడ్యూల్‌లో పాల్గొనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రభాస్ షూట్‌కు సంబంధించి మేకర్స్ ఏమైనా అప్‌డేట్స్ అందిస్తారేమో చూడాలి. కాగా ఫస్ట్ పార్ట్‌లో దీపికా పదుకొనే పోషించిన సుమతి పాత్ర కోసం సీక్వెల్‌లో ఇంకా ఏ నటిని ఫైనల్ చేయలేదు మేకర్స్. కమల్ హాసన్‌తోపాటు పలువురు కీలక నటీనటులు సీక్వెల్‌లో కనిపించబోతున్నట్టు తెలుస్తుండగా.. మేకర్స్ నుంచి అప్‌డేట్ రావాల్సి ఉంది. భారీ విజువల్ వండర్‌గా మారిన 'కల్కి 2898 ఏడీ'లో ప్రభాస్, దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి లీడ్‌యాక్టర్లు నటించడంతో ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. భారీ విఎఫ్‌ఎక్స్, యూనిక్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఫస్ట్ పార్ట్‌ను తెరకెక్కించిన వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సీ అశ్వనీదత్ ఈ చిత్రాన్నినిర్మించనున్నారు.

## బాడీ షేమింగ్‌తో నరకం చూశా.. 15 రోజులు ఆసుపత్రిలో చికిత్స






ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్ సురేఖా వాణి కుమార్తెగా ప్రేక్షకులకు పరిచయమైన సుప్రిత ఇటీవల తన వ్యక్తిగత జీవితంలోని కఠిన అనుభవాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. సోషల్ మీడియా స్టార్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, ప్రస్తుతం హీరోయిన్‌గా సినీ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సుప్రిత, సోషల్ మీడియాలో ఎదురైన విమర్శలు, బాడీ షేమింగ్ కామెంట్లు తనపై తీవ్ర ప్రభావం చూపాయని చెప్పారు. బరువు తగ్గాలనే ఆరాటంలో తాను అనుసరించిన తప్పుడు ఆహారపు అలవాట్లు తన ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీశాయని వెల్లడించారు.రోజుకు 15 గంటల పాటు ఏమీ తినకుండా ఉండి, తర్వాత ఒక్కసారిగా హెవీ ఫుడ్ తీసుకునేదాన్ని. దీంతో వాంతులు, తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చాయి. 15 రోజుల పాటు ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చింది. నీళ్లు తాగినా కూడా పడని పరిస్థితి. ఆ నొప్పి తట్టుకోలేక ఒక దశలో 'నన్ను చంపేయండి' అని అమ్మను అడిగాను అంటూ తన అనుభవాన్ని వివరించారు.

## బన్నీ సీక్రెట్స్ వైరల్.. అల్లు అర్జున్‌పై శిరీష్ సరదా కామెంట్స్!



పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన అల్లు అర్జున్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా భారీ క్రేజ్‌ను సొంతం చేసుకున్నాడు. ముఖ్యంగా 'పుష్ప' సినిమాతో ఆయన రేంజ్ అమాంతం పెరిగిపోయింది. ఉత్తరాదిలో కూడా విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుని, టాప్ స్టార్‌ల సరసన నిలిచాడు. దీంతో బన్నీతో సినిమా చేయడానికి పలువురు దర్శకులు ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి సమయంలో ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ పాత వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో ఆయన తమ్ముడు అల్లు శిరీష్ చేసిన కామెంట్స్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. గతంలో అల్లు శిరీష్, నటుడు అలీ హోస్ట్ చేసిన 'అలీతో సరదాగా' కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యాడు. ఆ సందర్భంగా తన అన్న అల్లు అర్జున్ గురించి సరదాగా మాట్లాడుతూ చిన్నప్పటి జ్ఞాపకాలను పంచుకున్నాడు. శిరీష్ మాట్లాడుతూ, చిన్నప్పుడు బన్నీకి చదువు అంతగా రాదని సరదాగా చెప్పాడు. "అమ్మ రాత్రంతా కూర్చోబెట్టి ఎంత చదివించినా, ఉదయానికి చదివింది మొత్తం మర్చిపోయేవాడు. పరీక్షల్లో కూడా పెద్దగా రాసేవాడు కాదు" అంటూ నవ్వుతూ చెప్పిన వ్యాఖ్యలు ఇప్పుడు మళ్లీ వైరల్ అవుతున్నాయి. ఇక మరో సందర్భంలో తమ అన్నదమ్ముల మధ్య ఉన్న అనుబంధాన్ని కూడా శిరీష్ వివరించాడు. "నేను ఏ కొత్త డ్రెస్ వేసుకున్నా ముందుగా బన్నీ వేసుకునేవాడు. తర్వాత నేను వేసుకుంటే అందరూ 'ఇది బన్నీ డ్రెస్ కదా' అని అడిగేవారు" అంటూ చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకున్నాడు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండగా, అభిమానులు సరదాగా కామెంట్స్ చేస్తున్నారు. కొందరు బన్నీ చిన్నప్పటి విషయాలు తెలిసి ఆశ్చర్యపోతుండగా, మరికొందరు అన్నదమ్ముల బాండింగ్‌ను మెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా, అల్లు అర్జున్ ప్రస్తుతం తన తదుపరి ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నాడు. 'పుష్ప 2' విజయానంతరం ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'రాకా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు దర్శకుడు అట్లీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన టైటిల్ పోస్టర్‌లో బన్నీ లుక్ పూర్తిగా భిన్నంగా ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.




## 'వారణాసి' షూటింగ్‌కు నీటి కష్టాలు... రాజమౌళి ప్లాన్‌కు బ్రేక్ పడిందా!

సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న 'వారణాసి' సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. భారీ బడ్జెట్‌తో శ్రీ దుర్గా ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్లపై నిర్మితమవుతున్న ఈ చిత్రం కోసం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా భారీ సెట్లు నిర్మించారు. ముఖ్యంగా రాజేంద్రనగర్‌లోని గగన్‌పహాడ్ ప్రాంతంలో వేసిన సెట్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.తాజాగా ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సినిమాలో భాగంగా నీటి అడుగున జరిగే కొన్ని సన్నివేశాలను చిత్రీకరించేందుకు రాజమౌళి ప్లాన్ చేశారట. ఇందుకోసం భారీ స్థాయిలో నీరు అవసరమవుతుందని, దాదాపు 10 వేల లీటర్ల సామర్థ్యం గల 150 ట్యాంకర్ల నీటిని సరఫరా చేయాలని నిర్మాణ సంస్థ హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డును సంప్రదించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఎండలు తీవ్రంగా ఉండటం, నగరంలో నీటి డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ అభ్యర్థనను వాటర్ బోర్డ్ తిరస్కరించిందని వార్తలు వినిపిస్తున్నాయి. సరఫరా చేసే నీటిని శుద్ధి చేసి వినియోగించుకోవాలని, ట్యాంకర్ ఛార్జీలను నిర్మాతలే భరిస్తారని లేఖలో పేర్కొన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో అంతటి నీటిని అందించడం సాధ్యం కాదని అధికారులు తెలిపినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై అధికారిక ధృవీకరణ ఇంకా వెలువడలేదు. ఇక మరోవైపు మహేష్ బాబు ఇటీవల జర్మనీకి వెళ్లి బ్లాక్ ఫారెస్ట్‌లో ట్రెక్కింగ్, ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. త్వరలోనే తదుపరి షెడ్యూల్ ప్రారంభం కానుండగా, మే 18 నుంచి అండర్‌వాటర్ సన్నివేశాల షూటింగ్ చేపట్టాలని చిత్రబృందం యోచిస్తోంది. ఈ సినిమాలో మహేష్ బాబు ద్విపాత్రాభినయం పోషిస్తుండగా, 'రుద్ర' మరియు 'శ్రీరాముడు' పాత్రల్లో కనిపించనున్నారని టాక్. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రకాశ్ రాజ్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కథను విజయేంద్ర ప్రసాద్ అందిస్తుండగా, సంగీతాన్ని ఎం.ఎం. కీరవాణి సమకూరుస్తున్నారు. 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ భారీ చిత్రం గురించి వస్తున్న ప్రతి అప్డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం నీటి వివాదం నిజమా కాదా అన్నది క్లారిటీ రావాల్సి ఉంది.

## త్రిష బర్త్ డే స్పెషల్.. పోస్టర్ విడుదల, అవనిగా మెప్పించనున్న చెన్నై చంద్రం

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ ఎపిక్ 'విశ్వంభర' సినిమా ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా నటి త్రిష కృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఆమె క్యారెక్టర్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ పోస్టర్‌లో త్రిష ట్రెడిషనల్ లుక్‌లో డివైన్ ఔరాతో కనిపిస్తూ ఆకట్టుకుంది. అయితే ఇది కేవలం గ్లామర్ పాత్ర మాత్రమే కాదని, కథలో కీలక పాత్ర పోషించబోతుందని స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, త్రిష పోషిస్తున్న 'అవని' పాత్ర సినిమా కథలో కీలక మలుపులు తీసుకువచ్చే ప్రధాన అంశంగా ఉండనుంది. ముఖ్యంగా ఈ పాత్ర చుట్టూనే సినిమా నెరేషన్ తిరిగే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటివరకు త్రిష చేసిన పాత్రలతో పోలిస్తే, ఈ పాత్రలో ఎక్కువ ఎమోషనల్ వెయిట్, డెప్త్ ఉండబోతుందని తెలుస్తోంది. కేవలం స్క్రీన్ ప్రెజెన్స్‌కే పరిమితం కాకుండా, కథను ముందుకు నడిపించే డ్రైవింగ్ ఫోర్స్‌గా అవని పాత్ర ఉండటం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. గత కొన్నేళ్లుగా సెలెక్టివ్ ప్రాజెక్ట్స్‌తో ముందుకు సాగుతున్న త్రిషకు 'విశ్వంభర' ఒక స్ట్రాంగ్ కంబ్యాక్‌గా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో పవర్‌ఫుల్ పాత్ర దక్కడం ఆమె కెరీర్‌కు మరో మైలురాయిగా మారవచ్చని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మెగాస్టార్ చిరంజీవి-త్రిష కాంబినేషన్ కూడా ఈ సినిమాకు మరో ప్రధాన హైలైట్. గతంలో వీరిద్దరి మధ్య ఉన్న ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు సోషియో ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో వారి పాత్రలు ఎలా మలచబడ్డాయో అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ ఇద్దరి ట్రాక్ సినిమా ఎమోషనల్ కోర్‌గా నిలుస్తుందని టాక్. ఈ చిత్రానికి దర్శకుడు వశిష్ట విజువల్ ట్రీట్ ఇవ్వడానికి భారీ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. హాలీవుడ్ స్థాయి వీఎఫ్ఎక్స్ స్టూడియోలు ఈ ప్రాజెక్ట్‌పై పనిచేస్తున్నాయని సమాచారం. దీంతో 'విశ్వంభర' విజువల్‌గా కూడా అద్భుతంగా ఉండనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో వేగంగా కొనసాగుతోంది. యువీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం టాలీవుడ్‌లో నెవర్ బిఫోర్ అనిపించే స్థాయిలో ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో రూపొందుతోంది. మేకర్స్ త్వరలోనే రిలీజ్ డేట్‌ను ప్రకటించే అవకాశముంది.




Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,